

రాజశేఖర చరిత్రము
రూ॥ 180/-
పేజీలు: 190
నవచేతన పబ్లిషింగ్ హౌస్
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★


## టిపిసిసి నూతన జంబో కార్యవర్గం

ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి.వేణుగోపాల్ వెల్లడి



06


సంపుటి 27, సంచిక: 349 | మంగళవారం | 10-06-2025 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


## సాంకేతిక అంశాలు ఇంజనీర్లకే తెలుసు

- కేవలం పరిపాలనాపరమైన నిర్ణయాలు మాత్రమే మంత్రివర్గం తీసుకుంది
- మహారాష్ట్ర, సిడబ్ల్యుసి అభ్యంతరాల మేరకే ప్రాజెక్టును మార్చాం
- జస్టిస్ పిసి ఘోష్ విచారణ కమిటీ ప్రశ్నలకు మాజీ మంత్రి హరీష్‌రావు సమాధానాలు

ప్రజాపక్షం/హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణానికి సంబంధించి విధానపరమైన అన్ని నిర్ణయాలు రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదంతోనే చేపట్టామని మాజీ నీటి పారుదలశాఖ మంత్రి టి.హరీశ్‌రావు జస్టిస్ పి.సి. ఘోష్ విచారణ కమిటీకి తెలిపారు. సాంకేతిక అంశాలు ఇంజనీర్ అధికారులకు మాత్రమే తెలుసని, తాము కేవలం పరిపాలనపరమైన నిర్ణయాలు మాత్రమే తీసుకున్నామని వివరించారు. హైదరాబాద్‌లోని బిఆర్‌కె భవన్‌లోని 'కాళేశ్వరం కమిషన్' కార్యాలయంలో జస్టిస్ పిసిఘోష్ విచారణ కమిషన్ ముందు హరీశ్‌రావు సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా జస్టిస్ పిసి ఘోష్ అడిగిన పలు ప్రశ్నలకు హరీశ్‌రావు సమాధానమిచ్చారు. మొత్తం 16 ప్రశ్నలకు హరీష్‌రావు నుంచి కమిషన్ సమాధానాలను రాబట్టి, ఆయన వాంగ్మూలాన్ని రికార్డ్ చేసింది. ముందుగా నీటి పారుదల తరువాయి 2లో



## ఎవరు చెబితే ట్యాప్ చేశారు?

- కుట్రదారులు ఎవరు.. పాత్రధారులు ఎవరు..
- ఎవరి ఆదేశాల మేరకు హార్డ్‌డిస్క్‌లను మాయం చేశారు..
- ప్రభాకర్‌రావును 8 గంటలు ప్రశ్నించిన సిట్ అధికారులు
- పై అధికారుల ఆదేశాలతోనే చేశానని వెల్లడి?
- రేపు మళ్లీ విచారణ



ప్రజాపక్షం/హైదరాబాద్

తెలంగాణ రాజకీయాలను షేక్ చేసిన ఫోన్‌ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు ప్రత్యేక ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబి) మాజీ చీఫ్ ఐజి టి. ప్రభాకర్ రావును సిట్ సోమవారం విచారించింది.ఏడాదికిపైగా పరారీలో ఉన్న ప్రభాకర్‌రావు అమెరికా నుంచి ఆదివారం రాత్రి హైదరాబాద్ చేరుకున్న విషయం తెలిసిందే. సోమవారం ఉదయం 11:20 గంటలకు జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయంలో సిట్ అధికారుల ముందు ప్రభాకర్‌రావు విచారణకు హాజరయ్యారు. రాత్రి 7:35 గంటల (8 గంటల పాటు) వరకు వెస్ట్ జోన్ డిసిపి విజయ్ కుమార్ నేతృత్వంలో జూబ్లీహిల్స్ ఎసిపి పి. వెంకటగిరి సహా ఐదుగురు సభ్యుల బృందం ప్రభాకర్ రావును విచారించింది. సిట్ బృందం అతనిపై ప్రశ్నల వర్షం కురిపించారు. తిరిగి బుధవారం విచారణకు హాజరుకావాలని సిట్ అధికారులు ప్రభాకర్‌రావుకు నోటీసులు తరువాయి 2లో

## భారత్ గౌరవాన్ని అమెరికాకు మోదీ తాకట్టు

సిఆర్ జయంతి సభలో సిపిఐ జాతీయ కార్యదర్శి బినోయ్ విశ్వం

- ప్రధాని వైఖరిపై అసంతృప్తిలో భారతీయులు
- 75 ఏళ్ల స్వాతంత్ర్యానంతరం స్వరాజ్యం ఎక్కడ?




ప్రజాపక్షం/హైదరాబాద్

ప్రపంచ దేశాలపై సుంకాల పేరుతో అమెరికా అధ్యక్షులు ట్రంప్ చేస్తున్న దాడిని అన్ని దేశాలు తిరస్కరిస్తున్నాయని, తిరస్కరించని ఏకైక దేశం భారతదేశం మాత్రమేనని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి బొనోయ్ విశ్వం విమర్శించారు. అమెరికాకు భారత దేశ గౌరవాన్ని ప్రధాని మోదీ తాకట్టు పెట్టారని, ప్రధాని మోదీ అనుసరించిన ఈ వైఖరి పట్ల దేశ ప్రజలు తీవ్రమైన అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.మనిషికి, మానవత్వానికి, సమానత్వానికి, ప్రజాస్వామ్యానికి విలువను ఇచ్చే వామపక్షాలు ఒక వైపు ఉండగా, మరోవైపు ప్రజాస్వామ్యాన్ని , మతాన్ని దుర్వినియోగం చేసి సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు ఫాసిస్టు శక్తులు ఉన్నాయని, ఈ రెండింటికి మధ్య సామరస్యం, ఏకీభావం కుదరడం అసాధ్యమన్నారు. సిపిఐ అగ్ర నాయకులు చంద్ర రాజేశ్వరరావు 111వ జయంతి సభ హైదరాబాద్ కొండాపూర్‌లోని సిఆర్ ఫౌండేషన్‌లో సోమవారం జరిగింది. సిఆర్ ఫౌండేషన్ గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ముఖ్యఅతిథిగా బినోయ్ విశ్వం, ప్రముఖ ఆర్థికవేత్త ప్రొఫెసర్ డి.నరసింహా రెడ్డి, శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, సిఆర్ ఫౌండేషన్ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంఎల్ఏ పల్లా వెంకట రెడ్డిలు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సభలో బినోయ్ విశ్వం ప్రసంగిస్తూ అమెరికాలో రాజకీయాలలో కార్పొరేట్ శక్తులు రాజ్యమేలుతున్నాయని, ప్రపంచ రాజకీయాలు ఆర్థిక వ్యవస్థను కుదేలు చేస్తున్నాయని విమర్శించారు. వలసలు, అక్రమ కార్మికుల పేరుతో అమెరికాలో ఉంటున్న భారతీయులను నేరస్తుల మాదిరిగా మిలిటరీ విమానాల్లో కుక్కి, కాళ్లకు బేడీలు వేసి 40 గంటలు ప్రయాణం చేయించి ఇక్కడ వదిలి పెట్టినా 56 ఇంచుల చాతి కలిగిన ప్రధాని మోదీ ఒక బానిస మాదిరిగా నోరు విప్పకపోవడం అన్యాయమన్నారు. స్వాతంత్ర్య పోరాట కాలంలో గాంధీజీ నినదించిన 'స్వరాజ్యం' అంటే ప్రజలందరికీ కూడు, గుడ్డ, నీడ అని, స్వాతంత్ర్యం వచ్చిన 75 ఏళ్ళ ల తరువాత కూడా స్వరాజ్యం ఎక్కడుందని తరువాయి 2లో

### పేదరికం తగ్గిందనడం హాస్యాస్పదం : ప్రొ.నరసింహారెడ్డి



ఆర్థికవేత్త ప్రొఫెసర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో పేదరికం తగ్గిందని ప్రపంచ బ్యాంకు పేర్కొనడం హాస్యాస్పదమని, ప్రజల కొనుగోలు శక్తి ఆధారంగా పేదరికాన్ని అంచ నా వేయడం తగదన్నారు. దేశంలో ప్రజలు ఇంకా నిరుద్యోగం, విద్య, ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నారని చెప్పిరు. ఒక వేళ ప్రపంచ బ్యాంకు పేర్కొన్నట్లు దేశంలో పేదరికం తగ్గితే ప్రజలకు విద్య, వైద్యం, ఉపాధి సదుపాయాలు ఎందుకు లభించడంలేదని ప్రశ్నించారు. భారతదేశం జిడిపి వృద్ధిలో జపాన్‌ను దాటిపోయిందని చెబుతున్న ప్రధాని మరి తలసరి ఆదాయంలో ప్రపంచంలో భారత్ 136వ స్థానంలో ఎందుకు ఉందని ఆయన నిలదీశారు. దేశంలో నిరుద్యోగం ఇంకా 6 శాతం నిరుద్యోగం ఉందని, అందులోనూ నిరుద్యోగ యువత అధికంగా ఉందన్నారు. 'ట్రికిల్ డౌన్' సిద్ధాంతం ప్రకారం దేశ ఉత్పత్తి, ఆదాయంలో సమాజంలోని కిందిస్థాయి వర్గాలకు రావాల్సిన వాటా రావడంలేదని, పైగా క్రమంగా సంపన్న వర్గాలకు లబ్ధి పెరుగుతున్నదని, కింది స్థాయి వారికి లబ్ధి తగ్గుతున్నదని, ఇది దేశ సంక్షేమానికి, పురోగతికి మంచిదికాదన్నారు. దేశంలో పది శాతం చేతిలో 64 శాతం సంపద వెళ్తుండగా, 90 శాతం ఉన్న ప్రజలకు 36 శాతమే చేరుతుందన్నారు.

## శాఖల కేటాయింపుపై తీవ్ర ఉత్కంఠ

- మంత్రులకు శాఖలను పునర్ వ్యవస్థీకరించే విషయంపై అధిష్ఠానంతో సిఎం రేవంత్‌రెడ్డి చర్చలు
- భట్టి విక్రమార్కకు హోం శాఖ కేటాయించే అవకాశం


ప్రజాపక్షం /హైదరాబాద్



రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ పాక్షిక విస్తరణ పూర్తయిన తర్వాత ఇప్పుడు అందరి దృష్టి శాఖల కేటాయింపుపై కేంద్రీకృతమైంది. ఈ విషయంపై పార్టీ అధిష్టానంతో చర్చించడానికి సిఎం రేవంత్ రెడ్డి సోమవారం సాయంత్రం ఢిల్లీ వెళ్ళారు. మొత్తం మంత్రుల శాఖలను పునర్ వ్యవస్థీకరించే విషయంపై కూడా పార్టీ అధిష్టానంతో సిఎం చర్చిస్తారని అంటున్నారు. పూర్తిస్థాయి మంత్రివర్గం లేకపోవడంతో హోమ్, మునిసిపల్, విద్య తదితర అనేక ముఖ్య శాఖలు సిఎం రేవంత్ రెడ్డి తన వద్దనే ఉంచుకున్నారు. కొత్త మంత్రులకు శాఖల కేటాయింపు సమయంలో మంత్రుల శాఖల్లో పెద్ద సంఖ్యలో మార్పులు ఉంటాయని ప్రచారం జరుగుతోంది. పార్టీ వర్గాల సమాచారం ప్రకారం, ఆర్థిక, పౌర సరఫరాల శాఖల మంత్రుల మార్పుపై సిఎం హైకమాండ్‌తో చర్చిస్తారని చెబుతున్నారు. మున్సిపాలిటీ, విద్య, ఇతర శాఖల కేటాయింపుపై చర్చ జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతుంది. ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు ముఖ్యమైన హోం శాఖను ఇవ్వవచ్చని పార్టీ వర్గాలు అంటున్నాయి. మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ప్రస్తుత ఐటి, పరిశ్రమ శాఖలతో పాటు మరికొన్ని శాఖలు ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. ఇదిలా ఉండగా స్థానిక సంస్థల ఎన్నికలను ఖచ్చితంగా నిర్వహించాలని ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశంలో పలువురు మంత్రులు అభిప్రాయపడినట్లు సమాచారం. ఈ విషయాన్ని కూడా ఎఐసిసి అగ్ర నేతలతో సిఎం రేవంత్‌రెడ్డి చర్చించే అవకాశం ఉంది. గత కొంత కాలంగా పెండింగ్‌లో ఉన్న వివిధ కార్పోరేషన్ల చైర్మన్ పదవులను ఇచ్చి స్థినిక సంస్థల ఎన్నికలకు వెళ్ళాలని తద్వారా పదవులు తరువాయి 2లో

## కూనంనేనిపై ఎన్నికల పిటిషన్ కొట్టివేత

న్యాయం గెలిచింది : సాంబశివరావు



ప్రజాపక్షం/హైదరాబాద్

కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుపై దాఖలైన ఎన్నికల పిటిషన్‌ను కొట్టివేస్తూ హైకోర్టు సోమవారం తీర్పు వెలువరించింది. శాసనసభకు 2023లో జరిగిన ఎన్నికల సమయంలో నిబంధనల మేరకు కూనంనేని అఫిడవిట్ దాఖలు చేయలేదని కొత్తగూడెం పట్టణానికి చెందిన నందూలాల్ పిటిషన్ దాఖలు చేశారు.. కూనంనేని ఎన్నికను రద్దు చేస్తూ తీర్పు చెప్పాలని హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో కోరారు. అవసరమైన సమాచారా న్ని అం దించడంలో కూనంనేని విఫలమయ్యారని, ముఖ్య సమాచారాన్ని గోప్యంగా ఉంచారని, ఎన్నికల నిర్వహణ నియమాలను పాటించకుండా తప్పుడు ఫారమ్–26 అఫిడవిట్ సమర్పించారని ఆరోపించారు. ప్రజాప్రతినిధ్య చట్టం 1951 కింద జైలు శిక్ష, జరిమానా విధించాలని, ఎమ్మెల్యేగా ఎన్నిక చెల్లదని ప్రకటించాలని కూడా కోరారు. ఈ పిటిషన్‌పై విచారణ జరుగుతున్నప్పుడే నందూలాల్ పిటిషన్‌ను కొట్టివేయాలని కూనంనేని దాఖలు చేసిన వ్యాజ్యాన్ని గతంలో కొట్టివేసింది. దీనిపై సుప్రీం కోర్టుకు వెళ్లినప్పటికీ ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో నందూలాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ పూర్తి చేసిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.లక్ష్మ ణ్ సోమవారం తీర్పు వెలువరించారు. నందూలాల్ దాఖలు చేసిన పిటిషన్‌ను కొట్టివేశారు. తగిన ఆధారాలు లేకుండా నందూలాల్ పిటిషన్ దాఖలు చేశారని తప్పుపట్టారు. సుప్రీంకోర్టు గతంలో జారీ చేసిన తీర్పులను ఉదహరించారు. ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి విజయాన్ని తేలికగా తీసుకుని, ఆ ఎన్నికపై జోక్యం చేసుకోకూడదని చెప్పారు. ఎన్నికపై జోక్యం చేసుకోవాలనే ఎలక్షన్ పిటిషన్ చట్టానికి అనుగుణంగా ఉండాలని, అయితే, నందూలాల్ పిటిషన్ అందుకు తరువాయి 2లో

### పిటిషన్ చట్ట వ్యతిరేకం

తీర్పులో హైకోర్టు వ్యాఖ్యలు

'కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుపై దాఖలైన ఎన్నికల పిటిషన్ చట్ట వ్యతిరేకం. అన్ని దశలోను ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాల్సిందే. ఈ విషయంలో ఎలాంటి సందేహం లేదు. స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ ఉండాలన్న విషయమూ అంతే. ఇలా జరిగితేనే ప్రజాస్వామ్యం. ఎన్నికల పిటిషన్‌లో కీలకమైన ఆధారాలుంటే తప్ప ప్రజలు ఇచ్చిన తీర్పులో కోర్టులు జోక్యం చేసుకోలేవు' అని తీర్పు ప్రతిలో హైకోర్టు వ్యాఖ్యనించింది. 'కూనంనేని నామినేషన్ దాఖలు సమయంలో సమర్పించిన అఫిడవిట్‌లో తన భార్య పేరు గు రించి చెప్పలేదని చెప్పి ఆయన ఎన్నిక చెల్లదని కోరడమేమిటి? భార్య పేరు రాయకపోతే, కూనంనేని ఎన్నిక చెల్లకుండా పోతుందా? భార్యకు చెందిన అయిదేళ్ల ఆదాయ పు పన్ను రిటర్నులు, ఆస్తులు, అప్పుల తరువాయి 2లో



భారత వ్యోమగామి శుభాంశు శుక్లా

## అంతరిక్ష యాత్ర రేపు

**ఫ్లోరిడా:** భారత అంతరిక్షయాన చరిత్రలో మరో కొత్త అధ్యయనం బుధవారం ఆవిష్కారం కానుంది. ఇండియన్ ఎయిర్ ఫోర్స్ అధికారి శుభాంశు శుక్లా ఆక్సియమ్ మిషన్ 4 ద్వారా అంతరిక్ష యాత్రకు కౌంట్‌డౌన్ మొదలైం ది. రాకేశ్ శర్మ తర్వాత ఒక భారతీయుడు అంతరిక్షంతలోకి వెళ్లడం ఇదే మొ దటిసారి. అంతేకాగ, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లోకి అడుగుపెట్టనున్న తొలి భారతీయుడుగా శుక్లా చరిత్ర సృష్టించనున్నాడు. ఐఎస్ఎ స్ వైపు సాగే నాలుగో ప్రైవేటు వ్యోమగామి యాత్ర ఆక్సియమ్ మిషన్ 4 కేవ లం ఒక అంతరిక్ష యాత్ర కాదు. ఇది ప్రపంచ దేశాల సహకారాన్ని, అంతరిక్ష వ్యాపారంలో దూసుకుపోతున్న అభివృద్ధిని ప్రతిబింబించే చారిత్రక ఘ ట్టం. ఆక్సియమ్ స్పేస్, స్పేస్‌ఎక్స్, నాసా వంటి గొప్ప సంస్థల భాగస్వామ్యం తో జరుగుతున్న ఈ యాత్ర అంతరిక్షాన్ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడమేగాక, ఈ ఉత్సాహభరితమైన రంగంలో భారతదేశం సాధిస్తున్న అద్భుత ప్రగతిని, భవిష్యత్ ఆకాంక్షలను ప్రపంచానికి చాటి చెబుతోంది. భారత కాలమానం ప్రకారం, జూన్ 10న జరగాల్సిన ప్రయోగం ఒకరోజు వాయిదాపడి, జూన్ 11తేదీ, బుధవారం జరగనుంది. స్పేస్‌ఎక్స్ ఫాల్కన్ 9 రాకెట్, స్పేస్‌ఎక్స్ డ్రాగన్ అంతరిక్ష నౌక (క్రూ డ్రాగన్ సి213)ను నింగిలోకి మోసుకెళ్తుంది. ప్రస్తుతం ఉన్న సమాచారం మేరకు ఈ అంతరిక్ష నౌక సుమా రు 28 గంటల పాటు కక్ష్యలో ప్రయాణించి తరువాయి 12లో

## అత్యంత వేగంగా భారత్ అభివృద్ధి



11 ఏళ్లుగా సుపరిపాలన, సామాజిక ఉన్నతే లక్ష్యంగా పాలిస్తున్నాం

ప్రధాని నరేంద్ర మోదీ

**న్యూఢిల్లీ :** ఎన్‌డిఎ 11 ఏళ్ల పాలనలో భారత దేశం అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా అవతరించిందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. వాతావరణ మార్పులు, డిజిటల్ ఇన్నోవేషన్ వంటి రంగాల్లో ప్రపంచ గళంగానూ మారిందని పేర్కొన్నారు. తన నేతృత్వంలోని మూడోవిడత ఎన్‌డిఎ ప్రభుత్వం ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా తన అభిప్రాయాలను పంచుకున్నారు. సుపరిపాలన, పరివర్తనపై పూర్తిస్థాయిలో దృష్టిసారించామని ప్రధాని మోదీ అన్నారు. సామాజిక న్యాయానికి సైతం అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు గుర్తుచేసిన ప్రధాని మోదీ, తమ మంత్రి మండలిలో 60 శాతం మంది ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాల వారే ఉన్నట్లు తెలిపారు. ఈ స్థాయిలో ఎస్‌సి, ఎస్‌టి, ఒబిసి వర్గాలకు మంత్రి పదవులు కేటాయించడం ఇదే తొలిసారి అని పేర్కొన్నారు. ఎన్‌డిఎ 11 ఏళ్ల ప్రస్థానంలో ఆర్థిక వృద్ధి నుంచి తరువాయి 2లో

## అన్నింటా వైఫల్యం... వ్యవస్థల విధ్వంసం

- ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక నిర్మాణానికి తీవ్ర దెబ్బ
- 11 ఏళ్ల మోదీ సర్కారు పాలనపై కాంగ్రెస్ మండిపాటు
- రాజ్యాంగ ప్రతులపై నియంతృత్వ సిరా: మల్లికార్జున ఖర్గే
- ప్రచారానికే పరిమితం: రాహుల్



**న్యూఢిల్లీ :** నరేంద్ర మోదీ ప్రభుత్వం వరుసగా మూడోసారి అధికారం చేపట్టి ఏడాది పూర్తయింది. ఈ నేపథ్యంలో ఎన్‌డిఎ ప్రభుత్వ విధానాలపై కాంగ్రెస్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఈ 11 ఏళ్లలో మోదీ ప్రభుత్వం ప్రజాస్వామ్యం, ఆర్థిక వ్యవస్థ, సామాజిక వ్యవస్థను భారీగా దెబ్బతీసిందని మండిపడింది. ఈ ప్రభుత్వ రాజ్యాంగంలోని ప్రతి పేజీలో నియంతృత్వం సిరాను మాత్రమే అద్దిందని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఎక్స్‌లో పేర్కొన్నారు. బిజెపి, ఆర్ఎస్ఎస్‌లు ప్రతి రాజ్యాంగ సంస్థను బలహీనపరిచాయని, వాటి స్వయం ప్రతిపత్తిపై దాడి చేశాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాభిప్రాయానికి తరువాయి 2లో



పోలీస్ వాహనం

## పేల్చివేత

05

- ఎఎస్‌పి మృతి, సిఐ,ఎస్ఐకి తీవ్రగాయాలు
- ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం


## సన్న బియ్యం కష్టాలు

- రేషన్ షాపుల వద్ద లబ్ధిదారుల పడిగాపులు
- మొరాయిస్తున్న ఇ-పాస్ యంత్రాలు
- బియ్యం పంపిణీలో తీవ్ర ఇబ్బందులు



ప్రజాపక్షం/హనుమకొండ ప్రతినిధి

రేషన్ షాపుల్లో సన్న బియ్యం పంపిణీలో లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వ ఆదేశాలతో మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేసే ప్రక్రియ ప్రారంభం కాగా కొద్ది రోజులుగా లబ్ధిదారులకు రేషన్ డీలర్లు బియ్యం పంపిణీ చేస్తున్నారు. అయితే కొన్ని ప్రాంతాల్లో ఇ పాస్ యంత్రాలు మొరాయిస్తుండటంతో పంపిణీలో ఆలస్యం అవుతోంది. దీంతో లబ్ధిదారులు గంటల తరబడి రేషన్ దుకాణాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. రేషన్ డీలర్లు చేసేదేమీ లేక రేపు, మాపు రమ్మని చెబుతున్నారు. గంటల తరబడి నిలబడలేక ఓపిక నశించి కొందరు బియ్యం తీసుకోకుండానే వెళ్లిపోతున్నారు. మరికొందరు ఒకటి, రెండు రోజులు ఆగి తిరిగి వస్తున్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వ సాఫ్టవేర్‌తో తరువాయి 12లో



# ప్రపంచం
WORLD NEWS

## స్వదేశానికి చేరుకున్న బంగ్లా మాజీ అధ్యక్షుడు



**ఢాకా :** బంగ్లాదేశ్ మాజీ అధ్యక్షుడు అబ్దుల్ హమీద్ సోమవారం స్వదేశానికి తిరిగి వచ్చారు. 81 సంవత్సరాల హమీద్ అనారోగ్య కారణంగా విదేశాలకు వెళ్లి, చికిత్స పూర్తయిన తర్వాత తిరిగి వచ్చినట్టు అధికారులు ప్రకటించారు. పదవీచ్యుతురాలైన బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా అధికారంలో ఉన్నప్పుడు హమీద్ రెండు పర్యాయాలు అధ్యక్షుడిగా వ్యవహరించారు. థాయ్ ఎయిర్‌వేస్ విమానంలో సోమవారం తెల్లవారు ఝామున ఆయన ఢాకా చేరుకున్నారని హజ్రత్ షాజలాల్ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ (హెచ్‌ఎస్ఐఎ) అధికారులు ప్రకటించారు. సాధారణ ప్రయాణికుల మాదిరిగానే ఆయన కూడా విమానాశ్రయానికి చేరుకున్నారని తెలిపారు. ఆయన ఎయిర్‌పోర్ట్ నుంచి కారులో వెళ్లినట్టు సిసి ఫుటేజీల్లో కనిపిస్తున్నది. అయితే, హమీద్ ఎక్కడికి వెళ్లారన్న విషయంపై అధికారికంగా ఎలాంటి ప్రకటన వెలువడలేదు.

## లాస్ ఏంజిలిస్‌లో ఉద్రిక్త పరిస్థితులు



అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న వివిధ నిర్ణయాలు, చేస్తున్న చట్టాలు వివాదాలు సృష్టిస్తున్న విషయం తెలిసిందే. ఆయన నిర్ణయాలను, ప్రత్యేకించి ఇమ్మిగ్రేషన్ నిబంధనలను వ్యతిరేకిస్తూ లాస్ ఏంజిలిస్‌లో వేలాది మంది ప్రజలు నిరసన ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. శాంతి-యుతమైన ప్రదర్శనలను కూడా భరించలేకపోతున్న ట్రంప్ ఏకంగా నేషనల్ గార్డ్ బలగాలను రంగంలోకి దింపడంతో, ఆందోళనకారులు రెచ్చిపోయారు. పలు ప్రాంతాల్లో పోలీసులు లాఠీఛార్జి చేశారని, బాష్పవాయును ప్రయోగించారని ఆరోపణలు ఉన్నాయి. కాగా, ఆందోళనకారులు హింసాకాండ సృష్టించారని పోలీస్ అధికారులు అంటున్నారు. కొన్ని చోట్ల భద్రతా బలగాలపై రాళ్లు రువ్వారని, మరికొన్ని ప్రాంతాల్లో వాహనాలు దగ్ధం చేశారని ప్రకటించారు. పరిస్థితి అదుపులోనే ఉందని లాస్ ఏంజిలిస్ పోలీస్ చీఫ్ జిమ్ మెక్‌డొనాల్డ్ ప్రకటించారు. అయితే, అక్కడ ఇంకా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నట్టు అంతర్జాతీయ మీడియాలో వార్తలు వస్తున్నాయి. ట్రంప్ ఇమ్మిగ్రేషన్ నిబంధనలపై వ్యతిరేకత పెరుగుతున్న కారణంగా, లాస్ ఏంజిలిస్ మాదిరే మిగతా ప్రాంతాల్లోనూ ఆందోళనలు చెలరేగే ప్రమాదం కనిపిస్తున్నది.

## ఇజ్రాయెల్ క్రూరత్వం

### పాలస్తీనాకు మానవతా సాయం అడ్డంగింత

### సామాజిక కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్ నిర్బంధం



**జెరుసలేం :** గాజా స్ట్రిప్‌లో అష్టకష్టాలు పడుతున్న పాలస్తీనియులపై ఇజ్రాయెల్ మరోసారి క్రూరత్వాన్ని ప్రదర్శించింది. వారికి అందాల్సిన మానవతా సాయాన్ని కూడా అడ్డుకుంది. అంతేగాక, స్వీడన్‌కు చెందిన మానవ హక్కుల కార్యకర్త గ్రెటా థన్‌బెర్గ్‌ను నిర్బంధంలోకి తీసుకుంది. అంతర్జాతీయ మీడియా కథనాలను అనుసరించి, 2023 చివరిలో ఇజ్రాయెల్ మొదలు పెట్టిన యుద్ధం, చేస్తున్న దాడుల కారణంగా వేలాది మంది మృతి చెందగా, లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. అక్కడి పరిస్థితులు అత్యంత దారుణంగా ఉందని, నిత్యావసరాలు కూడా లభించక ప్రజలు అల్లాడుతున్నారని ఐక్యరాజ్య సమితిసహా అంతర్జాతీయ సంస్థలు స్పష్టం చేస్తున్నాయి. గాజా స్ట్రిప్‌లోని సుమారు 20 లక్షల మంది ప్రజలకు తక్షణ సాయం అవసరమని పేర్కొంటున్నాయి. కాగా, ఒక వైపు జనావాసాలు, ఆసుపత్రులు, పాఠశాలలు అనే తేడా లేకుండా, అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధంగా దాడులు చేస్తునే ఉంది. ఫలితంగా గాజాలో దారుణ పరిస్థితులు నెలకొన్నాయి. కరవు తాండవిస్తున్నది. ఆహారం, మంచినీరు వంటి కనీస వసతులు కూడా లేక ప్రజలు అల్లాడుతున్నరు. మానవతా సాయం అందించడానికి ప్రపంచ దేశాలు, అంతర్జాయ సంస్థలు ముందుకు వస్తున్నప్పటికీ, ఇజ్రాయెల్ సైన్యం అడ్డుకుంటున్నది. టర్కీ మీదుగా గాజాకు వచ్చే దారులను దిగ్బంధనం చేసింది. హమాస్‌పై యుద్ధం పేరుతో మారణకాండ సృష్టిస్తున్న ఇజ్రాయెల్, అంతర్జాతీయంగా వస్తున్న ఒత్తిళ్ల కారణంగా కాల్పుల విరమణకు అంగీకరించింది. కానీ, అమలు చేయడం లేదు. పరిస్థితులు రోజురోజుకూ దిగజారిపోతున్న తరుణంలో, గాజా ప్రజలకు సాయం అందించడానికి బయలుదేరిన పడవలో 'ది ఫ్రీడమ్ ఫ్లోటిల్లా కొయిలేషన్' సంస్థ ప్రతినిధులతోపాటు, గ్రెటా కూడా ఉంది. వీరిని అంతర్జాతీయ జలాల్లోనే చుట్టుముట్టిన ఇజ్రాయెల్ సైన్యం, ఒడ్డుకు తీసుకొచ్చిన తరాఇ్వత అరెస్టు చేసింది. వీరంతా మానవతా సాయం పేరుతో విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించింది. అందుకే, గాజాకు వెళ్లకుండా అడ్డుకొని, తిరిగి వెనక్కు పంపుతున్నట్టు సైన్యం ప్రకటించింది.

కాగా, ఈ ఘటనపై అంతర్జాతీయ సమాజం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నది. గాజాలోని పాలస్తీనియన్లకు మానవతా సాయం కూడా అందకుండా అడ్డుకోవడాన్ని ఖండిస్తున్నది.

## ఇంజనీర్లకు తెలుసు

(మొదటి పేజీ తరువాయి)

శాఖ మంత్రిగా ఎప్పటీ నుంచి ఎప్పటి వరకు పని చేశారని హరీష్ రావును కమిషన్ ప్రశ్నించగా, తాను తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన 2014 జూన్ 2 నుంచి 2018 నవంబర్ 20 తేదీ వరకు ఇరిగేషన్ శాఖ మంత్రిగా బాధ్యతలను నిర్వర్తించానని హరీష్‌రావు తెలిపారు. తుమ్మిడిహట్టి వద్ద ప్రతిపాదించిన పనులు మొదలు పెట్టిన తర్వాత ఈ ప్రాజెక్టును ఎందుకు మార్చాల్సి వచ్చిందని కమిషన్ ప్రశ్నించగా, అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడి హట్టి వద్ద రెండు ప్రాజెక్టులను ప్రతిపాదించిందని, బిఆర్ అంబేద్కర్ ప్రాణహిత పేరుతో కేవలం ఆదిలాబాద్ జిల్లాకు మాత్రమే పరిమితమైయ్యే ఒక్క ప్రాజెక్టు, ప్రాణహిత – చెవెళ్ల పేరుతో మారు ప్రాజెక్టు చేపట్టిందని హరీశ్‌రావు వివరించారు. ప్రాణహిత ప్రాజెక్టు ఏడు ప్యాకేజీలు 27 భాగాలుగా నాటి కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్లను ఆహ్వానించినప్పటికీ ప్రాజెక్ట్ పనులు చేపట్టకుండా కేవలం కాల్వలు, ఇతర పనులు చేపట్టారని, మరోవైపు 152 మీటర్ల ఎత్తు బ్యారేజీ నిర్మాణం చేపట్టడం వల్ల మహారాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసిందని హరీశ్‌రావు తెలిపారు. అప్పట్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో, మహారాష్ట్రలో కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పటికీ అనుమతులు సాధించడంలో విఫలమైయ్యారని తెలిపారు. 2014 జూన్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తుమ్మిడిహట్టి దగ్గరే ప్రాజెక్టు కట్టడానికి అన్ని రకాల ప్రయత్నాలు చేశామని, అప్పటి మహారాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇరిగేషన్ మంత్రిగా ఉన్న హసన్ ముష్రఫ్‌ను కలిసి విన్నవించగా, సాధ్యం కాదని ఆయన స్పష్టం చేశారన్నారు. ఆ తర్వాత మహారాష్ట్రలో బిజెపి ప్రభుత్వ అధికారంలో వచ్చిందని, దీంతో అప్పటి మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్‌తో నాటి తెలంగాణ సిఎం కె.చంద్రశేఖరరావు సమావేశమైన ప్రాజెక్టు నిర్మాణానికి సహకరించాలని అభ్యర్ధించారని, అయినా ఆ ప్రభుత్వం అంగీకరించలేదని హరీశ్‌రావు వివరించారు. ప్రాణహిత చేవెళ్ల పేరుతో ప్రతిపాదించిన తుమ్మిట్టి హట్టి వద్ద సరిపోను నీటి లభ్యత లేదని, ప్రత్యామ్నయ మార్గాలను అన్వేషించుకోవాలని కేంద్ర జల వనరుల సంఘం (సిడబ్ల్యుసి) నివేదికతో పాటు పక్కనే ఉన్న మహారాష్ట్ర అభ్యంతరం మేరకే ప్రాజెక్టును మేడిగడ్డకు మార్చినట్టు హరీష్‌రావు కమిషన్‌కు వివరించారు. ఈ క్రమంలోనే మాజీ సిఎం కె.చంద్రశేఖరరావు బ్యారేజి నిర్మాణానికి సంబంధించి స్థలం ఎంపిక చేయాలని సిడబ్ల్యుసి అంతర్భాగమైన వ్యాప్కోస్ కోరడం, సదరు సంస్థ లాడర్ సర్వే నిర్వహించి ఇక్కడ 240 టిఎంసిల నీటి లభ్యత ఉందని, ప్రాజెక్టు నిర్మించుకోవచ్చని ప్రతిపాదించడంతోనే అక్కడ ప్రాజెక్ట్‌ను నిర్మించాలని నిర్ణయిచినట్టు వివరించారు. కాగా అప్పటీ మహారాష్ట్ర ప్రభుత్వం ఎపి ప్రభుత్వానికి రాసిన లేఖలతో పాటు సిడబ్ల్యుసి, వ్యాప్కోక్స్ ఇచ్చిన నివేదికను కమిషన్‌కు హరీశ్‌రావు సమర్పించారు. అన్నారం, సుందిళ్ల బ్యారేజీ లోకేషన్ ఎందుకు మార్చాల్సి వచ్చిందన్న కమిషన్ ప్రశ్న హరీశ్‌రావు సమాధానమిస్తూ అది పూర్తిగా సాంకేతికపరమైన నిర్ణయమని, ఇంజనీర్ల టెయిల్ సర్వే ఆధారంగా బ్యారేజ్ లోకేషన్ మారిందని, ఇది పూర్తిగా ఇంజనీరింగ్ విభాగం తీసుకున్న నిర్ణయమని తెలిపారు. గతంలో నాగార్జున సాగర్, కాంతనపల్లి, ఎల్లంపల్లి ప్రాజెక్టు నిర్మాణాలకు సంబంధించి కూడా లోకేషన్ మార్చారని ఉదాహరించారు. ఈ ప్రాజెక్టులో రిజర్వాయర్లకు కెపాసిటీ ఎంత అని కమిషన్ అడిగిన ప్రశ్నకు 141 టిఎంసిల సామర్థ్యంతో రిజర్వాయర్ నిర్మించామని హరీష్‌రావు బదులిచ్చారు. కాళేశ్వరం కార్పొరేషన్‌కు అనుమతి ఉందా ? అని జస్టిస్ పిసిఘోష్ ప్రశ్నించారు. దీనికి హరీశ్‌రావు సమాధానమిస్తూ రాష్ట్ర మంత్రివర్గం ఆమోదంతోనే కాళేశ్వరం కార్పొరేషన్ ఏర్పాటు చేసిందని,రాష్ట్ర ప్రభుత్వ పూర్తి గ్యారంటీతోనే ఈ కార్పొరేషన్ ద్వారా జాతీయ బ్యాంకుల నుంచే రుణాలు పొందామని తెలిపారు. హైదరాబాద్ తాగు నీటి అవసరాలకు 35 టిఎంసిలు, పారిశ్రామిక అవసరాలకు మరో 15 టిఎంసిలు కేటాయించామని తద్వారా వచ్చే ఆదాయంతో రుణాలు చెల్లించేలా రూపకల్పన చేశామని తెలిపారు. బిఆర్‌ఎస్ అధికారంలో ఉన్నంత వరకు రుణాలను సక్రమంగా చెల్లిస్తు వచ్చామన్నారు.

ప్రాజెక్టులో నీటి నిల్వలకు సంబంధించి ఏమైనా అదేశాలు ఇచ్చారా? అని కమిషన్ ప్రశ్నించగా, సాంకేతిక పరమైన అంశాలకు సంబంధించి పూర్తి నిర్ణయాలు ఇంజనీరింగ్ అధికారులే తీసుకుంటారని హరీష్ రావు సమాధామిచ్చారు.

## భారత్ అభివృద్ధి

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక అభ్యున్నతి వర కూ ప్రజల కేంద్రంగానే పాలన సాగించినట్లు మోదీ వివరించారు. వికసిత్ భారత్ లక్ష్య సాధన దిశగా తాము ముందుకుసాగుతున్నట్లు వెల్లడించారు.

**స్వర్ణ యుగం! : హోంమంత్రి అమిత్‌షా**

మోదీ ప్రభుత్వ 11 ఏళ్ల పాల ప్రజాసేవ పట్ల సంకల్పం, కృషి, అంకిత భావాలకు ఒక 'స్వర్ణ యుగం' అని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పేర్కొన్నారు. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ పాలనలో భారత్ అభివృద్ధి, స్వావలన వైపు వేగంగా పురోగమిస్తోందని ఆయన అన్నారు. దేశ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పు తీసుకురావడం ద్వారా భారతదేశాన్ని ప్రతి రంగంలోనూ నంబర్ వన్‌గా మార్చే ప్రయాణం కొనసాగుతోందని ఆయన స్పష్టం చేశారు. 'నాయకత్వం స్పష్టంగా ఉన్నప్పుడు, సంకల్పం దృఢంగా ఉన్నప్పుడు, ప్రజాసేవ చేయాలనే ఉద్దేశం ఉన్నప్పుడు సేవ, భద్రత, సుపరిపాలనలో కొత్త రికార్డులు సృష్టించబడతాని మోదీ ప్రభుత్వం నిరూపించింది' అని అమిత్‌షా పేర్కొన్నారు. '2014లో ప్రధానిగా మోదీ దేశ పగ్గాలు చేపట్టినప్పుడు భారత్ విధానపరంగా అచేతనంగా ఉంది. గత ప్రభుత్వాలకు విధానాలు లేవు, నాయకత్వం లేదు. మోసాలు తారస్థాయికి చెరుకున్నాయి. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయింది. పాలనా వ్యవస్థ దిశానిర్దేశం లేకుండా ఉండేది. కానీ గత 11 ఏళ్లలో 'కనీస ప్రభుత్వం, గరిష్ఠ పాలన' ద్వారా దేశ అభివృద్ధి వేగం, స్థాయి రెండూ మారాయి' అని అమిత్ షా అన్నారు. 'మోదీ రైతులు, మహిళలు, వెనుకబడినవారు, దళితులు, అణగారిన వర్గాలను పాలనలో భాగం చేశారు. బుజ్జగింపులకు బదులుగా సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే పని సంస్కృతిని సృష్టించారు' అని అమిత్ షా పేర్కొన్నారు. 'మోదీ జాతీయ భద్రతకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నారు. దేశంలో నక్సలిజం చివరి దశలో ఉంది. జమ్ముకశ్మీర్, ఈశాన్య రాష్ట్రాల్లో శాంతి నెలకొంది. భారత్ ఇప్పుడు ఉగ్రవాదుల స్థావరాల్లోకి చొరబడి వారిని అంతమొందిస్తోంది. ఇది మోదీ ప్రభుత్వ హయాంలో మారుతున్న భారత చిత్రాన్ని చూపిస్తోంది' అని అమిత్ షా అన్నారు.

**పేదల సంక్షేమం కోసం! : నడ్డా**

సుపరిపాలన, పేదల సంక్షేమం కోసం ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం చేసిన కృషి చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించపడుతుందని బిజెపి అధ్యక్షుడు జెపి నడ్డా అన్నారు. ఆర్టికల్ 370 రద్దు, ట్రిపుల్ తలాక్, వక్ఫ్ సవరణ బిల్లు, మహిళా బిల్లు, పెద్ద నోట్ల రద్దు ఎన్‌డిఎ ప్రభుత్వం తీసుకున్న సాహసోపేతమైన నిర్ణయాలని తెలిపారు. కేంద్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లైనా సందర్భంగా నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పనులు గురించి నడ్డా వివరించారు. సబ్‌కా సాత్, సబ్‌కా వికాస్, సబ్‌కా విశ్వాస్, సబ్‌కా ప్రయాస్ అనే మంత్రంతో గత 11 ఏళ్లుగా ముందుకు సాగుతున్నామని నడ్డా తెలిపారు. ఇక నుంచి ఉగ్ర దాడులను యుద్ధంగానే భావిస్తామని చెప్పారు. ఈ విషయాన్ని ప్రధాని ఇప్పటికే పలుమార్లు చెప్పారని నడ్డా గుర్తు చేశారు.

## మోదీ తాకట్టు

(మొదటి పేజీ తరువాయి)

ప్రజలు ప్రశ్నించే పరిస్థితి నెలకొందని అన్నారు. ప్రధాని మోదీ నినదిస్తున్న 'సబ్ కా సాత్ – సబ్ కా వికాస్' పూర్తిగా బూటకమని అన్నారు. దేశంలో ప్రస్తుత పరిస్థితులు, రానున్న జాతీయ, అంతర్జాతీయ మార్పులు, కూర్పులను వామపక్షాలు నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో రాజకీయ, సామాజిక, ఆర్థిక సవాళ్లు ఉన్నాయని, ఫాసిజం ఎత్తుగడలో భాగంగా మతోన్మాదం పేరుతో ప్రజలను చీల్చి రెండు వర్గాలనూ దోచుకునే ఎత్తుగడ కొనసాగుతోందని విమర్శించారు. రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నారని, ప్రజాస్వామ్య వ్యవస్థను, లౌకిక విధానాలన్నింటినీ నిర్వీర్యం చేస్తున్నారని బినోయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఆర్ స్ఫూర్తితో కేరళలో ఎల్‌డిఎఫ్ 1980 సంవత్సరంలో మొట్టమొదటిసారి, సిపిఐ, సిపిఐ(ఎం) రెండు పార్టీలు కలిసి కేరళలో ఉమ్మడిగా పోరాటానికి సిద్ధపడ్డాయని, నాటి అగ్ర నాయకులు చంద్ర రాజేశ్వరరావు, నంబూద్రిపాద్ చేసే ఉపన్యాసాలు వినేందుకు కేరళ రాష్ట్ర ప్రజలు తండోపతండాలుగా వచ్చారని, కమ్యూనిస్టుల ఐక్యత, భవిష్యత్‌పై వారు నూతన దిశను, దశను సూచించారని బినోయ్ విశ్వం గుర్తు చేశారు. 1969 నుంచి 1979 వరకు కాంగ్రెస్ పార్టీతో సిపిఐ కలిసి పనిచేసిందని, ఆ తర్వాత 1979లో వామపక్షాల ఐక్యతను దృష్టిలో పెట్టుకుని సిపిఐ, సిపిఐ(ఎం) కలిసి దేశ, రాష్ట్ర రాజకీయాలను ప్రభావితం చేయాలనే సంకల్పంతో చంద్ర రాజేశ్వర్‌రావు స్ఫూర్తితో ముందుకెళ్లామని వివరించారు. చంద్ర రాజేశ్వర రావు ప్రసంగాలు, సైద్ధాంతిక కృషి నేటి తరం కమ్యూనిస్టులకు ఎంతో ఉపయోగపడుతాయన్నారు. సిద్ధాంతాన్ని పునర్ నిర్వచించుకోవడం ద్వారా దీనిని నమ్మి, అర్థం చేసుకుని ప్రజల వద్దకు తీసుకెళ్లి, ప్రజలతో కలిసి కార్యాచరణకు పూనుకోవాలని, వామపక్షాలన్నీ కలిసి ముందుకు తీసుకెళ్లాలని అన్నారు. తొలుత సిఆర్ ఫౌండేషన్ ప్రాంగణంలో ఉన్న సిఆర్ విగ్రహానికి బొనోయ్ విశ్వం, తెలంగాణ సాయుధపోరాటయోధులు నీలం రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి ప్రొఫెసర్ నర్సింహారెడ్డి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు, మాజీ ఎంఎల్‌సి జల్లి విల్సన్, కార్యదర్శులు చెన్నమనేని వెంకటేశ్వర రావు, పి.జె.చంద్రశేఖర రావు, కోశాధికారి వి.చెన్నకేశవరావు, సిఆర్ పాలిక్లినిక్ డైరెక్టర్ డాక్టర్ కె.రజని, నీలం రాజశేఖర రెడ్డి పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ టి.సురేష్, సభ్యులు డాక్టర్ బి.వి.విజయలక్ష్మి, పిప్రేమ్ పావని తదితరులు పాల్గొన్నారు.



## ట్యాప్ చేశారు..

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారు. విచారణలోని ప్రభాకర్‌రావు వెల్లడించిన అంశాలను సిట్ అధికారులు స్టేట్మెంట్లను రికార్డు చేశారు. విశ్వసనీయ కథనం మేరకు ప్రభాకర్‌రావును సిట్ అధికారులు అడిగిన ప్రశ్నలు ఇలా ఉన్నాయి. ఎవరి ఆదేశాల మేరకు ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారు..? ఈ కేసులో నిందితులైన ఎస్ఐబి డిఎస్‌పి ప్రణీత్‌రావు, టివి ఛానల్ యజమాని శ్రవణ్‌రావుతో తరచు ఎందుకు భేటి అయ్యేవారు..? ఫోన్ ట్యాపింగ్ కేసులో మరో నిందితుడు ప్రణీతరావును త్వరగా ప్రమోషన్ చేయాలని ఎవరు రికమెండ్ చేశారు..? శ్రవణ్ రావు ప్రైవేట్ వ్యక్తి అతనికి ఎస్ఐబితో సంబంధాలేంటి..? అని పోలీసులు ప్రభాకర్ రావును ప్రశ్నించినట్లు తెలిసింది. ప్రభాకర్ రావు మాత్రం తన అఫిడవిట్‌లోని అంశాలనే తిరిగి చెబుతున్నట్లు తెలుస్తోంది. అసలు నాకు ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధమే లేదని.. ఆధారాలు ఉంటే చూపించాలని ఇన్విస్టిగేషన్ ఆఫీసర్లనే ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. గత ప్రభుత్వంలో ఎస్ఐబి చీఫ్ గా పనిచేసిన సమయంలో ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడినట్లు ఆయనపై ఆరోపణలున్నాయి. ప్రభాకర్ రావు విచారణతో ఈ కేసులో మరిన్ని కీలక విషయాలు వెలుగులోకి వస్తాయని సిట్ బృందం భావిస్తోంది. గత ప్రభుత్వంలో ఎవరు చెబితే ట్యాపింగ్ జరిగిందనే అంశంపై, అలాగే ఎంతమంది రాజకీయ, సినీ ప్రముఖులు, న్యాయమూర్తులు, జర్నలిస్టుల ఫోన్లు ట్యాప్ చేశారనే కోణంలో సిట్ ఆయనను విచారించింది. గత ఎన్నికల్లో ప్రతిపక్షాలకు ఆర్థిక సహాయం చేసిన వారి ఫోన్లను కూడా ట్యాప్ చేసినట్లు ప్రభాకర్ రావుపై ఆరోపణలున్నాయి. సిట్ విచారణలో ఆయన ఏం చెప్తారనేది ఆసక్తికరంగా మారింది. ఫోన్ ట్యాపింగ్ చేసిన తరువాత దాన్ని ఎవరికి అందజేసేవారు..? ఫోన్ ట్యాపింగ్ కేసు నమోదైన వెంటనే విదేశాలకు ఎందుకు వెళ్లారు..? హార్డ్ డిస్కును ఎవరు ధ్వంసం చేశారు..?మీ ఆదేశాలతోనే ప్రణీత్‌అవు హార్డ్ డిస్క్‌ను ధ్వంసం చేశారా..? స్పెషల్ ఆపరేషన్ టీంను ఎవరు చెప్తే ఏర్పాటు చేశారు..? హార్డ్ డిస్క్ ధ్వంసం వెనుక కుట్ర స్పష్టంగా కనిపిస్తోంది..? ఫోన్ ట్యాపింగ్ వల్ల లబ్ది పొందింది ఎవరు..?ఇతర వివరాలను రాబట్టారు. కొన్నిప్రశ్నలకు ప్రభాకరరావు మౌనం వహించడంతో అతన్ని బుధవారం మరోసారి విచారించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పెద్ద ఎత్తున రాజకీయ, సినీ, ప్రముఖులు, జడ్జీలు, జర్నలిస్టుల ఫోన్లు ట్యాప్ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. వీటన్నింటిలో ప్రభాకర్‌రావు కీలకంగా ఉన్నారనే ప్రచారం ఉంది. గతప్రభుత్వ పెద్దలే ఫోన్ ట్యాపింగ్‌ల విషయంలో అధికారులను ప్రోత్సహించారనే ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ప్రభాకర్ రావు నోరు తెలిస్తే ఈ కేసులో ఎలాంటి ట్విస్ట్‌లు రాబోతున్నాయనేది ఉత్కంఠగా మారింది. ఇదే జరిగితే ఈ పరిణామం బిఆర్ఎస్ లో ఎవరికి పేర్లు బయటపడతాయో అనేది ఉత్కంఠ రేపుతున్నది.

**పై అధికారుల ఆదేశాలతోనే చేశాను..?**

పై అధికారుల ఆదేశాలు ఉండడం వల్లనే ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డామని సిట్ అధికారుల విచారణలో ఎస్ఐబి మాజీ చీఫ్ టి.ప్రభాకర్‌రావు వెల్లడించినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఆ సమయంలో రాష్ట్ర డిజిపిలుగా చేసిన ఇద్దరు అధికారులు, ఇంటెలిజెన్స్ చీఫ్‌గా పనిచేసిన మరో ఇద్దరు అధికారుల పేర్లు వెల్లడించినట్లు సమాచారం. అయితే ఆనలుగురు సీనియర్ ఐపిఎస్‌లను కూడా విచారించాలని, వారికి కూడా త్వరలో నోటీసులు జారీ చేసే అంశంపై సిట్ అధికారులు తర్జనబర్జన పడుతున్నట్లు తెలిసింది. ఉన్నతాధికారులకు తెలియకుండా ఫోన్ ట్యాపింగ్ చేయడం సాధ్యం కాదని ప్రభాకర్‌రావు విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. అయితే ప్రభాకర్‌రావును ఆదేశించిన అధికారులను సైతం విచారిస్తేనే అసలు గుట్టు బయటపడుతుందని సిట్ అధికారులు భావిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ కేసులో తీగలాగుతుండగా డొంక కదిపేది ప్రభాకరరావు అని మాత్రమే అనుకున్న సిట్ అధికారులకు నిరాశమిగిలింది. మరికొంత మంది ఐపిఎస్‌లను విచారిస్తేగాని అసలు డొంక బయటపడదని సిట్ అధికారులు నిర్ధారణకు వచ్చినట్లు సమాచారం.

## తీవ్ర ఉత్కంఠ

(మొదటి పేజీ తరువాయి)

పొందిన పార్టీ నాయకుల్లో మ రింత ఉత్సాహం పెరిగే అవకాశం ఉందని సిఎం అధిష్టానికి సూచించే అవకాశం ఉంది. మరో వైపు మంత్రివర్గ విస్తరణలో చోటు దక్కకపోవడంతో ఉన్న పి.సుదర్శన్‌రెడ్డి, ప్రేమ్ సాగర్ రావు, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, మల్‌రెడ్డి రంగారెడ్డి తదితరు లు అసంతృప్తితో ఉన్నారు. ఈ నేపథ్యంలో స్థానిక సంస్థల ఎన్నికల వారితో ఆ మూడు మంత్రి పదవులను భర్తీ చేయాలని అధిష్టానానికి రేవంత్ రెడ్డి సూచించనున్నట్లు సమాచారం.

## వ్యవస్థల విధ్వంసం

(మొదటి పేజీ తరువాయి)

వ్యతిరేకంగా వెన్నుపోటు రాజకీయాలతో ప్రజాస్వామ్యబద్ధంగా ఏర్పడిన ప్రభుత్వాలను కూల్చడం, బలవంతంగా ఏకపార్టీ నియంతృత్వాన్ని అమలు చేయడం వంటివి చేశారన్నారు. ఈ 11 సంవత్సరాల కాలంలో రాష్ట్రాల హక్కులను పూర్తిగా విస్మరించారని, సమాఖ్య నిర్మాణం బలహీపరిచారని ఖర్గే ధ్వజమెత్తారు. ద్వేషం, బెదిరింపులు, భయాన్ని వ్యాప్తి చేయడానికి నిరంతరం ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. దళితులు, గిరిజనులు, వెనుకబడినవారు, మైనారిటీ, బలహీన వర్గాలపై దోపిడీ నిరంతరం పెరుగుతోందని, వారికి రిజర్వేషన్లు, సమాన హక్కులను హరించే కుట్ర కొనసాగుతోందని మండిపడ్డారు. మణిపూర్‌లో కొనసాగుతున్న హింస బిజెపి పరిపాలనా వైఫల్యానికి అతిపెద్ద రుజువు అని ఖర్గే ఎక్స్‌లో రాసుకొచ్చారు. యుపిఎ హయాంలో సగటున 8 శాతంగా ఉన్న దేశ జిడిజిపి వృద్ధి రేటును 5–6 శాతం వద్దే నిలిపివేయడం బిజెపి–ఆర్ఎస్ఎస్ అలవాటుగా మార్చుకుందన్నారు. సంవత్సరానికి 2 కోట్ల ఉద్యోగాల హామీని నెరవేర్చడానికి బదులుగా, యువత నుండి కోట్లాది ఉద్యోగాలు లాక్కున్నారని, ద్రవ్యోల్బణం కారణంగా ప్రజా పొదుపులు 50 సంవత్సరాలలో అత్యల్ప స్థాయికి చేరుకోగా, ఆర్థిక అసమానతలు 100 సంవత్సరాలలో గరిష్ట స్థాయిని తాకాయన్నారు. నోట్ల రద్దు, తప్పుడు జిఎస్‌ట, ప్రణాళిక లేని లాక్‌డౌన్, అసంఘటిత రంగాన్ని దెబ్బతీశాయన్నారు. కోట్లాది మంది ప్రజల భవిష్యత్తును నాశనం చేశాయని పేర్కొన్నారు. మేక్ ఇన్ ఇండియా, స్టార్టప్ ఇండియా, స్టాండ అప్ ఇండియా, డిజిటల్ ఇండియా, నమామి గంగే, 100 స్మార్ట్ సిటీలు వంటి కార్యక్రమాలు విఫలమయ్యాయని ఆయన ఆరోపించారు.

### 11 ఏళ్లలో జవాబుదారితనమేదీ? : రాహుల్

11 సంవత్సరాలలో మోదీ ప్రభుత్వం జవాబుదారీతనంగా లేదని, ప్రచారానికి మాత్రమే ప్రాధాన్యతనిచ్చిందని కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ సోమవారం ఆరోపించారు. కేంద్రం వర్తమానం గురించి మాట్లాడటం మానేసి ఇప్పుడు 2047 కోసం కలలు కంటోందన్నారు. మహారాష్ట్రలోని థానే జిల్లాలో కదులుతున్న, రద్దీగా ఉన్న లోకల్ రైలు నుండి జారిపడి నలుగురు ప్రయాణికులు మరణించగా, ఆరుగురు గాయపడడంతో ప్రభుత్వంపై రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాల ఉత్సవం జరుపుకుంటుండగా, ముంబయి నుండి వచ్చిన విషాద వార్తలలో దేశం వాస్తవికత ప్రతిబింబిస్తుందని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పేర్కొన్నారు. భారతీయ రైల్వేలు కోట్లాది మంది జీవితాలకు వెన్నెముక, కానీ నేడు అది అభద్రత, రదీ చిహ్నంగా మారిందని ఆయన ఆరోపించారు.

## పిటిషన్ కొట్టివేత

(మొదటి పేజీ తరువాయి)

అనుగుణంగా లేదని తేల్చారు. ఎన్నికల ప్రక్రియ స్వచ్ఛతను కాపాడటం, అవినీతి పద్ధతుల్లో ప్రజాప్రతినిధులు ఎన్నిక కాకుండా చూసుకోవడం చట్టం ముఖ్యోద్దేశమని గుర్తు చేశారు. ఈ క్రమంలోనే ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 86 (7)లో ఆరు నెలల్లోపు ఎన్నికల పిటిషన్‌ను పరిష్కరించాల్సిన అవసరం ఉందని, తమ ముందున్న పిటిషన్‌లో జోక్యం చేసుకునేందుకు ఆస్కారం లేదని తెలిపారు. కూనంనేని ఎన్నికను రద్దు చేయడాని కి చేసిన అభియోగాలకు ఆధారాలు లేవని, జోక్యం చేసుకునే అంశాలు ఏమీ లేవని,, పిటిషనర్ సరైన కారణం చూపడంలో విఫలమయ్యారని తీర్పులో పేర్కొన్నారు.

**న్యాయం గెలిచింది....**రాష్ట్రంలో 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో తన ఎన్నిక చెల్లదని స్వతంత్ర్య అభ్యర్థి వేసిన ఎన్నికల పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేయడం పట్ల కొత్తగూడెం ఎంఎల్‌ఎ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు హర్షం వ్యక్తం చేశారు. గతంలో ప్రజాక్షేత్రంలో గెలుపొందడం ద్వారా ప్రజా విజయం సాధించామని, తాజాగా అసంబంధమైన అంశాలతో వేసిన కేసును హైకోర్టు కొట్టివేయడం ద్వారా న్యాయం గెలిచిందని ఆయన తెలిపారు. హైకోర్టు తీర్పు వివరాలను సోమవారం ఆయన మీడియా ప్రతినిధులకు వివరించారు. ఈ తీర్పుతో న్యాయ వ్యవస్థ పట్ల మరింత విశ్వాసం, గౌరవం ప్రజలలో పెరిగిందని కూనంనేని సాంబశివరావు అన్నారు. లక్షలాది మంది ఓట్లు వేసి గెలిపించిన ప్రజల మనోభావాలకు భిన్నంగా అడ్డదారుల్లో ప్రయోజనం పొందాలనుకునేవారికి ఈ తీర్పు చక్కని గుణపాఠమని తెలిపారు. అందుకు న్యాయవ్యవస్థకు ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. హైకోర్టు తీర్పు ద్వారా ప్రజాసేవలో ద్విగుణీకృతమైన ఉత్సహంతో పనిచేసేందుకు మరింత స్ఫూర్తిని కలిగించిందని సాంబశివరావు వెల్లడించారు.

## వ్యతిరేకం

(మొదటి పేజీ తరువాయి)

వివరాల గురించి కూనంనేని పేర్కొన్నారు కదా? కేవలం తన భార్య పేరు అఫిడవిట్‌లో వెల్లడించనంతమాత్రాన ఆయన ఎన్నిక చెల్లదని ప్రకటించలేం. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కొత్తగూడెం నియోజకవర్గం నుంచి సిపిఐ నుంచి కూనంనేని సాంబశివరావు పోటీ చేశారు. కాంగ్రెస్ అభ్యర్థి జలగం వెంకటరావుపై ఘన విజయం సాధించారు. అయితే, కూనంనేని రామినేషన్ సందర్భంగా దాఖలు చేసిన అఫిడవిట్‌లో తన భార్య పేరు వెల్లడించలేదని చెప్పి నిజాలు తొక్కిపెట్టినట్లు అవుతుందా. ఈ కారణంగా వాస్తవాలను తొక్కిపెట్టారని చెప్పి ఎన్నిక చెల్లదని ప్రకటించాలా? అంతేగాకుండా కూనంనేనికి శిక్ష, జరిమానా విధించాలా?' అని పిటిషనర్ అయిన ఓటరు నందూలాల్‌ను ప్రశ్నించింది. 'కూనంనేని నామినేషన్ దాఖలు సందర్భంగా భార్య పేరు వెల్లడించకపోవడంపై పిటిషనర్ ఏవిధమైన అభ్యంతరం చెప్పలేదు. కూనంనేనిపై పోటీ చేసిన ప్రత్యర్థి జలగం వెంకటరావు ఇదే విషయం అభ్యంతరం లేవనెత్తితే ఎన్నికల రిటర్నింగ్ అధికారి తోసిపుచ్చారు. కూనంనేని సమర్పించిన అఫిడవిట్‌లో భార్య పేరు మినహా ఆమె పేరుతో ఉన్న పాన్ నెంబరు. ఐదు సంవత్సరాలు ఆదాయపు పన్నుల రిటర్న్‌ల గురించి పూర్తిగా వివరించారు. ఆ వివరాల్లో కూనంనేని భార్య పేరు ఉంటుంది. ఎన్నికల అఫిడవిట్‌లో భాగస్వామి కాలమ్‌లో భార్య పేరును పేర్కొనపోయినా మిగిలిన వివరాలన్నీ పొందుపర్చారు. నిబంధనల ప్రకారమే నామినేషన్ ఉండటంతో రిటర్నింగ్ అధికారి దాన్ని ఆమోదించారు. కూనంనేని లేదా ఎన్నికల రిటర్నింగ్ అధికారుల పొరపాట్లు ఏమీ లేవు. కాబట్టి ఎన్నికల పిటిషన్ విచారణార్హం కానేకాదు. ఇలాంటి చిన్నపాటి కారణంతో ప్రజలు ఇచ్చిన తీర్పును కొట్టేయడానికి వీల్లేదు. ఏ విధంగానూ పిటిషన్‌ను పరిగణించలేము. పిటిషన్ విచారణార్హమే అయినప్పటికీ ఎన్నిక చెల్లదనేందుకు సరైన ఆధారాలను చూపడంలో పిటిషనర్ విఫలమయ్యారు. అన్ని దశలోను ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా ఉండాలనే విషయంలో ఎలాంటి సందేహం లేదు. ఇదే సమయంలో ఎన్నికల పిటిషన్‌లో కీలక ఆధారాలు ఉంటే ఎన్నికల రద్దు వ్యవహారంలో జోక్యానికి ఆస్కారం లేదు. కూనంనేని 26,547 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. ప్రజల విశ్వసనీయతను పొందారు. ప్రజా తీర్పును కాదనేందుకు కూనంనేని తన భార్య పేరు రాలేదనే కారణం చెల్లదు. కాబట్టి పిటిషన్‌ను కొట్టేస్తున్నాం..' అని హైకోర్టు వెలువరించిన తీర్పులో పేర్కొంది.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఆధ్యాత్మికతతోనే ఆత్మవిశ్వాసం

### మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్



**ప్రజాపక్షం/కోదాడ(చిలుకూరు):** ఆధ్యాత్మికతతో గ్రామాల్లో ప్రజల ఆత్మవిశ్వాసం పెరుగుతుందని కోదాడ మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. సోమవారం చిలుకూరు మండల కేంద్రంలోని యాదవుల ఆరాధ్యదైవమైన గంగమ్మ తల్లి జాతర సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాల నిర్మాణాలతో గ్రామాల్లో ధర్మరక్షణ జరుగుతుందన్నారు. శ్రీగంగమ్మ తల్లి ఆశీస్సులతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మల్లయ్య యాదవ్‌ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, యాదవ కులస్తులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

### విద్యారంగ సంక్షేమం కోసం ఆవిర్భవించిన

## తొలి ఉపాధ్యాయ సంఘం 'ఎస్‌టియు'




### సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** భారత దేశానికి స్వాతంత్ర్యం రాకముందే ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం ఏర్పడిన తొలి ఉపాధ్యాయ సంఘం స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టియు) అని సిపిఐ జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకట్ రెడ్డి అన్నారు. 'ఎస్‌టియు 79వ' ఆవిర్భావ దినోత్సవం హైదరాబాద్, కాచిగూడలోని ఎస్‌టియు భవన్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంఘం పతాకాన్ని చాడ వెంకట్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఎస్‌టియు సీనియర్ నాయకులను ఘనంగా సన్మానించారు. అనంతరం చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో తొలి పిఆర్‌సి ఏర్పాటు, పెన్షన్ రూల్స్ సాధన, అప్రెంటిస్ విధానం రద్దు కోసం ఎస్‌టియు ఎంతో కృషి చేసిందన్నారు. ఈ సందర్భంగా ఎస్‌టియు రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎం.పర్వత్‌రెడ్డి, జి.సదానందంగౌడ్ మాట్లాడుతూ 1947వ సంవత్సరం, జూన్ 9న ఎస్‌టియు ఏర్పడిందన్నారు. నాటి నుండి నేటి వరకు ఉపాధ్యాయులకు అనేక సౌకర్యాలు కల్పించడంతో పాటు సమస్యల పరిష్కారానికి సంఘం ఎంతో కృషి చేసిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సర్వీసు రూల్స్‌ను సాధించి, ఉపాధ్యాయులకు ఎంఇఒ, డిప్యూటీ ఇఒ, డైట్ లెక్చరర్ల పోస్టులకు పదోన్నతులు కల్పించేందుకు కృషి చేస్తామని వారు చెప్పారు. సిపిఎస్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బడిబాట కార్యక్రమంలో సంఘ కార్యకర్తలు చురుగ్గా పాల్గొని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు.

బడిబాట కార్యక్రమం అనంతరం విద్యార్థుల సంఖ్య ప్రాతిపదికన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ చేపట్టాలని పర్వత్ రెడ్డి, సదానందంగౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌టియు నాయకులు జుట్టు గజేందర్, టి.పోల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, పరమేశ, పున్న గణేష్, భార్గవి, అజర్‌జహా, శంకర్ మతంగి, కృష్ణారెడ్డి, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

## 'మహాలక్ష్మి'తో లాభాల్లోకి ఆర్టీసి

### ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవం
### రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మల్లు భట్టి విక్రమార్క
### ఆర్టీసి కార్మికుల సంక్షేమం కోసం ప్రజా ప్రభుత్వం నిరంతర కృషి
### రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/సూర్యాపేటప్రతినిధి :** మహాలక్ష్మి పథకం ద్వారా ఆర్టీసి లాభాల బాటలో కొనసాగుతుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, విద్యుత్ శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం సూర్యాపేట బస్ డిపోలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రారంభోత్సవంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌లతో కలిసి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాలుష్యం నుండి పర్యావరణాన్ని దృష్టిలో పెట్టుకుని వాతావరణంను కాపాడుకుంటూ ఆర్టీసి సంస్థ ముందుకు వెళ్తుందని, పొన్నం ప్రభాకర్ రాష్ట్ర రవాణ శాఖ మంత్రి అయినప్పటి నుండి ఆర్టీసీలో సమూల మార్పులు తెచ్చి అనేక సంస్కరణలతో ముందుకు వెళ్లడం శుభపరిణామం అన్నారు. గతంలో సామాన్యుడి అవసరాలు తీర్చేందుకు ఆర్టీసి సంస్థ ఎంతగానో కృషి చేసిందని, కానీ లాభాలు లేకుండా ఎప్పుడూ నష్టాల బాటలో కొనసాగిందని, ప్రజా ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఆర్టీసి అనే ప్రభుత్వ సంస్థలను కాపాడుకునేందుకు, ఆర్థికంగా నిలబెట్టుకునేందుకు తగు చర్యలతో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు. పాత బస్సుల ద్వారా వాతావరణాన్ని కాపాడుకుంటూ ప్రజలకు సేవ చేసేందుకు సూర్యాపేట డిపోకు 79ఎలక్ట్రిక్ బస్సులు మంజూరైనాయని, వాటిలో సోమవారం 45 బస్సులు ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇప్పటి వరకు 182కోట్ల జీరో టికెట్లు జారీ చేశామని, వాటి ద్వారా తెలంగాణ ఆడపడుచులు 6088 కోట్ల రూపాయలు ఆదా చేసుకున్నారని, ఆ డబ్బులు ప్రభుత్వం ఆర్టీసీకి నేరుగా జమచేయడం జరిగిందని, దాంతో నేడు ఆర్టీసి ఆర్థికంగా నిలదొక్కుకొని పూర్తిసామర్థ్యంతో రాష్ట్రమంతా బస్సులు నడుస్తున్నాయని తెలిపారు.



మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ చుట్టూ సూర్యాపేట నట్ట నడుమ నల్లగొండ అంటు తెలంగాణ సాయుధ పోరాటం గుర్తు చేసుకుంటూ ప్రజా ప్రభుత్వంలో మారుతున్న కాలానికి అనుగుణంగా కార్మికుల సంక్షేమం కోరుకుంటూ నేడు సూర్యాపేట డిపో నుండి హైద్రాబాద్, నల్లగొండ, ఖమ్మం, వరంగల్, కోదాడ లాంటి ప్రాంతాలకి వాతావరణంను కాపాడుకుంటూ 79 ఎలక్ట్రిక్ బస్సులు మంజూరు చేయడం జరిగిందని, వాటిలో నేడు 45 బస్సులు ప్రారంభం చేయడం జరిగిందన్నారు. గత పది సంవత్సరాలు ఒక్క నూతన బస్సుగాని, కొత్త ఉద్యోగం గాని ఇవ్వకుండా ఆర్టీసీని నష్టాల ఊబిలో కురుకొనిపోయేలా చేశారని, ప్రజాప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి వేలాది కొత్త బస్సులు, ఉద్యోగాలు నియమించడం జరిగిందన్నారు. ఆర్టీసీని పరిరక్షించుకుంటూ గ్రామాలకు రవాణ వ్యవస్థ చేరుకునేలా భవిష్యత్‌లో కొత్త బస్సులు కొనుగోలు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్, జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, ఎమ్మెల్యేలు నలమాద పద్మావతిరెడ్డి, మందుల సామేలు, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్, పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ కమిషన్ నెంబర్ చెవిటి వెంకన్నయాదవ్, సూర్యాపేట మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, సంస్థ ప్రతినిధి ప్రభాకర్, ఆర్టీసి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రాగల నాలుగు రోజులు వర్షాలు

### వెల్లడించిన హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో రాగల నాలుగు రోజులు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో వర్షాలు కురుస్తాయన్నారు. వాయువ్య ఉత్తరప్రదేశ్ పరిసర ప్రాంతాల నుంచి మధ్యప్రదేశ్, విదర్భ మీదుగా తెలంగాణ వరకు సగటు సముద్రమట్టానికి 0.9కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతోందన్నారు. ఉత్తర తమిళనాడు నుంచి దక్షిణ మహారాష్ట్ర తీరం వరకు ఇంటీరియర్ కర్నాటక మీదుగా సముద్రమట్టానికి 3.1కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి విస్తరించి ఉందన్నారు. వాయువ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర తీర ఒడిశా, దక్షిణ గంగా తీర పశ్చిమ బెంగాల్ వరకు సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతుందని చెప్పారు. ఈ క్రమంలో సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్లగొండ, మహబూబాబాద్, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశాలున్నాయన్నారు. మంగళవారం కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని చెప్పారు. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ను జారీ చేశామన్నారు. బుధ, గురు, శుక్రవారాల్లోనూ పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు.

## బల్కచర్లను అడ్డుకుంటాం... తుమ్మిడిహట్టిని పూర్తిచేస్తాం

### మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** గోదావరి నదిపై ఏపి ప్రభుత్వం నిర్మించే బల్కచర్ల ప్రాజెక్టును ఎట్టి పరిస్థితిలో అడ్డుకుంటామని రాష్ట్ర రోడ్డు భవనాల, సినిమాటోగ్రఫి శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.



బల్కచర్ల ప్రాజెక్టు విషయమై కోర్టుకు వెళ్తామని, కేంద్రంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. కృష్ణా జలాలను ఎపికి తరలించి గత ఎపిసిఆర్ ప్రభుత్వం తెలంగాణాకు తీరని అన్యాయం చేశారన్నారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్టులను పూర్తి చేసి 16లక్షల ఎకరాలకు నీళ్లు అందిస్తామని అన్నారు. ఘోష్ కమిటీ ముందు హరీష్‌రావు అన్నీ అబద్ధాలు చెప్తున్నారని అన్నారు. దళితులకు ముఖ్యమంత్రి పదవి, ఎస్సీలకు, ఎస్టీలకు పది శాతం రిజర్వేషన్లతోపాటు మూడెకరాల భూమి, రూ.10లక్షలు ఇస్తామని చెప్పి కెసిఆర్ మోసం చేసి రూ.6లక్షల కోట్ల అప్పులు చేసి తెలంగాణాను అప్పుల రాష్ట్రంగా మార్చారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం 16నెలల కాలంలోనే అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ప్రజలకు మేలు చేసిందన్నారు. రూ.22వేల కోట్లతో రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తుందన్నారు. ఆయన వెంట ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌లు ఉన్నారు.

## మల్‌రెడ్డికి మంత్రిపదవి వచ్చేలా కృషి



### ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు హామీ

**ప్రజా పక్షం/తుర్కయంజాల్ :** నిరుత్సాహం వద్దు.. ఉత్సాహంతో ముందుకు వెళ్దాం అని ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. ఇటీవల మంత్రివర్గ విస్తరణలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డికి నిరాశ ఎదురైన సంఘటన దృష్టిలో పెట్టుకొని సోమవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధిలోని తొర్రూరు ఎంఎల్‌ఎ క్యాంప్ కార్యాలయానికి రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు విచ్చేసి మల్‌రెడ్డి రంగారెడ్డిని కలిసి సానుభూతి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానంతో మాట్లాడి మంత్రివర్గ విస్తరణలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మల్‌రెడ్డి రంగారెడ్డికి మంత్రి పదవి వచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారు. నియోజకవర్గ ప్రజలు కార్యకర్తలు అభిమానులు నిరాశ చెందవద్దని కోరారు. అనంతరం ఎంఎల్‌ఎ మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ 2024 ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి నాయకులు, కార్యకర్తలను బలోపేతం చేయడం జరిగిందన్నారు. రాష్ట్రంలోనే రంగారెడ్డి జిల్లా అతిపెద్ద జిల్లా అని, ఇటీవల మంత్రివర్గ విస్తరణలో తనకు మంత్రి పదవి వస్తుందని నాయకులు, కార్యకర్తలు ఆశతో ఉన్నారని, మంత్రివర్గ విస్తరణలో తన పేరు లేకపోవడంతో నాయకులు నిరాశ చెందారని తెలిపారు. పార్టీ అధిష్టానంతో సంప్రదింపులు జరుగుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఎల్లవేళలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, తుర్కయంజాల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఇసి.శేఖర్ గౌడ్, గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## అక్టోబర్ 2న మహిళా 'సోలార్ ప్లాంట్లు' ప్రారంభించాలి

### నవంబర్ లోపు ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణ పనులను పూర్తి చేయండి
### జిల్లా కలెక్టర్ల సమీక్ష సమావేశంలో మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో అక్టోబర్ 2న సోలార్ ప్లాంట్లు ప్రారంభించే లక్ష్యంతో కలెక్టర్లు ప్రత్యేక దృష్టి సారించాలని గ్రామ పంచాయతీ, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ ధనసరి అనసూయ సీతక్క అన్నారు. 22 జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి భవనాల నిర్మాణ పనులను నవంబర్‌లోపు పూర్తిచేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభమయ్యే రోజునాటికి విద్యార్థులకు యూనిఫాములను పంపిణీ చేస్తామన్నారు. మహిళా సంఘాలతో సోలార్ ప్లాంట్స్, పెట్రోల్ బంక్స్ ఏర్పాటు, నూతన మహిళా సభ్యుల గుర్తింపు, కిశోర బాలికలు, దివ్యాంగులు, వయోధిక మహిళా సంఘాల ఏర్పాటు, ఇందిరమ్మ మహిళా శక్తి భవనాల నిర్మాణ పనుల పురోగతి, మహిళా సంఘాలతో ప్రభుత్వ పాఠశాలల స్కూల్ యూనిఫాంల సరఫరా తదితర అంశాలపై మంత్రి సీతక్క సచివాలయంలో సోమవారం కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణరావు, పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శి లోకేష్ కుమార్, సెర్ప్ సిఇఒ దివ్యా దేవరాజన్, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ సృజన, మహిళా శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ కాంతి వెస్లీ, దివ్యాంగులు,వయోవృద్ధులు,ట్రాన్స్ జెండర్ పర్సన్ సాధికార శాఖ డైరెక్టర్ శైలజ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి సిఎం ఫ్లాగ్‌షిప్ కార్యక్రమం అని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేసే లక్ష్యంతో కలెక్టర్లు పనిచేయాలని, 'తెలంగాణ రైజింగ్ 2047' సాకారం కావాలంటే మహిళా సంఘాలను బలోపేతం చేయాలని, మహిళా సంఘాలతో సోలార్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు ఏర్పాటు చేయించాలని, దీనికి అవసరమైన స్థలాలను తక్షణమే గుర్తించి పనులను ప్రారంభించాలని జిల్లా కలెక్టర్లు కృషి చేయాలని మంత్రి సూచించారు. అంగన్‌వాడీలు, ప్రభుత్వ బడులు బాగుంటేనే తెలంగాణ రాష్ట్రం బాగుంటుందని, వాటి ప్రభావం తెలంగాణ భవిష్యత్తుపైన పడుతుందని, అందుకే వాటిపైన ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.

**ప్రైవేటు వడ్డీతో మహిళల ఇబ్బందులు :** ప్రైవేటు వడ్డీ వ్యాపారుల చేతుల్లో పేదల మహిళలు ఇబ్బందులు పడుతున్నారని, అందుకే అర్హులైన ప్రతి మహిళా ఎస్‌హెచ్‌జిలో ఉండేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని మంత్రి సీతక్క సూచించారు. గ్రామ పంచాయతీల వారిగా సమీక్ష చేసి, కొత్త సభ్యులను చేర్పించాలన్నారు. బాల భరోసా పేరుతో కొత్త స్కీమును తీసుకొస్తున్నామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఈనెల 11న తెరుచుకోనున్నాయని, అప్పటిలోపు కలెక్టర్లంతా కేంద్రాల నిర్వహణ ఎలా ఉందో పరిశీలించాలని సూచించారు. అంగన్‌వాడీలలో తాగు నీరు, కరెంటు, మరుగుదొడ్లు వంటి వసతులను కల్పించాలని, ఈ నెల 11 నుంచి చేపట్టే 'అమ్మమాట అంగన్‌వాడీ బాట' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. శిథిలావస్థలో ఉన్న అంగన్‌వాడీ కేంద్రాలను సమీపంలోని ఖాళీ ప్రభుత్వ భవనాల్లోకి మార్చాలన్నారు. కొత్తగా వేయి అంగన్‌వాడీ భవనాలు నిర్మించబోతున్నామని, వాటికి కావాల్సిన స్థలాలను సేకరించాలని కలెక్టర్లను ఆదేశించారు.

**ఇందిరా మహిళా శక్తి పాలసీ కీలకం : రామకృష్ణరావు**

రామకృష్ణారావు మాట్లాడుతూ ఇందిరా మహిళాశక్తి పాలసి అత్యంత కీలకమన్నారు. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్య సాధనలో మహిళల పాత్ర కీలకమని, అందుకే పల్లెల్లో, పట్టణాల్లో మహిళా స్వయం సహాయ సంఘాల్లో నూతన సభ్యులను చేర్పించేలా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళ మహిళా సంఘాల్లో సభ్యులుగా ఉండాలని, ఓటర్ జాబితా ఆధారంగా నూతన సభ్యులను గుర్తించాలన్నారు.



## హైదరాబాద్‌లో సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావు అరెస్టు

### మహిళలపై అనుచిత వ్యాఖ్యల ఆరోపణలపై కేసు నమోదు

**ప్రజాపక్షం / హైదరాబాద్ :** సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాసరావును ఆంధ్రప్రదేశ్ పోలీసులు సోమవారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. రాజధాని అమరావతి ప్రాంతంలో వేశ్యలు ఉన్నారంటూ రెండు రోజుల క్రితం సాక్షి టీవి డిబేట్లో వ్యాఖ్యలు చేశారని ఆయనపై ఆరోపణలు చేస్తూ ఎస్‌సిఎస్‌టి కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే మహిళలపై అసభ్యకర వ్యాఖ్యలు చేశారని, జర్నలిస్టులు కొమ్మినేనితో పాటు కృష్ణంరాజు, సాక్షి యాజమాన్యంపై ఎన్‌టిఆర్ జిల్లా జిల్లా తెలుగు మహిళలు, రాజధాని రైతులు, రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ కంభంపాటి శిరీష శనివారం రాత్రి గుంటూరు జిల్లా తుళ్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై ఐటీ చట్టంతో పాటు ఎస్‌సి,ఎస్‌టి చట్టం, ఇతర నాన్ బెయిలబుల్ సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. ఈ మేరకు హైదరాబాద్‌లోని జర్నలిస్టుకాలనీ నివాసంలో ఉన్న సీనియర్ జర్నలిస్ట్ కొమ్మినేని శ్రీనివాస రావును తుళ్లూరు పోలీసులు అదుపులోకి తీసుకుని తుళ్లూరుకు తీసుకెళ్లారు. ఎపిలో కొనసాగుతున్న రెడ్‌బుక్ రాజ్యాంగం తనను కూడా తాకిందని అరెస్టు సందర్భంలో మీడియాతో కొమ్మినేని తెలిపారు.

## అర్చక, ఉద్యోగులకు గ్రాట్యుటీ.. రూ.4లక్షల నుండి రూ.8లక్షలకు పెంపు

### మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న దేవాయాలయాల్లో పని చేస్తున్న అర్చకుల చిరకాల కోరికను దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీర్చారు. అన్ని ఆలయాల్లో సుదీర్ఘ కాలంగా సేవలు అందిస్తున్న అర్చక, ఉద్యోగ సంక్షేమ నిమిత్తం ప్రత్యేకంగా నిధిని ఏర్పాటు చేశారు. రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎండోమెంటు ప్రిన్స్‌పల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, డైరెక్టర్ వెంకటరావు తదితర అధికారులతో అర్చక, ఉద్యోగ సంక్షేమ నిధి పోస్టరును సచివాలయంలో సోమవారం విడుదల చేశారు. అనంతరం మంత్రి సురేఖ మాట్లాడుతూ... అర్చక, ఉద్యోగుల కోసం తమ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుందని వివరించారు. ఈ సంక్షేమ ట్రస్టు ద్వారా దేవాదాయ శాఖ పరిధిలో గల సహాయ కమిషనర్ స్థాయి వరకు గల దేవాలయాలలో పనిచేసే సుమారు 13,700 మంది అర్చకులు, ఇతర ఉద్యోగులకు లబ్ధి చేకూరుతుందని తెలిపారు. అర్చకులు, ఇతర ఉద్యోగులకు మరణానంతరము లేదా రిటైర్మెంట్ గ్రాట్యూటీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ధూప దీప నైవేద్య అర్చకులకు మరణానంతరము చెల్లించు గ్రాట్యూటీ నిర్ధారించినట్టు చెప్పారు. మరణానంతరం చెల్లించు ఎక్స్‌గ్రేషియా, అంతిమ సంస్కారాల ఖర్చుల నిమిత్తము చెల్లింపు ఈ నిధి ఉపయోగపడుతుందన్నారు. ఈ నిధి కింద ఉద్యోగులకు.... మెడికల్ రీయింబర్స్‌మెంట్, వివాహ నిమిత్త పథకం, ఉపనయన పథకం, గృహ నిర్మాణ, కొనుగోలు మరియు మరమ్మతుల నిమిత్త పథకం, విద్యా పథకం, విధులు నిర్వహించలేని వికలాంగులైన ఉద్యోగులకు ఆర్థిక సహాయ పథకం అందజేయడం జరుగుతుందన్నారు. ఈ నిర్ణయంతో అర్చకులు, దేవాదాయ శాఖ ఉద్యోగులకు పెద్ద ఎత్తున లబ్ధి జరుగుతుందని మంత్రి కొండా సురేఖ ఆశాభావం వ్యక్తం చేశారు.

## పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

### కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్




**ప్రజాపక్షం/హైదరాబాద్ :** దీర్ఘకాలికంగా పెండింగ్ లోఉన్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పిఎసిఎస్) ఉద్యోగుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ ఎంఎల్‌సి అద్దంకి దయాకర్ చెప్పారు. తెలంగాణ రాష్ట్ర ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర స్థాయి సమావేశం సంఘం అధ్యక్షుడు ఎ.శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షత హైదరాబాద్ నారాయణగూడలోని ఐఎన్‌టియుసి రాష్ట్ర కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సమావేశంలో అద్దంకి దయాకర్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఐఎన్‌టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సంఘం గౌరవ అధ్యక్షుడు వై.నాగన్న గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్ యాదవ్, రాష్ట్ర నాయకులు అనంతుల నరసయ్య, భాస్కర్ రెడ్డి, మల్లారెడ్డి, సురేష్ తదితరులు వేదికపై ఆసీనులయ్యారు. సమావేశంలో అద్దంకి దయాకర్ మాట్లాడుతూ సమ్మిళిత ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడం లక్ష్యంగా ఏర్పాటైన పిఎసిఎస్‌లో ఉద్యోగులు రైతులతో చాలా దగ్గరి సంబంధాన్ని కలిగివుంటారని, రైతు సంఘాలను క్రెడిట్, ఇన్‌పుట్లు, మార్కెట్, విలువను తీసుకురావడంలో ప్రధాన పాత్ర పోషిస్తారని గుర్తు చేశారు. రైతులకు, గ్రామీణ వ్యవసాయ వర్గాలకు క్రెడిట్, ఆర్థిక సేవలతో పాటు బహుళ సేవలను అందిస్తూ, పేదరికం తగ్గింపు, ఆహార భద్రత, స్థిరమైన అభివృద్ధికి దోహదపడుతున్న పిఎసిఎస్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కారం కాకపోవడంతో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తీవ్రంగా నష్టపోయారన్నారు. అన్నివర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడివుందని, పిఎసిఎస్ ఉద్యోగుల సమస్యలను తప్పకుండా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరలో పరిష్కారానికి కృషి చేస్తానని అద్దంకి దయాకర్ హామీ ఇచ్చారు.

వై.నాగన్నగౌడ్ మాట్లాడుతూ పిఎసిఎస్ ఉద్యోగులకు ప్రతి నెలా 5న డిసిసిబి బ్యాంకు ద్వారా జీతభత్యాలు చెల్లించాలని, గ్రాట్యుటీ రూ.2 లక్షలు కాకుండా రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ డిసిసిబి ఉద్యోగుల మాదిరిగా ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న పిఆర్‌సి తక్షణమే అమలు చేయాలని కోరారు. ఎ.శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలతో సంబంధం లేకుండా స్థానిక జిల్లాలోనే బదిలీలు చేయాలని, ప్రత్యేక నిధులను కేటాయించి డిసిసిబి ద్వారా భవిష్యనిధి చెల్లించి, ఆరోగ్య కార్డులు కూడా ఇవ్వాలన్నారు.


**పురపాలక కార్యాలయము : బెల్లంపల్లి : జిల్లా :: మంచిర్యాల**

ఈ-ప్రొక్యూర్మెంట్ టెండర్ నోటీస్ నెం. ఇ1/02/టెండర్/2025-26/Bpl/Mptly, తేది: 09.06.2025

ఈ-ప్రొక్యూర్మెంట్ షార్ట్ టెండర్ నోటీస్

ఈ కార్యాలయములో అంచనా విలువ రూ.29.00 లక్షల విలువ గల (6) పనులకు పట్టణ ప్రగతి నిధులకుగాను సివిల్ రిజిస్ట్రేషన్ కాంట్రాక్టర్ వారి నుండి ఈ కార్యాలయం ఈ-ప్రొక్యూర్మెంట్ ద్వారా టెండర్లు కోరబడుచున్నవి. వాటి వివరములు ఈ క్రింది విధముగా ఉన్నవి. **టెండర్ తేదీల వివరములు : 01.** డౌన్‌లోడ్ మొదలు తేది & సమయం: 10.06.2025 from 04.00 PM, **02.** డౌన్‌లోడ్ చివరి తేది & సమయం: 17.06.2025 up to 4.00 PM. ఇట్టి విషయములో తదుపరి సమాచార నిమిత్తము ఆఫీసు పనివేళల్లో మున్సిపల్ కార్యాలయము నందు సంప్రదించగలరు. పూర్తి వివరములకు website:www.tender.telangana.gov.in నందు చూడవచ్చును.

సం/- కమిషనర్, బెల్లంపల్లి మున్సిపాలిటీ.

DIPR R.O. No. : 3298-PP/CL/ADVT/1/2025-26, Date: 09-06-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్**

ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయం, ఎల్‌బినగర్ సర్కిల్-4, ఎంఆర్‌ఓ కార్యాలయం పక్కన, సరూర్‌నగర్, హైదరాబాద్. ఇ-మెయిల్: eec4.ghmc@gmail.com

నం. EE/LBNR/LBNZ/03/2025-26 కొటేషన్ నోటీసు తేది: 06.06.2025

ప్రముఖ సంస్థల నుండి సీల్డ్ కొటేషన్స్‌ఆహ్వానించడమైనవి. వీటిని 11.06.2025న లేదా అంతకు ముందు మధ్యాహ్నం 3.00 గంటల వరకు కింద సంతకం చేసిన వారికి అందజేయాలి మరియు అదే రోజు సాయంత్రం 4:00 గంటలకు తెరవబడతాయి. దిగువ అంశాల వివరణాత్మక వివరణలు మరియు స్పష్టత కోసం మీరు కార్యాలయ వేళల్లో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బి నగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసిని సంప్రదించవచ్చు.

| క్ర. సం. | అంశం యొక్క వివరణ | పరిమాణం | యూనిట్ | మొత్తం |
|---|---|---|---|---|
| 1 | డిపార్ట్మెంట్ ఆమోదించిన ప్రకారం, మెటీరియల్ సరఫరా & లేబర్ ఛార్జీలు, డిజైన్ & టెక్స్చర్‌తో సహా 1' ప్యానెల్ ఎత్తు, 2'' మందం, 6' పొడవుతో ప్రీ-కాస్ట్ ఆర్‌సిసి బౌండరీ వాల్ ప్యానెల్ సరఫరా, డెలివరీ మరియు నిర్మాణం, జిఎస్‌టి, అన్ని పన్నులు మొదలైనవి పూర్తి చేసిన పని మొత్తం. | 1 | Rmt | |

**షరతులు:**
**1.** జిహెచ్‌ఎంసి, ఎల్‌బి నగర్ సర్కిల్-4, సర్కిల్-4, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో కొటేషన్లను 11.06.2025న లేదా అంతకు ముందు మ.3.00 గం.ల వరకు స్వీకరించాలి మరియు అవి సా.4.00 గం.లకు తెరవబడతాయి. **2.** ఎటువంటి కారణం చూపకుండానే కొటేషన్లను రద్దు చేసే హక్కు ఎల్.బి.నగర్‌లోని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌కు కలదు.
**సంబంధిత అధికారి చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బి నగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి, హైదరాబాద్.

సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, ఎల్‌బినగర్ సర్కిల్-4, జిహెచ్‌ఎంసి.

DIPR R.O. No. : 3277-PP/CL/ADVT/1/2025-26, Date: 09-06-2025

ప్రజాపక్షం
మంగళవారం, 10 జూన్

# నిరుద్యోగం@6.9 శాతం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పరిపాలనను దేశానికి స్వర్ణయుగంగా సోమవారం (జూన్ 9) బిజెపి వేడుక చేసుకుంది. నిజమే అదానీ, అంబానీ తదితర పారిశ్రామిక కుబేర తరగతికి అది స్వర్ణ యుగం. స్థూల జిడిపి దేశాన్ని ప్రపంచంలో అతిపెద్ద నాలుగవ స్థానానికి చేర్చినట్లు మురిసిపోయే తరగతులకు స్వర్ణయుగం. కానీ అదే సమయంలో 140 కోట్లలో 80 కోట్ల జనాభాకు రేషన్లు అందించడం కూడా గర్వకారణంగా చెప్పుకోవడం సిగ్గుచేటు కాదా? అది దేశంలో తాండవిస్తున్న దారిద్ర్యానికి నిదర్శనం కాదా? ప్రపంచబ్యాంకు సైతం భారతదేశంలో దారిద్ర్యం 5 శాతానికి తగ్గిపోయిందని కితాబు ఇవ్వడం మోదీ ప్రభుత్వ ప్రచారానికి వంత పాడటం తప్ప మరొకటి కాదు. వార్షిక తలసరి ఆదాయంలోనే కాదు, ఆకలి, ఆరోగ్యం, అక్షరాస్యత ఇలా అన్ని రకాల మానవాభివృద్ధి సూచీల్లో అత్యధిక ప్రపంచ దేశాలకు విసిరేసినంత దూరంలో ఉన్న మన దేశం స్వర్ణయుగాన్ని అనుభవిస్తున్నదని భజనపరులు టముకులు మోగించవచ్చు, టపాసులు కాల్చవచ్చు. కానీ వినేవాడు చెవిలో కాలీఫ్లవర్ పెట్టుకోలేదుగా? వారి జీవితమే వారికి కొలమానం.

ఉదాహరణకు నిరుద్యోగితనే పరిశీలించుదాం. నరేంద్ర మోదీ గారు 2014 ఎన్నికల్లో కాంగ్రెస్ పాలనపై దుమ్మెత్తి పోసిన అంశాల్లో ఇదొకటి. తనకు అధికారం ఇస్తే ప్రతి సంవత్సరం లేబర్ మార్కెట్లో ప్రవేశించే 2 కోట్ల మందికి ఉపాధి చూపుతానని నిరుద్యోగులపై సమ్మోహనాస్త్రం ప్రయోగించారు. ఫలితం పొందారు కాని అది నెరవేర్చారా? 22 కోట్ల మందికి ఉద్యోగాలు చూపారా? వీధుల్లో పకోడి అమ్ముకోవడం, ఇళ్లల్లో పాచి పనులు చేసుకోవడం కూడా ఉపాధి కల్పన కిందే లెక్క కట్టిందీ ప్రభుత్వం కానీ సెంటర్ ఆఫ్ మానిటరింగ్ ఇండియన్ ఎకానమీ (సిఎంఐఇ) 30 రోజుల చలన సగటు ప్రాతిపదికపై నిరుద్యోగిత రేటు 6.9శాతం ఉంది. మే 30 నాటి సంఖ్య 6.7శాతం, ఏప్రిల్‌లో 7.7శాతం, మార్చి నెలలో 7.6శాతం. కేంద్ర కార్మిక– ఉపాధి మంత్రిత్వ శాఖ కూడా ఇటీవల నెలవారీ పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పి.ఎల్.ఎఫ్.ఎస్) డేటా సేకరణ మొదలెట్టింది. 2025 ఏప్రిల్‌కు సంబంధించి అది మే 15న విడుదల చేసిన తొలి మాసపు డేటా వారం ప్రాతిపదికపై నిరుద్యోగ రేట్‌ను 5.1గా నిర్ధారించింది. క్షేత్రస్థాయిలో నిజ రేట్ ఇంకా ఎంతో హెచ్చుగా ఉంటుంది. కార్మిక ఉపాధి మంత్రిత్వ శాఖ లేబర్ బ్యూరో 2013–14 సర్వే ప్రకారం దేశంలో నిరుద్యోగిత రేట్ 4.9 శాతం. నరేంద్ర మోదీ 2014లో అధికారంలోకి వచ్చారు. 2017– 18కి నిరుద్యోగం గత 45 సంవత్సరాల్లో కెల్లా ఎక్కువగా 6.1 శాతానికి చేరింది. 2025 ఏప్రిల్‌లో 5.1 శాతం. ఈ కాలంలో పట్టణ నిరుద్యోగిత 5.5 నుంచి 6.5 శాతానికి పెరిగింది. అదే కాలంలో గ్రామీణ నిరుద్యోగిత 4.7శాతం నుంచి 4.5కు తగ్గింది.

ఇదిలా ఉండగా గత లోక్‌సభ ఎన్నికల సమయంలో సొంత డబ్బా కొట్టుకునేందుకు పాలక బిజెపి వారు ఒక రిజర్వ్ బ్యాంక్ నివేదికను చేతబుచ్చుకొని 2014–15 మరియు 2023–24 మధ్య 17 కోట్ల 19లక్షలు ఉద్యోగాలు కల్పించినట్లు చెప్పుకున్నారు. ఆ డేటా శుద్ధ తప్పు అని కచ్చితంగా చెప్పవచ్చు. డీమానిటైజేషన్ వల్ల 2016–17లో లక్షల సంఖ్యలో చిన్న, మధ్య తరహా పరిశ్రమలు మూతపడ్డాయి. అంతకు ఐదారు రేట్లు ఉద్యోగాలు ఊడాయి. ఆ కాలంలో ఉపాధులు 47.1 కోట్ల నుండి 47.3 పెరిగాయని ఆర్బిఐ కెఎల్ఇఎంఎస్ నివేదిక తెలిపింది. కోవిడ్–19 కారణంగా 2020–22 కాలంలో యావత్ ఆర్థిక వ్యవస్థ మూతపడగా ఉపాధులు 57.8 కోట్లకు పెరిగినట్లు చెప్పింది. 2023–24లో 64.3 కోట్లకు చేరిందట!

మెరుగైన సంఖ్యల కోసం ప్రభుత్వం ఒకటికి రెండుసార్లు 2017–18లో, తిరిగి 2025 జనవరిలో పిఎల్ఎఫ్ఎస్ నిర్వచనాలు, మెథడాలజీలో మార్పులు చేసింది. అయినా దాని తొలి పిఎల్ఎఫ్ఎస్ డేటా అద్భుతాలు సృష్టించలేదు. మోదీ స్వర్ణయుగం ప్రభావం కనిపించలేదు. పైగా 15–29 సంవత్సరాల వయో గ్రూపులో నిరుద్యోగిత రేటు ఆందోళనకరంగా 13శాతం ఉంది.

క్షేత్రస్థాయిలో వాస్తవం మరింత భయానకంగా ఉంది. నిరుద్యోగం, వేతనం లేని ఉపాధి, తక్కువ వేతనానికి దోపిడీకి గురవుతున్న శ్రమ విశృంఖలంగా ఉంది. మోదీ చెప్పుకునే స్వర్ణ యుగం ఎవరికి లబ్ది చేకూర్చింది? కంపెనీలు, వ్యాపారాల లాభార్జనకు కాదా? అంతరాలు తీవ్రంగా పెంచుతున్న మోదీ పాలన స్వర్ణయుగమని చెప్పుకోవడం ఆత్మవంచన కాదా?

# చెదిరిన స్నేహం : ట్రంప్ వర్సెస్ మస్క్

– టిఎస్.అశోక్

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్, ఆయన సన్నిహితుడు, టెక్ బిలియనీర్ ఎలాన్ మస్క్ మధ్య విభేదాలు ఇప్పుడు బహిరంగంగానే భగ్గుమన్నాయి. ట్రంప్ మరోసారి ఎన్నికయ్యేందుకు మస్క్ తన వ్యక్తిగత సంపద నుంచి 288 మిలియన్ డాలర్లను వెచ్చించారు. ట్రంప్ ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా టెస్లా సిఇఒ తీవ్ర విమర్శలు చేయడం ద్వారా ఈ ఇద్దరు స్నేహితుల వైఖరి మధ్య ప్రాథమికంగానే తేడాలు ఉన్నట్లు సూచిస్తుంది.



మస్క్ ఉపయోగించిన 'అసహ్యకరమైన అకృత్యం' అనే పదాలు, అధ్యక్షుడు ట్రంప్‌కు, టెస్లా ఇవిలు, ఎక్స్ ఎఐ, స్పేస్‌ఎక్స్, న్యూరల్ లింక్ (బ్రెయిన్ మ్యాపింగ్) వ్యవస్థాపకుడు, సోషల్ ప్లాట్‌ఫామ్ ఎక్స్ యజమాని అయిన టెక్ బిలియనీర్ మధ్య సంబంధాన్ని ప్రమాదంలో పడేసాయి. ట్రంప్ కూడా తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ట్రూత్ సోషల్‌లో మిలియన్ల మంది అనుచరులతో అభ్యంతరకరమైన భాషను ఉపయోగించడం అలవాటు పడినందున, ఈ సంబంధంలో ఆయన ఏ వైపుకైనా మొగ్గు చూపవచ్చు. ఈ మాటల యుద్ధంలో ట్రంప్ ఆశ్చర్యకరంగా శాంతంగా ఉండి, తీవ్రంగా స్పందించలేదు.




ప్రస్తుతం అత్యంత నైరాశ్యంలో మునిగిన మస్క్ గతంలో దక్షిణాఫ్రికా నుంచి హెచ్1బి వీసాపై అమెరికాకి వచ్చి తన వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించుకున్నాడు. వలసదారులు, సుంకాలు, ప్రభుత్వ వ్యయంపై ట్రంప్ విధానాలపై విభిన్న అభిప్రాయాలను కలిగి ఉన్నాడు. ట్రంప్ పాలన మొదటి 130 రోజులు ఈ విధానాలను కొనసాగించారు. ఇప్పుడు పరిపాలన నుండి బయటపడిన తర్వాత, అతను తన వ్యక్తిగత అభిప్రాయాలను ఎటువంటి అడ్డూ అదుపు లేకుండా వెల్లడిస్తున్నారు.

ప్రభుత్వంలోని అనవసరమైన ఉద్యోగాలను తగ్గించి, ప్రభుత్వ వ్యయాన్ని ఆదా చేయడానికి డోజ్– డిపార్ట్మెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫిషియెన్సీ ఛీఫ్ అడ్మినిస్ట్రేటర్‌గా మస్క్ వైట్ హౌస్‌లోకి అడుగు పెట్టారు. సైద్ధాంతిక విభేదాలు తలెత్తి, ఆయన సహ నిర్వాహకుడు, 2024 అధ్యక్ష అభ్యర్థిగా పోటీ చేయాలని భావించిన ట్రంప్ అభిమాని వివేక్ రామస్వామి డోజ్‌ను ప్రభుత్వం వెలుపల ఉంచాలని కోరినప్పుడు, ఆయన నివసిస్తున్న ఒహాయో రాష్ట్ర గవర్నర్‌షిప్ కోసం ప్రచారం చేయడానికి పంపించారు.

వైట్ హౌస్ పక్కనే ఉండే ఒక భవనంలోకి ప్రవేశించిన మస్క్‌కు అమెరికాలోని అత్యంత శక్తిమంతమైన సలహా బృందం ఉండే వెస్ట్ వింగ్‌లో గది లభించలేదు. ఆయన తన పనిని నిబద్ధతతో ప్రారంభించాడు. తన 130 రోజుల మిషన్ ముగిసే సమయానికి, ప్రభుత్వ వ్యయంలో 175 బిలియన్ డాలర్లను ఆదా చేయడానికి ఆయన 135 బిలియన్ డాలర్లను ఖర్చు చేశారు. ఇది ఆయన వాగ్దానం చేసిన వ్యయ కర్తనం 2 ట్రిలియన్ డాలర్లకు, ఆ తర్వాత 1 ట్రిలియన్ డాలర్లకు తగ్గించబడిన మొత్తంలో ఒక చిన్న భాగం.

ట్రంప్ దాదాపుగా డోజ్ నుండి వైదొలగమని చెప్పినప్పుడు మాస్క్ ఆశ్చర్యానికి గురయ్యాడు. ఎందుకంటే బడ్జెట్ లోటును పెంచినందుకుగాను గత అధ్యక్షుడు బైడన్ ప్రభుత్వ ఖర్చును తగ్గించాలని 2024లో ప్రచారం చేసిన వ్యక్తి (ట్రంప్) ఇప్పుడు బైడెన్ మాదిరిగానే వ్యవహరిస్తూ మొత్తం పరిస్థితిని మొదటికే తీసుకువచ్చినందుకు ఆశ్చర్యపోయాడు.

వాషింగ్టన్ డి.సి.లో ట్రంప్ ప్రతిపాదిత 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' గురించి భయాలు వ్యక్తమవుతున్నాయి. బైడెన్ బిల్డ్, బ్యాక్, బెటర్ చొరవతో వాతావరణ సాంకేతికతలపై 1.7 ట్రిలియన్ డాలర్ల వ్యయం చేయగా, ట్రంప్ తాజా బిల్లు వచ్చే 10 సంవత్సరాలలో వ్యయాన్ని 5 ట్రిలియన్ డాలర్లకు పెంచింది ఇది ప్రభుత్వ బడ్జెట్‌లో భారీ లోటును సృష్టించవచ్చు.

సంవత్సరానికి 4 మిలియన్ డాలర్ల కంటే ఎక్కువ సంపాదించే ధనవంతుల పన్నులను తగ్గించడానికి, వారికి సంవత్సరానికి 4,00,000 డాలర్లను ఆదా చేయడానికి, మెడికెయిడ్, మెడికేర్, ఒబామాకేర్‌లపై ఖర్చులను తగ్గించడానికి, అందుబాటులో వైద్య సంరక్షణ చట్టాన్ని పునర్నిర్వచించి 8.6 మిలియన్ల పట్టణ మధ్యతరగతి ప్రజలను ఆరోగ్య సంరక్షణ నెట్ నుండి మినహాయించడం, ప్రతి పట్టణ కుటుంబానికి మెడికేర్ ఖర్చులను 1,000 డాలర్లకు పెంచడం, మధ్యతరగతి ప్రజలకు అవసరమైన మందుల ధరలను పెంచడం వంటి ట్రంప్ ప్రయత్నాలు, డోగ్ ద్వారా వృథా ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించడంలో సాధించిన అన్ని లాభాలను తగ్గించేలా కనిపిస్తున్నాయి.

మస్క్ తన ఎక్స్ మీడియా ప్లాట్‌ఫామ్‌లో తీవ్ర స్థాయిలో విరుచుకుపడుతూ, బిగ్ బ్యూటిఫుల్ బిల్లును 'భారీ, అభ్యంతరకరమైన, అనవసరమైన కాంగ్రెస్ వ్యయ బిల్లు' అని ఆరోపించాడు. అది ఒక అకృత్యమైన బిల్లు అని ఆయన అన్నారు.

ఈ బిల్లు కాంగ్రెస్‌లో 215–214 తేడాతో ఒక్క ఓటుతో ఆమోదించబడింది. ఇప్పుడు సెనేట్‌లో అటూ ఇటూ వేలాడుతుంది. అక్కడ రిపబ్లికన్లు డెమొక్రాట్ల కంటే అధికంగా 53–47 మెజారిటీని కలిగి ఉన్నారు. ఉపాధ్యక్షుడు జెడి వాన్స్ సెనేట్ అధ్యక్షుడిగా, టైబ్రేకింగ్ ఓటును కలిగి ఉన్నారు.

సెనేట్‌లో ముగ్గురు రిపబ్లికన్లు దీనిని వ్యతిరేకిస్తున్నందున, ట్రంప్ బిబిబిని 50–47 తో సెనేట్ ద్వారా ఆమోదింపజేయగలడు. ఒకవేళ అది తీవ్రమైన పోటీ అయితే, జెడి వాన్స్ తన టైబ్రేకింగ్ ఓటుతో ఎల్లవేళలా ఆదుకోగలడు. కానీ బిల్లును వ్యతిరేకిస్తున్న రిపబ్లికన్ల విభాగానికి ఆమోదయోగ్యంగా చేయడానికి దాని ప్రస్తుత రూపంలో మార్పులు చేయవచ్చు.

చరిత్ర పునరావృతమవుతున్నట్లు కనిపిస్తోంది. జో బైడెన్ బిల్డ్ బ్యాక్ బెటర్ బిల్ చొరవ, 1.7 ట్రిలియన్ డాలర్ల బడ్జెట్‌తో, శిలాజ ఇంధనాలకు వ్యతిరేకంగా వాతావరణ మార్పు సాంకేతికతలను ప్రోత్సహించడానికి ప్రయత్నించినందున, శిలాజ ఇంధన లాబీకి ప్రాతినిధ్యం వహించే ఆయన స్వంత డెమొక్రాట్ల ద్వారా నిర్వీర్యం చేయబడింది. అనేక మంది సెనేటర్లు, కాంగ్రెస్ సభ్యులను ప్రభావితం చేసే శిలాజ ఇంధన లాబీ, 2023–24 ఆర్థిక సంవత్సరంలో వాతావరణ మార్పు న్యాయవాద బృందాలకు వ్యతిరేకంగా లాబీయింగ్ చేయడానికి సుమారు 93 బిలియన్ డాలర్లను ఖర్చు చేసింది.

బైడెన్ ప్రతిపాదిత బిల్ బ్యాక్ బెటర్ ఇనిషియేటివ్ సుమారు 1 ట్రిలియన్ డాలర్లకు తగ్గించబడింది, అయినప్పటికీ ఇవిలను ప్రోత్సహించడం, కార్ల అమ్మకాలపై సబ్సిడీలు, వాటిలో ఉపయోగించే బ్యాటరీలతో సహా వాతావరణ మార్పు సాంకేతికతలకు 750 బిలియన్ డాలర్లు కేటాయించగలిగింది. అయితే ట్రంప్ బిబిబి, బైడెన్ బిబిబి మాదిరిగానే ఒకే పేరుతో ఉన్నప్పటికీ, మస్క్ సెనేటర్లను ప్రభావితం చేయగలిగితే దాని ప్రస్తుత రూపం సెనేట్‌లో నిర్వీర్యం అయ్యే అవకాశం ఉంది. బిల్లుకు ఓటు వేసిన కాంగ్రెస్ సభ్యుల గురించి మస్క్ ఇలా అన్నారు: 'దానికి ఓటు వేసిన వారికి సిగ్గుపడాలి: మీరు తప్పు చేశారని మీకు తెలుసు. మీకు తెలుసు.'

ట్రంప్ ఈ బిల్లును జూలై 4 నాటికి ఆమోదించడానికి గడువు విధించారు. ఇది అతని రెండవ పదవీకాలాన్ని నిర్వచించి, అమెరికా ఆర్థిక వ్యవస్థకు మార్గం చూపగలదు. పన్నులను తగ్గించి, సామాజిక వ్యయాన్ని తగ్గించి, సమాఖ్య రుణాన్ని పెంచే ఈ ప్యాకేజీ గురించి ఆందోళన చెందుతున్న రిపబ్లికన్ సెనేటర్లపై ఆయన ఒత్తిడి పెంచారు.

ఓవల్ ఆఫీసులో మస్క్‌కు ఉన్నత స్థాయి వీడ్కోలుకు ఐదు రోజుల తర్వాత ఆయన చేసిన తీవ్ర విమర్శలు వచ్చాయి. వైట్ హౌస్‌తో ఆయన వివాదం ముదిరింది. సుంకాల విధానంపై ఆయన విమర్శలు చేశారు. అమెరికా బడ్జెట్ వ్యయం నుండి 1 ట్రిలియన్ డాలర్లు తగ్గించడానికి తన ప్రయత్నాలకు పూర్తిగా మద్దతు ఇవ్వనందుకు నిందించారు. టెస్లా కోసం అనేక విడిభాగాలను చైనా నుండి ఔట్‌సోర్స్ చేసే, ఆ దేశంలో పెద్ద సంఖ్యలో టెస్లా కార్లను విక్రయించే మస్క్, చైనాపై విధించిన సుంకాల వల్ల తీవ్రంగా దెబ్బతిన్న వారిలో ఒకరు.

మస్క్ తన త్రైమాసిక లాభాలు 71% పడిపోవడాన్ని చూశాడు. వాటాదారులు, డైరెక్టర్ల బోర్డు తీవ్రంగా కలత చెంది, మస్క్‌ను టెస్లాకు తిరిగి వచ్చి సిఇఒగా తన పని చేయాలని లేదా రాజీనామా చేసి కంపెనీని నడపడానికి ప్రత్యామ్నాయాన్ని కనుగొనాలని కోరారు. టెస్లా నుండి స్పేస్‌ఎక్స్ వరకు, బ్రెయిన్ మ్యాపింగ్ న్యూరల్ లింక్ వరకు, ఆయన ట్విట్టర్ నుండి 44 బిలియన్ డాలర్లకు కొనుగోలు చేసిన తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ వరకు మస్క్ ప్రతి వెంచర్ ఆయన హృదయానికి దగ్గరగా ఉంటుంది. ఆయన తన ప్రధాన సంస్థకు తిరిగి వచ్చి అన్ని సంస్థలను నడుపుతానని, అవసరమైతే కంపెనీని లాభదాయకమైన రోజులకు తిరిగి తీసుకురావడానికి తన కార్యాలయంలోనే నిద్రపోతానని చెప్పాడు.

మస్క్ వ్యాపార సామ్రాజ్యాన్ని దెబ్బ తీస్తానని ట్రంప్ హెచ్చరించగా మస్క్ కొత్త పార్టీ పెట్టే ఆలోచనలో ఉన్నాడు. రెండు పార్టీల వ్యవస్థ నడుస్తున్న అమెరికాలో బలమైన మూడవ పార్టీ రాగలిగితే అది మరింత ఆసక్తిదాయకం!

(ఐపిఎ సర్వీస్)

# భవిష్యత్ 'రాత' మార్చిన పెన్ను

(నేడు జాతీయ బాల్‌పాయింట్ పెన్ దినోత్సవం)

రాయడానికి అందుబాటులో ఉన్న ఏకైక ఉత్తమ సాధనం బాల్‌పాయింట్ పెన్ లేదా బాల్ పెన్ అని మనకు తెలుసు. చిన్నారి నుంచి పండు ముసలి వరకు అందరి హస్త భూషణం బాల్ పెన్. బాల్ పెన్‌ను చూడని, స్పర్శించని వారు ఉన్నారా ! విద్యా బోధన, విద్యావంతుల జేబు భూషణం, వ్యాపార గణాంకాల పునాది, సమాచార వితరణశీలి పెన్ను మాత్రమే. నేడు ప్రపంచవ్యాప్తంగా పెన్ను అంటేనే బాల్‌పాయింట్ పెన్ అనేది నిర్వివాదాంశం. గత ఎనిమిది దశాబ్దాలకు పైగా మన ఇంటి నేస్తం అయ్యింది బాల్ పెన్ను. గతంలో ఇంకులో ముంచి రాసుకునే పన్నులు, సిరా నింపి రాసుకునే పన్నులను చూసాం. నేడు ఇంకా పెన్ను అంతరించిపోయింది. బాల్‌పాయింట్ పెన్ను మన నిత్య నేస్తం అయ్యింది.

**జాతీయ బాల్‌పాయించ్ పెన్ దినోత్సవం:**



1888లో జాన్ లావుడ్ అనే శాస్త్రవేత్త ఇంకు పెన్నును కనుగొనడం జరిగింది. ఇంకు పెన్ను వాడుకలో వచ్చిన అసౌకర్యాల వల్ల మరో మెరుగైన పెన్ను అవసరం ఏర్పడింది. 1938 లో లాజ్లో బిరో అనే హంగేరియన్ జర్నలిస్టు బాల్‌పాయింట్ పెన్నులు తెలిసాయి రూపొందించడం, తర్వాత 1943 జూన్ 10న తన సోదరుడు ఇంజనీర్ జియార్జీ బిరోతో కలిసి బాల్పాయింట్ పెన్నును పేటెంట్ చేయడం జరిగింది. ఈ పరమ అద్భుత ఆవిష్కరణకు గుర్తుగా ప్రతి ఏటా జూన్ 10న ప్రపంచ దేశాలు జాతీయ బాల్‌పాయింట్ పెన్ దినోత్సవం (నేషనల్ బాల్‌పాయింట్ పెన్ డే) పాటించడం ఆనవాయితీగా మారింది. జాతీయ బాల్‌పాయింట్ పెన్ దినం వేదికగా పెన్నులు కృతజ్ఞతలు తెలపడం, వివిధ రకాల పెన్నుల ప్రదర్శనలు, పెన్నులను అలంకరించి కృతజ్ఞతలు తెలపడం, పెన్‌తో మన ఆప్తులకు ఉత్తరం రాయడం, పెన్ను ప్రాధాన్యాన్ని గూర్చి వ్యాసం రాయడం, బాల్‌పెన్ ఆవిష్కర్తలకు కృతజ్ఞతలు తెలపడం లాంటి కార్యక్రమాలను నిర్వహించవచ్చు.

నాటి నుంచి నేటి వరకు విద్యాలయాలు, విద్యావంతులు, వ్యాపారవేత్తలు, కార్యాలయాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు, అన్నివర్గాల ప్రజలు/యువ/పిల్లలకు ఆత్మీయ నేస్తంగా, గౌరవాన్ని పెంచే చవకైన సాధనంగా, జేబుకు అలంకారంగా బాల్‌పాయింట్ పెన్ను అపార అద్వితీయ సేవలను అందిస్తున్నది. బాల్‌పాయింట్ పెన్ సాధనంగా విద్యా బోధనలు, సాంస్కృతిక వికాసం, ఆర్థిక వ్యవస్థలు, సగటు మనిషి జీవనశైలిలో ఓ అవిభాజ్య భాగం అయ్యింది. ఒక్క బాల్‌పాయింట్ పెన్‌తో దాదాపు 50,000 పదాలు రాస్తూ 100 పేజీల వరకు రాయవచ్చు. ప్రతి ఒక్కరు సాలీనా సగటున 4.3 బాల్ పెన్నులను వాడడం జరుగుతోంది. ప్రపంచవ్యాప్తంగా సెకనుకు 125 బాల్ పెన్నుల అమ్మకాలు జరుగుతున్నాయి. పలు రకాల బ్రాండ్లు, అద్భుత ఆకృతులు, ఆకర్షణీయ కళా సంపదలతో బాల్ పెన్నులు మనకు అందుబాటులో ఉన్నాయి. తరగతి గది గుండెకాయ బాల్ పెన్ అని తెలుసుకోవాలి. అందరికీ చవకగా అందుబాటులో ఉన్న బాల్‌పాయింట్ పెన్నులు నమ్మకమైన, నాణ్యమైన, మృదురాతల ధారలు పారిస్తున్నాయి. తేలికగా పేపరుపై పారడం, సులభంగా ఆరిపోవడం, అందమైన రాతలకు వారధిగా కావడం బాల్ పెన్ను ప్రత్యేకతలుగా పేర్కొనాలి.

ఆకర్షణీయమైన రంగులు, వివిధ కాళాకృతులతో నేడు బాల్ పెన్నులు పిల్లలు/యువతలో చదుకోవాలనే, రాయాలనే ఉత్సుకతను ప్రేరేపిస్తున్నాయి. నేడు అందమైన బాల్‌పాయింట్ పెన్నులు వ్యక్తుల స్థాయిని, వ్యక్తిత్వాలను చెప్పకనే చెబుతున్నాయి. మన జేబులో చేరిన పెన్ను మన హృదయ ఉపరితలంపై నాట్యమాడుతూ మనకు సమోన్నత గౌరవాన్ని ఆర్జించి పెడుతున్నాయి. మన జీవితంలో ఒక విడదీయరాని భాగమైన బాల్‌పాయింట్ పెన్నులను పూజాగదిలో ఇష్టదైవం ముందు పెట్టి మనకు విజ్ఞాన వివేకాలను అందించమని వేడుకుందాం. మన బాల్‌పాయింట్ పెన్నుకు శతకోటి వందనాలు అర్పిద్దాం, సన్మార్గంలో నడిచే ధైర్యాన్ని ఇవ్వమని వేడుకుందాం.

– డా.బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# సరికొత్త ఆవిష్కరణల దిశగా అడుగు!

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ 'ఇస్రో' భవిష్యత్తులో చేపట్టనున్న మానవ సహిత అంతరిక్ష యాత్రకు ఎంతగానో ఉపయోగపడే ఆక్సియమ్ మిషన్ 4 (ఎఎక్స్4) అందరి దృష్టినీ ఆకర్షిస్తున్నది. భారత కాలమానం ప్రకారం మంగళవారం సాయంత్రం జరగాల్సిన రోదసీయాత్ర బుధవారానికి వాయిదాపడినప్పటికీ, భారతవ్యోమగామి శుభాంశు శుక్లా కూడా భాగస్వామి కావడం ప్రత్యేకతను సంతరించుకుంది. అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి భారతీయుడు రాకేశ్ శర్మకాగా, శుక్లా రెండో వ్యక్తిగా రికార్డు పుటల్లో చోటు సంపాదిస్తాడు. అంతేగాక, అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్)లో అడుగుపెట్టనున్న తొలి భారతీయుడిగా చరిత్ర సృష్టించనున్నాడు. ఈ ప్రయోగం కేవలం భారతీయులకు మాత్రమేగాక, యావత్ మానవాళికి కూడా ఎంతో కీలకంగా మారింది. సరికొత్త ఆవిష్కరణల దిశగా శాస్త్రవేత్తలు కృషి చేయనున్న తరుణంలో, బుధవారం ఐఎస్‌ఎస్‌కు బయలుదేరనున్న మొత్తం నలుగురు వ్యోమగాములు చేయబోయే ప్రయోగాలపై ప్రపంచ దేశాలు దృష్టి పెట్టాయి. ఇది కేవలం ఎఎక్స్4 ప్రయోగం గురించి మాత్రమేగాక, మార్గదర్శక పరిశోధనల గురించి కూడా ప్రాధాన్యతను సంతరించుకుంది. ఈ యాత్ర ఆక్సియమ్ స్పేస్ నిర్వహించిన ఏ మిషన్లలోనూ లేనంత విస్తృతమైన శాస్త్రీయ ప్రయోగాలు, సాంకేతిక ప్రదర్శనలను చేపట్టడానికి సిద్ధంగా ఉంది. ఐఎస్‌ఎస్‌లో ఉన్న అధునాతన ప్రయోగశాలలను ఉపయోగించుకుని సిబ్బంది 60కిపైగా పరిశోధనలను నిర్వహిస్తారు. ఇది ప్రపంచ శాస్త్ర రంగానికి దాని లోతైన ప్రాముఖ్యతను నొక్కి చెబుతుంది. భవిష్యత్ మానవ అన్వేషణకు, మన భూమిని అర్థం చేసుకోవడానికి కీలకమైన వివిధ రంగాలలో ఈ పరిశోధనలు దోహదపడతాయి. కాగా, మన దేశానికి, శుక్లా భాగస్వామ్యం ఒక ప్రత్యేక శాస్త్రీయ దృష్టిని తీసుకువస్తుంది. అతను ప్రత్యేకంగా ఆహారం, పోషకాల సంబంధిత ప్రయోగాలను నిర్వహిస్తాడు. ఇవి ఇస్రో డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ మధ్య ఒక మార్గదర్శక సహకారంతో అభివృద్ధి చేయబడ్డాయి. దీనికి నాసా నుండి ప్రత్యక్ష మద్దతు ఉంటుంది. ఈ అద్భుతమైన అధ్యయనాలు అంతరిక్ష పోషణను అభివృద్ధి చేయడం, భవిష్యత్ దీర్ఘకాల అంతరిక్ష మిషన్లకు, చంద్రుడు, అంగారక గ్రహయాత్రలతో సహా, అవసరమైన స్వీయనిలకడగల జీవనోపాధి వ్యవస్థలను అభివృద్ధి చేయడం లక్ష్యంగా పెట్టుకున్నాయి. మైక్రోగ్రావిటీలో మెంతి, పెసర వంటి మన భారతీయ ప్రధాన ఆహార ధాన్యాలను విజయవంతంగా మొలకెత్తించడం వంటి వినూత్న ఆలోచనలను ఆసక్తి రేపుతున్నాయి. ఇది స్థిరమైన అంతరిక్ష ఆహారాలకు ఒక గొప్ప ముందడుగు. శుక్లా నాసా మానవ పరిశోధన కార్యక్రమం కోసం ప్రణాళిక చేయబడిన ఐదు ఉమ్మడి అధ్యయనాలకు కూడా గణనీయంగా సహకరిస్తాడు. మన భారతీయ శాస్త్రీయ ప్రయత్నాలను విస్తృత అంతర్జాతీయ కార్యక్రమాలలో మరింత సమగ్రంగా అనుసంధానిస్తాడు. భారత దేశ నాయకత్వంలోని ప్రాజెక్టులతో పాటు, యాత్ర విస్తృతమైన శాస్త్రీయ అధ్యయనాలలో ఇవి ఉన్నాయి:



**మానవ పరిశోధనలు..**

సూక్ష్మ గురుత్వాకర్షణలో కంప్యూటర్ స్క్రీన్‌ల శారీరక, మానసిక ప్రభావాలపై లోతైన పరిశోధనలు... మెదడుపై సూక్ష్మ గురుత్వాకర్షణ ప్రభావం, కీళ్ళు, రక్త ప్రవాహం, రోగనిరోధక వ్యవస్థపై అంతరిక్ష ప్రయాణం ప్రభావం... మానవ అనుకూలతపై సమగ్ర డేటా సేకరణ. ఇన్సులిన్ ఆధారిత డయాబెటిస్‌తో బాధపడుతున్న వ్యోమగాములకు అంతరిక్షంలో మద్దతు ఇవ్వడం, మెదడుకు రక్త ప్రవాహం ఎలా అనుకూలంగా ఉంటుందో అర్థం చేసుకోవడం వంటి కీలక ప్రశ్నలు కూడా పరిష్కరించబడతాయి.

**జీవ, జీవశాస్త్ర విజ్ఞానాలు...**

సూక్ష్మ గురుత్వాకర్షణలో మైక్రోఅల్గే, సైనోబాక్టీరియా జాతుల పెరుగుదల, జీవక్రియ, జన్యుశాస్త్రాన్ని లోతుగా అధ్యయనం చేయడం; రేడియేషన్ వల్ల డీఎన్ఏ దెబ్బతినడాన్ని పండ్ల ఈగలు ఎలా ఎదుర్కొంటాయో పరిశోధించడం. అంతరిక్షంలో మొక్కలు మొలకెత్తడం, మైక్రోగ్రీన్ ఉత్పత్తి, ఆకు అభివృద్ధిపై అధ్యయనాలు భవిష్యత్ అంతరిక్ష నివాసాల రూపకల్పనకు నేరుగా ఉపయోగపడతాయి.

**పదార్థ విజ్ఞానం, భూమి పరిశీలన...**

అధునాతన పదార్థ విజ్ఞానంలో ప్రయోగాలు.. మన గ్రహం ఆరోగ్యాన్ని పర్యవేక్షించడానికి కీలకమైన భూమి పరిశీలన కార్యకలాపాలు... భవిష్యత్ మిషన్ల కోసం వ్యోమగాముల వస్త్రాల ఉష్ణ బదిలీ, సౌకర్యాన్ని మెరుగుపరచడానికి అనుకరణలను ధృవీకరించడం.

**అంతరిక్ష భవిష్యత్తుకు మార్గదర్శనం – మనందరి బాధ్యత!**

ఆక్సియమ్ మిషన్ 4 కేవలం ఒక చిన్న అంతరిక్ష ప్రయాణం కాదు. ఇది మొదటి వాణిజ్య అంతరిక్ష కేంద్రాన్ని స్థాపించడానికి ఆక్సియమ్ స్పేస్ మొత్తం లక్ష్యంలో ఒక ముఖ్యమైన భాగం. ఐఎస్‌ఎస్‌కు ప్రైవేటు మిషన్ల సాధ్యత, భద్రత, అపారమైన శాస్త్రీ య విలువను నిరంతరం ప్రదర్శించడం ద్వారా, ఎఎక్స్4 వాణిజ్య కక్ష్య వేదికలు అంతర్జాతీయ వ్యాపారం, అత్యాధునిక పరిశోధన, సహకార మానవ అన్వేషణకు బలమైన కేంద్రాలుగా మారగలవని బలపరుస్తుంది. మన భారతదేశానికి, ఈ యాత్ర దాని అంతరిక్ష సామర్థ్యాలను మెరుగుపరచడమే కాకుండా భవిష్యత్ వాణిజ్య భాగస్వామ్యాలకు, ప్రపంచ అంతరిక్ష ఆర్థిక వ్యవస్థలో ఎక్కువ భాగస్వామ్యానికి తలుపులు తెరుస్తుంది. ఈ మార్గదర్శక యాత్ర అంతరిక్షానికి ప్రాప్యత విస్తరించబడిన భవిష్యత్తు వైపు ఒక ధైర్యమైన అడుగు వేస్తుంది. తద్వారా మానవాళి అందరి ప్రయోజనం కోసం అపూర్వమైన శాస్త్రీయ ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది. ఎఎక్స్4లో మన భారతదేశ అంతర్భాగ పాత్ర అంతరిక్షాన్ని అన్వేషించడానికి దాని నిబద్ధతను నొక్కి చెబుతుంది. ఇది కేవలం జాతీయ ప్రయత్నం మాత్రమే కాదు, భూమికి మించి మానవాళి సామూహిక ప్రయాణానికి ఒక కీలకమైన సహకారి కూడా. ఈ అద్భుతమైన ప్రయాణం విజయవంతం అవ్వాలని కోరుకుందాం.


– జనక మోహన రావు దుంగ, 8247045230

# న్యాయవ్యవస్థపై నమ్మకమెట్లా కుదిరేది?

లేఖ

గత మార్చి నెలలో ఢిల్లీ న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అధికార నివాసంలో భారీ స్థాయిలో కాలిపోయిన నోట్ల కట్టల ఉదంతం దేశవ్యాప్తంగా కలకలం రేపింది. ఆ దృశ్యాలన్నీ ప్రముఖ టీవీ ఛానళ్లలో ప్రసారమవ్వడమే కాకుండా అన్ని పత్రికలు పతాక శీర్షికన ఆ వార్తను ప్రచురించడంతో న్యాయవ్యవస్థ విశ్వసనీయతపై నీలి నీడలు కమ్ముకున్నాయని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. అంతే కాక అపనమ్మకం కలిగించే ఇలాంటి సంఘటనల గురించి ప్రజలు పలు విధాలుగా చర్చించుకునేందుకు తావివ్వడంతో పాటు ఇలాంటి సంఘటనలు అన్ని వ్యవస్థల్ని అసంతృప్తికి గురిచేస్తాయని వారు వాపోతున్నారు. సగటు పౌరుని అనుమానాన్ని నివృత్తి చేయడం ద్వారా న్యాయవ్యవస్థపై నమ్మకాన్ని కలిగించేందుకు కేంద్రం దిద్దుబాటు చర్యలకు పూనుకుంటోంది. దానికోసం వడివడిగా అడుగులు వేస్తోంది. అందుబాటులో ఉన్న అన్ని అస్త్రాలను సంధించి జస్టిస్ వర్మను సాగనంపడానికి సిద్ధపడుతోంది. జస్టిస్ వర్మ ఇంట్లోకి ఆ నోట్లకట్టలు ఎలా వచ్చాయి? ఎవరిచ్చారు? అనే దానిపై విచారణ చేపట్టడానికి కోర్టులు అనుమతించలేదు. ఎఫ్ఐఆర్ చేయడానికి కూడా అవకాశం ఇవ్వలేదు. సుప్రీంకోర్టు ఎలాంటి బహిరంగ ప్రకటన చేయనప్పటికీ సుప్రీంకోర్టుయే చొరవ తీసుకుని ఇన్ హౌస్ కమిటీని వేసి విచారణ చేపట్టి నివేదిక ఇచ్చినట్లు సమాచారం. వర్మకు కీలక సూచనలు ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. సుప్రీంకోర్టు జస్టిస్ వర్మను ఢిల్లీ నుండి అలహాబాద్ కోర్టుకు బదిలీ చేసింది. ఆయన అలహాబాద్‌కు వస్తే బహిష్కరిస్తామని అక్కడి బార్ కౌన్సిల్ ప్రకటన చేసిన నేపథ్యంలో ఆయన రావడం రిపోర్టు చేయడం జరిగిపోయినప్పటికీ కేసులు అసైన్ చేయలేదు. అలా చేయడం న్యాయవ్యవస్థపై ప్రజల మనసులలో తొలుస్తున్న అనుమానాలకు సమాధానం కాదని పలువురు న్యాయకోవిదులు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తున్నారు. ఇదే అంశంపై ఉపరాష్ట్రపతి జగదీప్ దన్ ఖడ్ కూడా రెండోసారి వ్యాఖ్యానించడం ఈ సంఘటన ఎంత ప్రాధాన్యతను సంతరించుకున్నదో అవగతం అవుతున్నది. వ్యవస్థలను ప్రజలకు జవాబుదారీగా ఉంచాలనే ఉద్దేశంతోనే అభిశంసన తీర్మానము అనేది రాజ్యాంగంలో ప్రవేశపెట్టబడింది. ఈ అభిశంసన అనేది హైకోర్టు, సుప్రీంకోర్టు న్యాయమూర్తుల పారదర్శకతపై అనుమానాలు, విమర్శలు, ఆరోపణలు తలెత్తినప్పుడు వారిని తొలగించేందుకు చేపట్టే ప్రక్రియ. ఇది చట్టపరంగా పార్లమెంటుకు ఉన్న ప్రత్యేకమైన వెసులుబాటు. ఈ ప్రక్రియను జడ్జెస్ ఎంక్వయిరీ యాక్ట్ 1968 ద్వారా చేపడతారు. లోక్‌సభలో అయితే కనీసం 100మంది, రాజ్యసభ అయితే 50 మంది సభ్యులు ఈ తీర్మానం మీద సంతకం చేయాలి. రాజ్యసభ చైర్మన్ లేదా లోక్ సభ స్పీకర్ చేత నియమించబడ్డ విచారణ కమిటీ ద్వారా నివేదిక ఇవ్వబడుతుంది. ఆ నివేదిక ద్వారా న్యాయమూర్తి దోషిగా తేలితే దానిని పార్లమెంటు ఉభయ సభలలో ప్రవేశపెట్టబడి మూడింట రెండో వంతు మెజారిటీతో ఆమోదించబడితే రాష్ట్రపతి సదరు న్యాయమూర్తిని తొలగిస్తారు. ఇప్పుడు ఉన్న పరిస్థితులలో ఆ మెజారిటీ సాధించడం అధికార పక్షానికి పెద్ద కష్టమేమీ కాదని రాజకీయ పండితులు అంచనా వేస్తున్నారు. విపక్షాలపై ఆధారపడకుండానే అభిశంసన ప్రక్రియను పూర్తి చేసే అవకాశం ఉన్నప్పటికీ వర్మ తీరును విపక్షాలు సైతం తప్పు పడుతుండడంతో అభిశంసనకు మరింత బలం చేకూరడం తథ్యమని విమర్శకులు సైతం విశ్లేషిస్తున్నారు. యశ్వంత్ వర్మ కేసు విషయంలో సుప్రీంకోర్టు నియమించిన ఇన్ హౌస్ కమిటీ నివేదికలో భారీ మొత్తంలో కాలిపోయిన నోట్ల కట్టల ఆధారాన్ని బలంగా పేర్కొనడంతో అభిశంసనకు మరింత మద్దతు పెరగడం ఖాయమని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా ఇప్పటివరకు అభిశంసన ప్రక్రియలు చాలా అరుదుగానే జరిగాయి. 1991లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ వి రామస్వామిపై ఆర్థిక అవకతవకల ఆరోపణలతో లోక్ సభలో 108 మంది సభ్యులచే అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టబడినప్పటికీ కాంగ్రెసు గైర్హాజరు కావడంతో ఈ తీర్మానం వీగిపోయింది. ఆయన పూర్తి కాలం కొనసాగినప్పటికీ ఆయనకు కేసులు మాత్రం అసైన్ చేయలేదు. ఇక 2011లో కలకత్తా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సౌమిత్రా సేన్ పై ఆర్థిక అవకతవకలపై రాజ్యసభలో తీర్మానం ప్రవేశపెట్టబడి ఆమోదించబడింది. లోక్ సభలో ఓటింగ్‌కు ముందే ఆయన రాజీనామా చేయడంతో ఆ వివాదం అంతటితో ముగిసిపోయింది. 2017లో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సివి నాగార్జున్ రెడ్డిపై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టబడినప్పటికీ కొంతమంది ఎంపీలు తమ సంతకాలను ఉపసంహరించడంతో అది కూడా వీగిపోయింది. 2018లో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ దీపక్ మిశ్రాపై రాజ్యసభలో విపక్షాలన్నీ ఏకమై రాజకీయపరమైన అభిప్రాయాలతో అభిశంసన తీర్మానాన్ని ప్రవేశపెట్టినప్పటికీ రాజ్యసభ చైర్మన్ దాన్ని ప్రాథమిక దశలోని తిరస్కరించడంతో తీర్మానం ముందుకు పోలేదు. ఇలా వెలుగులోకి వచ్చిన సంఘటనలు కొన్ని మాత్రమేనని చీకట్లో ఇంకా ఎన్ని ఉన్నాయోనని ప్రజాస్వామికవాదులు గుసగుసలాడుకుంటున్నారు. రాజ్యాంగ పరమైన అంశాలపై ఇటీవల దాఖలైన పలు పిటిషన్లను నామమాత్రమైనా పరిశీలించకుండానే ఆదిలోనే కొట్టివేయడాన్ని ఈ సందర్భంగా ఉటంకిస్తున్నారు. ప్రజాభిప్రాయానికి ప్రతిబింబంగా నిలిచే పార్లమెంటును సైతం న్యాయమూర్తుల నియామకంలో భాగస్వామ్యం చేయకపోవడమేంటని వారు ప్రశ్నిస్తున్నారు. మరో పక్క స్వయం ప్రతిపత్తి అనే పేరున న్యాయవ్యవస్థలో న్యాయమూర్తుల నియామకాన్ని న్యాయమూర్తులే చేపట్టడం వల్ల పారదర్శకత లోపిస్తున్నదని, జవాబుదారితనం అడుగంటుతుండడమేకాక 'అంకుల్ జడ్జ్ సిండ్రోమ్'వల్ల తమ అనుయాయులకే పెద్దపీట వేసే అవకాశం ఉన్నదని న్యాయ కోవిదులు అభిప్రాయపడుతున్నారు. దీన్ని అధిగమించడానికి 99వ రాజ్యాంగ సవరణ ద్వారా తీసుకువచ్చిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ తరహాలో సరికొత్త కమిషన్‌ను ఏర్పాటు చేయవలసిన ఆవశ్యకత ఉన్నదని రాజ్యాంగ నిపుణులు సైతం కోరుతున్నారు.

– భాస్కర్ యలకంటి
8919464488



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## గుజరాత్ హైకోర్టుకు బాంబు బెదిరింపు



**అహ్మదాబాద్:** గుజరాత్ హైకోర్టులో బాంబు పెట్టామంటూ ఈ మెయిల్ ద్వారా సంబంధిత అధికారులకు బెదిరింపు మెయిల్ వచ్చింది. దాంతో అహ్మదాబాద్ పోలీసులు అప్రమత్తమయ్యారు. బాంబ్ స్క్వాడ్‌తో హైకోర్టుకు చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో ఎలాంటి బాంబులు కనిపించకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టినట్లు అహ్మదాబాద్ డిప్యూటీ కమిషనర్ సఫిన్ హసన్ తెలిపారు. బెదిరింపు మెయిల్ పంపిన దుండగుడిని గుర్తించేందుకు దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ మధ్య కాలంలో ఎయిర్‌పోర్టులు, రైల్వే స్టేషన్‌లు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టులు ఇలా అన్నింటికి బాంబు బెదిరింపులు వస్తున్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్‌ల ద్వారా, ఈ మెయిల్‌ల ద్వారా ఇలాంటి బెదిరింపు సందేశాలు పంపుతున్నారు. తాజాగా గుజరాత్ హైకోర్టుకు ఇలాంటి బెదిరింపు మెయిల్ వచ్చింది.

## విచారణకు మనీశ్ సిసోదియా గైర్హాజరు



**న్యూఢిల్లీ:** అవినీతి కేసు విచారణకు ఢిల్లీ మాజీ డిప్యూటీ సిఎం మనీశ్ సిసోదియా సోమవారం గైర్హాజరయ్యారు. ఈ విషయాన్ని ఎసిబి అధికార వర్గాలు వెల్లడించాయి. ఢిల్లీలో పాఠశాల భవనాలు, తరగతి గదుల నిర్మాణాల్లో రూ. రెండు వేల కోట్ల అవినీతికి పాల్పడ్డారంటూ ఆప్ ప్రభుత్వంలో మంత్రులుగా పనిచేసిన మనీశ్ సిసోదియా, సత్యేందర్ జైన్‌లపై కేసులు నమోదయ్యాయి. ఈ కేసు విచారణ నిమిత్తం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) వారికి సమన్లు జారీ చేసింది. ఈ కేసులో సిసోదియా అవినీతి నిరో ధకశాఖ ఎదుట హాజరవ్వాల్సి ఉండగా... సిసో దియా విచారణకు రాలేరని ఆయన తరపున న్యాయవాది తెలిపినట్లు ఏసీబీ వర్గాలు పేర్కొ న్నాయి. మళ్లీ సమన్లు జారీ చేస్తామని ఎసిబి అధి కారులు వెల్లడించారు. ఈ కేసులో మనీశ్ సిసోదియాతో పాటు సత్యేందర్ జైన్‌ను కూడా ఏసీబీ విచారణకు పిలిచింది. శుక్రవారం జరిగిన విచారణకు ఆయన హాజరయ్యారు. అక్రమంగా ఆర్కి టెక్ట్‌లను నియమించిన అంశంపై ఆయన సమాధానాలు ఇవ్వలేదన్నారు. జైన్‌ను మళ్లీ విచారణకు పిలిచే అవకాశం ఉందని తెలిపారు.

## మణిపూర్‌లో భద్రతా బలగాల సెర్చ్ ఆపరేషన్

**ఇంఫాల్:** మణిపూర్‌లో భద్రతా బలగాలు కీలక సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. భారత సైన్యం, అస్సాంరైఫిల్స్ కలిసి కొండ, లోయ ప్రాంత జిల్లాల్లో సెర్చ్ ఆపరేషన్ నిర్వహించాయి. కాంగ్‌పోక్పి, తౌబల్, కక్చింగ్, తెంగ్నౌపాల్, బిష్ణుపూర్, జిరిబామ్, ఇంఫాల్ ఈస్ట్, ఇంఫాల్ వెస్ట్ తదితర ప్రాంతాల్లో సోదాలు నిర్వహించామని, ఈప్రత్యేక ఆపరేషన్ మే 26 నుంచి జూన్ 5 వరకు చేట్టామన్నారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా 40 ఆయుధాలు, తొమ్మిది ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజెస్, గ్రెనేడ్లు, మందుగుండు సామగ్రి, యుద్ధ సామగ్రి దుకాణాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఇంఫాల్ తూర్పు జిల్లాలోని చాడోంగ్ సాధారణ ప్రాంతంలో క్యాడర్ల కదలిక, ఐఈడీల ఉనికిపై నిర్దిష్ట నిఘా సమాచారం ఆయా స్థావరాలపై దాడులు చేశామని అధికారులు పేర్కొన్నారు.

# ఆర్‌ఎస్‌ఎస్ నుంచి దేశభక్తిని సిపిఐ నేర్చుకోవాలా?

కేరళ గవర్నర్ ధోరణిపై సిపిఐ ప్రధానకార్యదర్శి డి.రాజా ధ్వజం

అసలు మీ భారతమాత ఎవరో స్పష్టం చేయండని గవర్నర్‌పై ప్రశ్నల బాణాలు

వలసపాలన నుంచి ఈ దేశానికి స్వాతంత్ర్యం కోసం గొప్ప త్యాగాలు చేసింది సిపిఐ...ఆర్‌ఎస్‌ఎస్ చేసిందేమిటి ?



**న్యూఢిల్లీ:** ముఖ్యమైన రాజ్యాంగపదవిలో ఉన్న కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల విధానాలను అనుసరించడంపట్ల భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) నిప్పులుచెరిగింది. గవర్నర్ తన భారతమాత ఎవరో స్పష్టం చేయాలని సోమవారం సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా గట్టిగా ప్రశ్నించారు. దేశభక్తి అనేది రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) నుంచి నేర్చుకోవాల్సిన అవసరం తమ పార్టీకి ఎంతమాత్రం లేదని సిపిఐ అగ్రనేత డి.రాజా తేల్చిచెప్పారు. ఇటీవల తిరువనంతపురంలోని రాజ్‌భవన్‌లో జరిగిన ప్రపంచ పర్యావరణ దినోత్సవ కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ శాఖలతో సంబంధం కలిగిఉందని ఆరోపించబడిన భారతమాత చిత్రపటాన్ని కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఉపయోగించడం ఈ వివాదానికి దారితీసింది. ఆ కార్యక్రమంలో గవర్నర్ ధోరణిని నిరసిస్తూ కేరళ మంత్రి, కమ్యూనిస్టుపార్టీ నాయకుడైన పి.ప్రసాద్ ఆ కార్యక్రమాన్ని బహిష్కరించారు. ఈ ఘటన తీవ్ర రాజకీయదుమారం తలెత్తడానికి కారణమయ్యింది. కేరళలోని అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎల్‌డిఎఫ్)లో సిపిఐ రెండవ అతిపెద్ద పార్టీగా ఉంది. 'కేరళ గవర్నర్ భారతమాత గురించి, మూడు రంగుల గురించి ఏమి అర్థం చేసుకున్నారో నాకు తెలియదు. నేను ఈ అంశాన్ని పార్లమెంట్‌లో చాలా గట్టిగానే లేవనెత్తాను. మీ భారతమాత ఎవరు? దయచేసి మాకు చెప్పండి' అని మాజీ రాజ్యసభ ఎంపి, సిపిఐ అగ్రనేత డి.రాజా ప్రశ్నిస్తూ 'పిటిఐ'తో మాట్లాడారు. 'మన భారతమాత వ్యవసాయ క్షేత్రంలో పనిచేస్తోంది. మన భారతమాత అడవుల్లో పనిచేస్తోంది. జల్‌జమీన్‌జంగిల్‌కు సురక్షిత కాపలాదారుగా ఉంటోంది. మన భారతమాత పాఠశాలల్లో, కార్యాలయాల్లో, కర్మాగారాల్లో పనిచేస్తోంది. మన భారతమాత ఆర్మీని, రక్షణబలగాలలో పనిచేస్తోంది. మీ భారతమాత ఎవరు? మీ భారతమాత ఎవరనేది స్పష్టంగా తెలియడం లేదు' అని డి.రాజా అన్నారు. 'వారు (బిజెపిఆర్‌ఎస్ ఎస్) త్రివర్ణపతాకానికి తామే యజమానులమని భావిస్తున్నారు. వారు ఎప్పుడూ దేశస్వాతంత్ర్యం కోసం పనిచేసిన దాఖలాలే లేవు. వలసపాలన నుండి ఈ దేశానికి స్వాతంత్ర్యం కోసం సిపిఐ పోరాటం చేసింది. అనేక గొప్ప త్యాగాలను చేసింది. ఆర్‌ఎస్‌ఎస్ ఏమి చేసింది?' అని డి.రాజా ప్రశ్నల అస్త్రాలను సంధించారు. సిపిఐ ప్రారంభమైన సంవత్సరంలోనే ఆర్‌ఎస్‌ఎస్ కూడా స్థాపించబడిందని, అయితే స్వాతంత్ర్యం కోసం ఆర్‌ఎస్‌ఎస్ నిర్వర్తించిన పాత్ర ఏమిటో చెప్పాలని డి.రాజా గట్టిగా ప్రశ్నించారు. 'స్వాతంత్ర్య ఉద్యమంలో ఆర్‌ఎస్‌ఎస్ పాత్ర ఏమిటో చెప్పాలి? భారతమాతను ఆర్‌ఎస్‌ఎస్సే నిర్వచించిందనివారు అనుకుంటున్నారు. అంతేకాకుండా గవర్నర్ల రాజ్‌భవన్లు ఆర్‌ఎస్‌ఎస్ భవనాలు' అని కూడా వారు అనుకుంటున్నారేమో' అని డి.రాజా కేరళ గవర్నర్ అర్లేకర్ అనుసరిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ అనుకూల భావజాలాన్ని తూర్పారబట్టారు. వారు మన జాతీయతను, దేశభక్తిని ప్రశ్నిస్తున్నారు.'కమ్యూనిస్టులు బిజెపి ఆర్‌ఎస్‌ఎస్ నుంచి జాతీయవాదం లేదా దేశభక్తిని నేర్చుకుంటున్న చివరి వ్యక్తులు అనుకుంటున్నారేమో. గవర్నర్‌కు భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామం గురించి ఏమీ తెలియదు. భారత కమ్యూనిస్టుపార్టీ చేసిన త్యాగం ఏమిట నేది కూడా అసలు ఏమీ తెలియదు' అని డి.రాజా మండిపడ్డారు. రాజ్‌భవన్‌లో జరిగిన పర్యావరణదినోత్సవంనాడు భారతమాత చిత్రపటాన్ని ఉపయోగించాలని రాజ్‌భవన్ నిర్ణయించడంతో ఈ వివాదం తలెత్తింది. ఆ కార్యక్రమంలో పాల్గొన్న కేరళ వ్యవసాయ శాఖమంత్రి, సిపిఐ నేత కూడా అయిన పి.ప్రసాద్ ఆ కార్యక్రమాన్ని అక్కడికక్కడే బహిష్కరించి, అక్కడ నుంచి నిష్క్రమించారు. ఆ చిత్రపటాన్ని ఆర్‌ఎస్‌ఎస్ ఉపయోగించిందని, రాజ్యాంగం లేదా భారత ప్రభుత్వం ఆ చిత్రపటాన్ని అధికారిక వెర్షన్‌గా ఆమోదించ లేదని ఆయన చెప్పారు. వ్యవసాయశాఖ మంత్రి ప్రసాద్ ఆ కార్యక్రమాన్ని బాయ్‌కాట్ చేసిన తర్వాత కేరళగవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఒక ప్రకటన విడుదల చేశారు. ఏవర్గాల నుంచి ఒత్తిడి వచ్చినా భారతమాతపై ఎటువంటి రాజీఉండదన్నారు. ఆతర్వాత సిపిఐ విడుదల చేసిన ఒక ప్రకటనలో గవర్నర్ ధోరణిని నిరసిస్తూ శనివారంనాడు తన అన్నిశాఖలలో భారతమాత చిహ్నంగా జాతీయపతాకాన్ని ఎగురవేస్తామని, అలాగే మొక్కలు నాటుతామని ప్రకటించారు.

## కర్ణాటక హైకోర్టుకు ఆర్సీబీ

**బెంగళూరు:** ఇటీవల చిన్నస్వామి స్టేడియం వెలుపల తొక్కిసలాటకు సంబంధించి తమపాత్ర ఏమీ లేదని కర్ణాటక హైకోర్టుకు ఆర్‌సీఎస్‌ఎల్ తెలిపింది. విజయోత్సవాలకు పరిమితంగానే పాస్‌లు ఉన్నాయని, ఉచిత రిజిస్ట్రేషన్ పాసుల కోసం ముందుగానే రిజిస్టర్ చేసుకోవాల్సి ఉంటుందని సోషల్ మీడియా ద్వారా తాము చాలా స్పష్టమైన ప్రకటనలు చేసినట్లు పేర్కొంది. చిన్నస్వామి స్టేడియం వెలుపల జూన్ 4న జరిగిన తొక్కిసలాట ఘటనపై ఐపీఎల్ టీమ్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఓనర్ రాయల్ ఛాలెంజర్స్ స్పోర్ట్స్ లిమిటెడ్(ఆర్‌సీఎస్‌ఎల్), ఈవెంట్ ఆర్గనైజర్ డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్స్ ప్రైవేట్ లిమిటెడ్‌లు కర్నాటక హైకోర్టును సోమవారం నాడు ఆశ్రయించాయి.

తమపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేయాలని కోరాయి. తొక్కిసలాటకు దారితీసిన క్రౌడ్ మేనేజ్మెంట్‌లో తమ పాత్ర ఏమీ లేదని ఆర్‌సీఎస్‌ఎల్ తమ పిటిషన్‌లో పేర్కొంది. స్టేడియం గేట్లు తెరవడంలో ఆలస్యం జరిగిందనీ ఆరోపించింది. షెడ్యూల్ ప్రకారం 1:45 గంటలకు గేట్లు తెరవాల్సి ఉండగా.. 3.00 గంటలకు తెరిచారని, దీంతో ఒక్కసారిగా జనం అక్కడకు చేరుకున్నారని తెలిపింది.

**పోలీసుల వైఫల్యమే..**

డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ మరో పిటిషన్‌లో పోలీసులు, రాష్ట్ర అధికారుల వైఫల్యమే తొక్కిసలాటకు కారణమని ఆరోపించింది. 3లక్షల మందికి పైగా ప్రజలు వచ్చినప్పుడు వారిని కంట్రోల్ చేయడంలో పోలీసులు, రాష్ట్ర అధికారులు విఫలమయ్యారని పేర్కొంది. తగినన్ని పోలీసు బలగాలను మోహరించకపోవడం, లాఠీచార్జ్ జరపడంతో ఈవెంట్‌కు హాజరయ్యేందుకు వచ్చిన వారు ఆందోళనకు గురయ్యారని, దీంతో స్టేడియం వెలుపల రోడ్లు, ఫుట్‌పాత్‌లపై తొక్కిసలాట జరిగిందని వివరించింది. ఎక్కువ మంది పోలీసులను విధానసభ వద్దే మోహరించి, స్టేడియం వద్ద తగినంత సిబ్బంది లేకుండా చేసినట్లు కూడా ఆరోపించింది. క్రమశిక్షణా చర్య నుంచి తప్పించుకునేందుకు కుబ్బన్ పార్క్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ సుమోటో ఫిర్యాదు చేసినట్లు డీఎన్‌ఏ ఎంటర్‌టైన్‌మెంట్ నెట్‌వర్క్ ఆరోపించింది. రాజకీయ ఒత్తిళ్ల కారణంగా హడావిడిగా పక్షపాత వైఖరితో తమపై ఎఫ్‌ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపింది. జూన్ 6వ తేదీ ఉదయం ఎలాంటి విచారణ లేకుండానే కంపెనీకి చెందిన ఇద్దరు అధికారులను అరెస్టు చేసినట్టు పేర్కొంది. నేరుగా తమ తప్పిదం ఉన్నట్టు ఎలాంటి సాక్ష్యాలూ లేనందున తమపై నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌లను కొట్టివేయాలని ఆర్‌సీఎస్‌ఎల్, డీఎన్‌ఏలు తమ పిటిషన్లలో హైకోర్టును కోరాయి.

## మోదీ ప్రభుత్వానికి సున్నా మార్కులు

కర్నాటక సిఎం సిద్ధరామయ్య



**మైసూర్:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వంపై కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సోమవారం తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ ప్రభుత్వానికి తాను 'సున్నా మార్కులు' ఇస్తానన్నారు. కేవలం 'ప్రచారం'పై మాత్రమే మనుగడ సాగించిందని ఆరోపించారు. సిద్ధరామయ్య మైసూర్‌లో విలేకరులతో మాట్లాడారు. ప్రధాని మోడీ అధికారంలోకి వచ్చి 11 సంవత్సరాలు అయింది, కానీ తన ప్రభుత్వం ప్రచారంపై మాత్రమే ఆధారపడి ఉందని, ప్రచారంపైనే మనుగడ సాగిస్తోందని అన్నారు. 'నోట్ల రద్దు వల్ల ఎవరు లాభపడ్డారు? ఆయన (మోడీ) 'అచ్చేదిన్ ఆయేగా' (మంచి రోజులు వస్తాయి) అని అన్నారు, ఏం జరిగింది? ప్రతి సంవత్సరం రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తానని ఆయన హామీ ఇచ్చారు? దానికి ఏమైంది? రైతుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు, దానికి ఏమైంది? రైతులు తమ సమస్యలను పరిష్కరిస్తే ఒక సంవత్సరం పాటు ఎందుకు నిరసన తెలిపారు?' అని ఆయన ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం హామీలను నెరవేర్చనందుకు సిద్ధరామయ్య తీవ్రంగా విమర్శించారు. మోదీ ప్రభుత్వం ఇచ్చిన హామీలలో చాలావరకు నెరవేరలేదన్నారు. మోడీ ప్రభుత్వం 'తప్పుడు ప్రచారం సృష్టిస్తోంది' అని ఆరోపిస్తూ, మీడియా ఆయనకు అధిక ప్రచారం ఇస్తుందని, తమ ప్రభుత్వం హామీ పథకాలను ప్రకటించినప్పుడు, వారు (బిజెపి) వాటిని అమలు చేయలేమని, రాష్ట్ర ప్రభుత్వం దివాళా తీస్తుందని ప్రచారం చేస్తున్నారు, కానీ అదే పథకాలను వారు కాపీచేసి రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీలో అమలు చేశారు మండిపడ్డారు. మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు, పన్నుల 50 శాతం వికేంద్రీకరణను డిమాండ్ చేశారని సిద్ధరామయ్య గుర్తు చేసుకున్నారు. 'కానీ ఆయన ప్రధానమంత్రి అయిన తర్వాత ఏమి చేశారని ప్రశ్నిస్తూ... మీరు (మీడియా) వాటన్నింటినీ ఎత్తి చూపలేదన్నారు. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ రూ. 5,300 కోట్లు ఇస్తానని హామీ ఇచ్చారు, మరి ఇచ్చారా? అని ప్రశ్నించారు. 15వ వేతన సంఘం రాష్ట్రానికి రూ. 11,495 కోట్లు సిఫార్సు చేసింది, ఇచ్చారా? ఇది పెద్ద విషయం కాదా?' అని ఆయన ప్రశ్నించారు. కర్ణాటకకు న్యాయం చేయాలని అడిగితే, మౌనంగా ఉంటారు, బదులుగా తప్పుడు ప్రచారం చేస్తారని మండిపడ్డారు.

## ఓటర్ల జాబితా ఎప్పుడిస్తారు: రాహుల్

**న్యూఢిల్లీ :** హర్యానా, మహారాష్ట్ర ఎన్నికల జాబితా వివరాలను కచ్చితంగా ఏతేదీ లోగా డిజిటల్, కంప్యూటర్‌లో చదివే నమూనాలో ఇస్తారని ఎన్నికల కమిషన్‌ను ప్రతిపక్ష నాయకులు రాహుల్ గాంధీ ప్రశ్నించారు. ఈ జాబితాలను అందజేస్తామని ఎన్నికల కమిషన్ నిర్ణయించడాన్ని మొదటి మంచి అడుగు అని ఆయన స్వాగతించారు. హర్యానా, మహారాష్ట్రలకు సంబంధించి 2009 నుంచి 2024 వరకు ఓటర్ల జాబితాలను అందజేస్తామని ఎన్నికల కమిషన్ చెప్పినట్లు వచ్చిన వార్తను ఆయన తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్నారు. గత ఏడాది జరిగిన మహారాష్ట్ర ఎన్నికల్లో రిగ్గింగ్ జరిగిందని ఇటీవల రాహుల్ గాంధీ రాసిన ఆర్టికల్ పత్రికల్లో ప్రచురితమైంది. దానిపై ఎన్నికల సంఘం వర్గాల పేరుతో స్పందన వచ్చింది.

## కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు తహవ్వూర్ రాణాకు కోర్టు అనుమతి



**న్యూఢిల్లీ :** ముంబయి ఉగ్రదాడి కేసులో అరెస్టై ఎన్‌ఐఎ కస్టడీలో ఉన్న తహవ్వుర్ హుస్సేన్ రాణా తన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. జైలు నిబంధనలకు అనుగుణంగా, తీహార్ జైలు సీనియర్ అధికారి పర్యవేక్షణలో రాణా తన కుటుంబ సభ్యులతో ఫోన్‌లో మాట్లాడొచ్చని ఢిల్లీలోని పాటియాలా హౌస్ కోర్టు తెలిపింది. ప్రస్తుతం కస్టడీలో ఉన్న 64 ఏళ్ల తహవ్వూర్ రాణా తన కుటుంబ సభ్యులతో మాట్లాడేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ మే 27న న్యూఢిల్లీలోని కోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కోర్టు అందుకు అనుమతి ఇచ్చింది. జైలు నిబంధనల ప్రకారం.. రాణాకు భవిష్యత్తులో క్రమం తప్పకుండా ఫోన్‌లో మాట్లాడే వెసులుబాటు కల్పించాలా వద్దా అనేదానిపై జైలు అధికారుల నుంచి కోర్టు వివరణాత్మక నివేదికను కోరింది. అంతేకాదు, రాణా ఆరోగ్య సమస్యలపై కూడా నివేదికను పది రోజుల్లో సమర్పించాలని ఆదేశించింది. ముంబయి ఉగ్రదాడి కుట్రదారు డేవిడ్ కోల్‌మాన్ హెడ్లీతో తహవూర్ రాణాకు సన్నిహిత సంబంధాలున్నాయి. ఇద్దరూ కలిసి ఉగ్రదాడికి ప్రణాళిక రచించారు. దాడి అనంతరం అమెరికాకు పారిపోయిన రాణాను ఇటీవలే స్వదేశానికి రప్పించారు. భారత్ అప్పగించవద్దంటూ రాణా దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను అమెరికా సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. దాంతో అతడిని భారత్‌కు అప్పగించారు. కాగా భారత్‌లో అక్రమంగా చొరబడిన 10 ఉగ్రవాదులు 2008 నవంబర్ 26న తమ నరమేథం మొదలుపెట్టారు. రెండు లగ్జరీ హోటళ్లు, రైల్వేస్టేషన్, జెవిస్ సెంటర్ ఇలా నాలుగు వేర్వేరు ప్రాంతాల్లో ఏకంగా 60 గంటలపాటు సాగిన నరమేథంలో 166 మంది ప్రాణాలు కోల్పోయారు. వారిలో పలువురు భద్రతాసిబ్బంది కూడా ఉన్నారు. భద్రతా బలగాల దాడిలో 9 మంది ఉగ్రవాదులు హతమయ్యారు. మరో ఉగ్రవాది కసబ్‌ను ప్రాణాలతో పట్టుకున్నారు. ఆ తర్వాత అతడికి ఉరిశిక్ష విధించారు.

## 163 కేసుల్లో ఎక్స్‌ఎఫ్‌జి కోవిడ్ వేరియంట్ గుర్తింపు

**న్యూఢిల్లీ:** దేశంలో మళ్లీ కోవిడ్ వ్యాప్తి ఆందోళన కలిగిస్తోంది. అయితే తాజాగా 163 కోవిడ్ కేసుల్లో కొత్త వేరియంట్ ఎక్స్‌ఎఫ్‌జీని గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఇండియన్ సార్స్ సీవోవీ2 జీనోమిక్స్ కన్సోర్టియం (ఐఎన్‌ఎస్ ఏసీఓజీ) డేటాఆధారంగా తెలిసింది. ప్రపంచవ్యాప్తంగా ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్ శరవేగంగా వ్యాపిస్తున్నట్లు ఇటీవల ద లాన్సెట్ జర్నల్‌లో ఓ రిపోర్టును ప్రచురించారు. ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్‌లో నాలుగు కీలకమైన స్పైక్ మ్యుటేషన్స్ ఉన్నాయని, దీని వల్లే వేగంగా ఆ వైరస్‌వ్యాప్తి అవుతున్నట్లు చెప్పారు. తొలుత ఈ వేరియంట్ వైరస్‌ను కెనడాలో గుర్తించారు. భారత్‌లో ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్ 163 శ్యాంపిల్లలో గుర్తించినట్లు జీనోమిక్స్ కన్సోర్టియం పేర్కొంది. మహారాష్ట్రలో అత్యధికంగా 89, తమిళనాడులో 16, కేరళలో 15, గుజరాత్‌లో 11, ఏపీ.. మధ్యప్రదేశ్.. బెంగాల్ రాష్ట్రాల్లో ఆరేసి కేసులు నమోదైనట్లు తెలిసింది. మే నెలలోనే 159 శ్యాంపిళ్లలో ఎక్స్‌ఎఫ్‌జీ వేరియంట్‌ను గుర్తించారు. ఇక రెండు శ్యాంపిళ్లను ఏప్రిల్‌లో, రెండు జూన్‌లో పసికట్టారు. ప్రస్తుతం కోవిడ్ యాక్టివ్ కేసుల సంఖ్య ఆరు వేలు దాటింది. గత 48 గంటల్లో 769 కేసులు నమోదయ్యాయని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డేటా తెలిపింది.

## ఉద్యమకారిణి గ్రెటా థున్‌బెర్గ్ అడ్డగింత

**న్యూఢిల్లీ :** సహాయ సామాగ్రితో గాజాకు వెళ్తున్న అంతర్జాతీయ పర్యావరణ ఉద్యమకారిణి గ్రెటా థున్‌బెర్గ్ సహా పలువురు ప్రయాణిస్తున్న పడవను అడ్డుకోవడాన్ని వామపక్షాలు తీవ్రంగా ఖండించాయి. పడవ భద్రంగా గాజాకు వెళ్ళి సహాయ సామాగ్రిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని సిపిఐ(ఎం) ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబి డిమాండ్ చేశారు. మానవత్వ సహాయాన్ని అందించేందుకు వెళ్తున్న వారిని అడ్డుకోవడం అంతర్జాతీయ చట్టాలను తీవ్రంగా ఉల్లంఘించటమేనని సిపిఐ(ఎంఎల్) లిబరేషన్ ఒక ప్రకటనలో విమర్శించింది.

# భార్యే... సూత్రధారి!

పర్యాటకుడు..రాజారఘువంశీని హత్య చేయించి సోనమ్

మేఘాలయ డిజిపి ఐ.నాంగ్‌రాంగ్ వెల్లడి

ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని నంద్‌గంజ్ పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయిన సోనమ్ రఘువంశీ

ఈ కేసులో ఐదుగురు నిందితులు అరెస్ట్




**షిల్లాంగ్ / లక్నో:** భార్యతో హనీమూన్‌కు వెళ్లిన ఇండోర్ పర్యాటకుడు రాజా రఘువంశీ మేఘాలయలో హత్యకు గురైన సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోన్న నేపథ్యంలో హత్య మిస్టరీని మేఘాలయ పోలీసులు ఛేదించారు. ఈ హత్యకేసులో విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. అతడి భార్య సోనమ్ రఘువంశీ నియమించిన వ్యక్తులే రాజా రఘువంశీని హత్యచేసినట్లు మేఘాలయ పోలీసులు నిర్ధారించారు. ఈ దారుణ హత్య పూర్వాపరాలను మేఘాలయ డిజిపి సోమవారం వెల్లడించారు. ఆమె 'పిటిఐ'తో మాట్లాడుతూ భార్య సోనమ్ ఉత్తర్‌ప్రదేశ్‌లోని ఘాజీపూర్‌లో నంద్‌గంజ్ పోలీస్ స్టేషన్‌లో లొంగిపోయిందని, రాత్రిపూట జరిగిన దాడుల్లో ముగ్గురు దుండగులను అరెస్ట్ చేశామని చెప్పారు. అరెస్ట్ అయిన ముగ్గురిలో ఇద్దరు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందినవారని, ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రంలోని లలిత్‌పూర్‌కు చెందిన ఒకరు ఉన్నారని వెల్లడించారు. 'పిటిఐ' వీడియో ప్రకారం ఈస్ట్ ఖాసీ హిల్స్ ఎస్‌పి వివేక్ సయీమ్ మాట్లాడుతూ సోమవారం మధ్యప్రదేశ్‌లోని సాగర్ జిల్లా నుంచి మరొకరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. మే23న మేఘాలయలోని ఖాసీహిల్స్ జిల్లాలోని సోహ్రా ఏరియాలో సెలవులకు వెళుతుండగా రాజా రఘువంశీ, ఆయన భార్య సోనమ్ రఘువంశీ తప్పిపోయారని చెప్పారు. జూన్ 2న రాజా రఘువంశీ మృతదేహం ఒక లోయలో కనిపించిందన్నారు. డిజిపి ఐ.నాంగ్ రాంగ్ మాట్లాడుతూ ఒక వ్యక్తిని ఉత్తర్‌ప్రదేశ్‌లో అరెస్ట్ చేసి తీసుకువచ్చామని, మరో ఇద్దరు నిందితులను సిట్ ఇండోర్‌లో పట్టుబడగా అక్కడ నుంచి తీసుకురావడం జరిగిందని డిజిపి చెప్పారు. సోనమ్ రఘువంశీ ఉత్తర్‌ప్రదేశ్‌లోని నంద్‌గంజ్ పోలీసుల ముందు లొంగిపోయిందని, ఆ తర్వాత ఆమెను అరెస్ట్ చేసినట్లు నాంగ్‌రాంగ్ వివరించారు. రఘువంశీని చంపడానికి ఆయన భార్య సోనమ్ తమను ప్రేరేపించిందని అరెస్ట్ అయిన నిందితులు పోలీసులకు వెల్లడించినట్లు డిజిపి నాంగ్‌రాంగ్ చెప్పారు. తూర్పు ఖాసీ హిల్స్ ఎస్‌పి 'పిటిఐ' వీడియోకు వెల్లడించిన ప్రకారం..అరెస్ట్ అయిన మొదటి నిందితుడు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రం లలిత్‌పూర్‌కు చెందిన 19సంవత్సరాల యువకుడని, రెండవ నిందితుడు మధ్యప్రదేశ్‌లోని ఇండోర్‌కు చెందిన 22సంవత్సరాల విశాల్‌సింగ్ చౌహాన్, మూడవ నిందితుడు రాజ్‌సింగ్‌కుశ్వాల్ ఇండోర్‌కు చెందిన యువకుడన్నారు. ప్రస్తుతం సోనమ్ రఘువంశీ పోలీస్ కస్టడీలో ఉన్నాడని, మధ్యప్రదేశ్‌లోని సాగర్‌జిల్లా నుంచి 23ఏళ్ల యువకుడు ఆనంద్‌కుర్మిని అరెస్ట్ చేశామని ఎస్‌పి తెలియజేశారు. మధ్యప్రదేశ్‌లోని ఇండోర్ జిల్లా ఖాడ్సాలోని గోవింద్‌నగర్‌కు చెందిన 24సంవత్సరాల వయసున్న నిందితురాలు సోనమ్ రఘువంశీ వారణాసి ఘాజీపూర్ మెయిన్‌రోడ్‌లో ఉన్నటువంటి దాబాలో రాత్రివేళ కనుగొన్నామని, ఆమెను ప్రాథమిక చికిత్స కోసం సదర్ హాస్పిటల్ (వన్‌స్టాప్ సెంటర్)కు పంపించామని ఎడిజి తెలిపారు.

పదకొండేళ్ళ బిజెపి పాలనపై

## కాంగ్రెస్ రిపోర్ట్ కార్డు విడుదల

**న్యూఢిల్లీ :** పదకొండేళ్ళ బిజెపి పాలనపై రిపోర్ట్ కార్డును కాంగ్రెస్ పార్టీ విడుదల చేసింది. వృద్ధిరేటు, ఆకలి కేకలు పెరిగాయని, అమలు కానీ హామీలు అనేకం ఉన్నాయని విమర్శించింది. ప్రభుత్వ అబద్ధాలు కొన్నిటినీ గుర్తు చేస్తూ ''11 సాల్, ఝూటే వికాస్ కె వాదే (పదకొండేళ్ళు, బూటకపు అభివృద్ధి వాగ్దానాలు)' పేరుతో బుక్‌లెట్‌ను విడుదల చేసినట్లు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' ఖాతాలో పేర్కొన్నారు. బుక్‌లెట్‌ను రూపొందించిన ఎఐసిసి రీసెర్చ్ డిపార్ట్‌మెంట్ హెడ్ రాజీవ్‌గౌడ ఢిల్లీలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బిజెపి ప్రభుత్వం అబద్ధాల వార్తలు, బూటకపు ప్రచారంలో బాగా పని చేసిందని, కఠోర వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రతిపక్షంగా తమపై ఉన్నదన్నారు. 2024 మ్యానిఫెస్టో ఏక్ ఔర్ బార్ జుమ్లా సర్కార్ (మరో సారి జుమ్లా (మాయ) ప్రభుత్వం)'' బుక్‌లెట్‌ను, ''గ్యారా సాల్ ఝూటే వికాస్ కె వాదే (పదకొండేళ్ళ అబద్ధపు అభివృద్ధి వాగ్దానాలు)' పేరుతో బిజెపి 'డొల్ల హామీల'పై మరో బుక్‌లెట్‌ను తీసుకొచ్చినట్లు ఆయన వివరించారు. పదకొండేళ్ళ నివేదికలో ప్రధాన మంత్రి గరీబ్ కల్యాన్ అన్న యోజన కింద 81 కోట్ల మందికి ఉచిత ఆహార ధాన్యాలను పంపిణీ చేస్తున్నట్లు సంతోషపడుతున్నారని, అదే సమయంలో ప్రపంచ ఆకలి సూచిలో 127 దేశాలలో భారతదేశం 105వ స్థానంలో ఉన్నదనే విషయాన్ని గమనించాలన్నారు. 35.5 శాంతి మందిలో సరైన పెరుగుదల లేదని, 19.3 శాతం మంది బక్కచిక్కారని, 32.1 శాతం మంది ఉండాల్సిన దానికంటే తక్కువ బరువు ఉన్నారని వివరించారు. ఒకవైపు బిజెపి వికసిత్ భారత్ అని చెప్పుకుంటున్నప్పటికీ, భారతదేశ చిన్నారుల్లో 3వంతు మంది పోషకాహార లోపంతో బాధపడుతు న్నారని తెలిపారు. 2014 నుంచి 700లకు పైగా ఏకలవ్య పాఠశాలలను ప్రకటించారని, అందులో 300 ఇప్పటికీ అచరణలోకి రాలేదన్నారు. దేశీయంగా 5 వేల రక్షణ పరికరాలను తయారు చేస్తున్నట్లుగా కేంద్రం చెబుతున్నది కూడా వాస్తవం కాదన్నారు. 40శాతం దేశీయంగా ఉత్పత్తి కావడం లేదని, భారత దేశం ఇప్పటికీ రక్షణ రంగంలో అతి పెద్ద దిగుమతిదారే తప్ప ఉత్పత్తిదారు, ఎగుమతి దారు కాదన్నారు. 'మిషన్ మోడ్ డిఆర్‌డిఒ ప్రాజెక్టు'లలో 55కు గాను 23 ఆలస్యమవుతున్నాయని, రక్షణ బడ్జెట్‌లో పరిశోధన, అభివృద్ధి కోసం కేవలం 5.45 శాతమే కేటాయించారని తెలిపారు. అలాగే భారత దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్న అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ వాస్తవం కాదని, 8.5 శాతం కంటే తక్కువ వృద్ధి రేటుతో సాధ్యం కాదని ఏ ఆర్థికవేత్త అయినా చెబుతారని అన్నారు. ఆర్థిక వృద్ధి రేటు గత ఏడాది 6.5 శాతం అని , దేశంలో అసమానతలు స్పష్టంగా కనిపిస్తున్నాయని, దేశంలో ఒక్క శాతం ప్రజల చేతిలో 40 శాతం సంపద, కింద ఉండే 50 శాతం ప్రజల చేతిలో 3 శాతం సంపద మాత్రమే ఉన్నదని రాజీవ్ గౌడ తెలిపారు.

## సింగపూర్ కంటైనర్ షిప్‌లో పేలుడు..



**కన్నూర్ :** సింగపూర్‌కు చెందిన కంటైనర్ షిప్‌లో పేలుడు సంభవించింది. దట్టంగా పొగలతోపాటు మంటలు ఎగసిపడ్డాయి. ఈ విషయం తెలిసిన వెంటనే రెస్క్యూ ఆపరేషన్ కోసం ఇండియన్ నేవీ రంగంలోకి దిగింది. సోమవారం ఉదయం కేరళ తీరంలో సింగపూర్ కంపెనీకి చెందిన కంటైనర్ షిప్ ఎంవి వాన్ హై 503లో పేలుడు సంభవించింది. ముంబయిలోని మారిటైమ్ ఆపరేషన్స్ సెంటర్ ద్వారా కొచ్చిలోని మారిటైమ్ ఆపరేషన్స్ సెంటర్‌కు సమాచారం అందినట్లు రక్షణ శాఖ తెలిపింది. దీంతో రెస్క్యూ ఆపరేషన్ కోసం ఇండియన్ నేవీ రంగంలోకి దిగినట్లు చెప్పింది. కొచ్చిలో ఉన్న యుద్ధ నౌక ఐఎన్‌ఎస్ సూరత్‌ను ఆ కంటైనర్ షిప్ వద్దకు పంపినట్లు వెల్లడించింది. కాగా, 12.5 మీటర్ల వెడల్పు, 270 మీటర్ల పొడవున్న ఈ కంటైనర్ షిప్ జూన్ 7న కొలంబో నుంచి బయలుదేరింది. జూన్ 10న ముంబయికు చేరుకోవాల్సి ఉన్నది. అయితే సోమవారం ఉదయం 10.30 గంటలకు షిప్ డెక్ కింద నుంచి పేలుడు సంభవించింది. ఈ నేపథ్యంలో అందులో ఉన్న 22 మంది సిబ్బందిలో 18 మంది ఆ నౌకను వీడి బోటులో ప్రయాణించారు. ఇండియన్ నేవీ, కోస్ట్‌గార్డ్ దళాలు వీరిని రక్షించాయి. మరోవైపు మంటల్లో చిక్కుకున్న సింగపూర్ కంటైనర్ షిప్ పరిస్థితిని అంచనా వేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఇండియన్ నేవీ తెలిపింది. నేవీ డోర్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్ ద్వారా పరిస్థితిని పర్యవేక్షిస్తున్నట్లు పేర్కొంది.

## కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం: మమత

**కోల్‌కతా:** పశ్చిమబెంగాల్‌లో కరోనాకేసులు రోజురోజుకు పెరుగుతున్న క్రమంలో ప్రజలకు ముఖ్యమంత్రి మమతాబెనర్జీ అభయమిచ్చారు. కరోనా విస్తృతి నేపథ్యంలో సంబంధిత అన్ని విభాగాల అధికారులతో తాము సమావేశం నిర్వహించామన్నారు. మనమంతా అవగాహనతో, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరముందన్నారు. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. భయపడాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం మీతో ఉన్నదని భరోసా ఇచ్చారు. ఆస్పత్రుల్లో అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని, భయప డాల్సిన పనే లేదని మమతా బెనర్జీ చెప్పారు.

## టెక్కీ ఘాతుకం

**బెంగళూరు:** కర్నాటక రాజధాని బెంగళూరు శివార్లలోని ఓయోటెల్ రూమ్‌లో దారుణం జరిగింది. ఓ టెక్కీ తన ప్రియురాలిని అత్యంత కిరాతకంగా 17 సార్లు కత్తితో పొడిచి హత్యచేశాడు. కెంగేరి ప్రాంతంలోని పూర్ణ ప్రజ్ఞ లేఅవుట్‌లో శుక్రవారం రాత్రి ఈ ఘటన జరగ్గా.. రెండ్రోజుల తర్వాత వెలుగులోకి వచ్చింది. నిందితుడిని 25 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ యశస్‌గా గుర్తించారు. ప్రస్తుతం నిందితుడు పరారీలో ఉన్నాడు. సుబ్రహ్మణ్యపుర పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, హతురాలు హరిణి (33) ఇద్దరు పిల్లలకు తల్లి. కొద్దికాలంగా హరిణి, యశస్ మధ్య రిలేషన్‌షిప్ నడుస్తోంది. దీనిపై కుటుంబ సభ్యుల నుంచి ఒత్తిడి రావడంతో బ్రేకప్ చేసుకోవాలని ఆమె అనుకుందని, హత్యకు ముందు ఈ విషయం అతనికి తెలియజేసిందని, అదే ఈ హత్యకు కారణంగా అనుమానిస్తున్నామని డిసిపి (సౌత్) లోకేష్ జగలసార్ తెలి పారు. ఓయోటెల్‌లో జూన్ 6న ఈ హత్య జరిగింది. గడువు గంటే ఎక్కువ సమయం గది తాళం వేసి ఉండటంతో అనుమానం వచ్చిన సిబ్బంది ఆ విష యాన్ని యాజమాన్యానికి తెలియజేశారు. హత్య ఘటన వెలుగుచూడటంతో సుబ్రమణ్యపురస్టేషన్‌లో కేసు నమోదయ్యింది. యశస్ కోసం గాలిస్తున్నారు.

# పోలీస్ వాహనం పేల్చివేత

- ఎఎస్‌పి మృతి, సిఐ,ఎస్‌ఐకి తీవ్రగాయాలు
- ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లాలో మావోయిస్టుల ఘాతుకం



ప్రజాపక్షం/భద్రాచలం

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. ఎఎస్‌పితో సహా, సిఐ, ఎస్‌ఐ ప్రయాణిస్తున్న వాహనాన్ని మావోయిస్టులు పేల్చివేశారు. ఈఘటనలో ఏఎస్‌పి అకాశ్ రావు మృతి చెందగా, సిఐ, ఎస్‌ఐ కూడా తీవ్ర గాయాల పాలయ్యారు. వివరాల ప్రకారం, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని సుకుమా జిల్లాలో గొల్లపల్లి రోడ్డులో ఉన్న బేస్‌క్యాంపు సమీపంలో మావోయిస్టులు అత్యంత శక్తివంతమైన బాంబును అమర్చారు. పోలీసు వాహనం అటుగా వెళుతున్నట్లు పసిగట్టిన మావోయిస్టులు ఒక్క సారిగా బాంబు పేల్చడంతో వారివాహనం పైకి ఎగిరి పడింది. ఈ ఘటనలో ఏఎస్‌పి ఆకాశ్ రావు తీవ్ర గాయాలపాలయ్యారు. భద్రతా బలగాలు హుటాహుటిన ఆస్పత్రికి తరలించగా చికిత్సలు పొందతూ ఆయన మృతి చెందారు. గాయాలపాలైన సిఐ, ఎస్‌ఐలను చికిత్సలు అందిస్తున్నారు. వందల సంఖ్యలో మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో హతమారుస్తున్న భద్రతా బలగాలపై పగతో రగిలిపోతున్న మావోయిస్టులు ప్రతికార చర్యలకు పూనుకున్నట్లు భావిస్తున్నారు.



# జనరల్
STATE & REGIONAL NEWS

## ఇక 'కాళేశ్వరం విచారణ'కు కెసిఆర్ రెడీ

### విచారణ తీరుపైన ఆరా.. కెసిఆర్‌తో హరీశ్‌రావు భేటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'కాళేశ్వరం కమిషన్' విచారణ అనంతరం బిఆర్ఎస్ మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు ఎర్రవెల్లిలో బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావుతో సోమవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా 'కాళేశ్వరం కమిషన్ విచారణ'లో కమిషన్ అడిగిన విషయాలను, చెప్పిన సమాధానాలను కెసిఆర్‌కు హరీశ్‌రావు వివరించినట్టు తెలిసింది. ఈనెల 11న జస్టిస్ పి.సిఘోష్ విచారణకు కెసిఆర్ హాజరు కానున్న నేపథ్యంలో ఇప్పటివరకు జరిగిన విచారణ విషయాలపై కెసిఆర్ ఆరా తీస్తున్నట్టు సమాచారం. ఇటీవల బిజెపి ఎంపి ఈటల రాజేందర్ విచారణ కమిషన్ ముందు వెల్లడించిన విషయాలపైన కూడా చర్చ జరిగినట్టు సమాచారం. ఇప్పటి వరకు జరిగిన విచారణ తీరును దృష్టిలో పెట్టుకుని 'కాళేశ్వరం విచారణ కమిషన్' ముందు కెసిఆర్ హాజరై, సమాధానం చెప్పనున్నట్టు తెలుస్తోంది.



## రైల్వేల భద్రతకు ప్రాముఖ్యం ఇవ్వాలి

### దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రైల్వే కార్యకలాపాల్లో భద్రత అత్యంత ముఖ్యమైనదని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్‌కుమార్ జైన్ పేర్కొన్నారు. సికింద్రాబాద్‌లోని రైల్ నిలయంలో ''రైలు భద్రతసమయపాలనపై దృష్టి సారించడం'' అంశంపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షాసమావేశంలో అదనపు జనరల్ మేనేజర్ నీరజ్ అగ్రవాల్ వివిధ శాఖలకు చెందిన ప్రధానాధిపతులతోపాటు మొత్తం సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ, గుంతకల్లు, గుంటూరు, నాందేడ్ డివిజనల్ రైల్వేమేనేజర్లు (డి.ఆర్.ఎంలు) వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఈ పాల్గొన్నారు. రైల్వే కార్యకలాపాల్లో భద్రత అత్యంత ముఖ్యమైనదని పునరుద్ఘాటిస్తూ, భద్రతా ప్రమాణాలను ఖచ్చితంగా పాటించాలని, సత్వర పద్ధతులను నివారించడంపై దృష్టి పెట్టాలని అరుణ్‌కుమార్ జైన్ తెలిపారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భద్రతా నిబంధనలను కఠినంగా పాటించాలని ఆయన సూచించారు. రైల్వే సిబ్బందిలో భద్రతా అవగాహనను బలోపేతం చేయడానికి క్రమం తప్పకుండా క్షేత్రస్థాయి కౌన్సిలింగ్‌లు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ట్రాక్ భద్రతను పెంచడానికి అన్ని ఆర్.యు.బిల వద్ద కనీసం రెండేసి హైట్ గేజ్లను ఏర్పాటు చేయాలని సూచిస్తూ రోడ్ అండర్ బ్రిడ్జిలు (ఆర్‌యుబి)లు లెవెల్ క్రాసింగ్ల వద్ద భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలియజేశారు. ఇటీవలి జరిగిన పశువుల రన్ ఓవర్ కేసులకు సంబంధించిన సంఘటనలను దృష్టిలో ఉంచుకొని, పశువుల రన్ ఓవర్ వలన రైలు కదలికలో అంతరాయాలను నివారించడానికి తీసుకోవలసిన చురుకైన చర్యల అవసరాన్ని నొక్కి చెప్పారు. ట్రాక్ వెంట ఫెన్సింగ్ ఏర్పాటు పనిపురోగతిపై సమీక్షిస్తూ కీలక స్థానాలలో వాటి ఏర్పాటుపై కూడా సమీక్షించారు. దక్షిణ మధ్య రైల్వేలో కొనసాగుతున్న డిజిటల్ పరివర్తనలో భాగంగా, అరుణ్ కుమార్ జైన్ 'ఆల్ఫా ఇన్స్పెక్టర్' అప్లికేషన్ను ప్రారంభించారు

# కూనంనేనికే దక్కిన 'న్యాయ విజయం'

### న్యాయస్థానంలో ప్రత్యర్థులకు భంగపాటు

### రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ, పేదల ఆనందోత్సవాలు

### ర్యాలీలు నిర్వహించిన సిపిఐ కార్యకర్తలు



**ప్రజాపక్షం/ఖమ్మం :** 2023 నవంబర్ మాసంలో జరిగిన ఎన్నికల్లో ప్రజలు అపూర్వ విజయాన్ని అందిస్తే ప్రజల విశ్వాసాన్ని అపహాస్యంపాలు చేయాలని కొందరు ప్రయత్నించారు. ప్రజాభిమానం పక్షానే న్యాయం నిలబడుతుందన్న నానుడి నిజం చేస్తూ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కమ్యూనిస్టు వ్యతిరేకులను భంగపాటుకు గురిచేసింది. అత్యున్నత న్యాయస్థానం తీర్పుతో కూనంనేనికి మరో విజయం దక్కింది. 2023 ఎన్నికల్లో కొత్తగూడెం నియోజక వర్గం నుంచి సిపిఐ అభ్యర్థిగా పోటీ చేసిన కూనంనేని సాంబశివరావుకు నియోజక వర్గ ప్రజలు పట్టం కట్టారు. కూనంనేని ప్రజాభిమానం ముందు నిలబడలేక ఎన్నికల్లో చతికిలబడిన కొందరు ఎన్నికల అఫిడవిట్‌లో తప్పుందని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుదీర్ఘ విచారణ తర్వాత న్యాయస్థానం కూనంనేనిపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ సోమవారం తీర్పునిచ్చింది. దీనితో రాష్ట్ర వ్యాప్తంగా సిపిఐ శ్రేణులు, రైతు, కార్మిక వర్గాలు, పేదలు ఆనందోత్సవాలు వ్యక్తం చేశారు. పలు చోట్ల ర్యాలీలు నిర్వహించారు. కొత్తగూడెం నుంచి రెండవ దఫా శాసనసభ్యునిగా ఎన్నికైన తర్వాత అటు చట్ట సభల్లోనూ ఇటు ప్రజాబాహుళ్యంలోనూ కూనంనేని ప్రజలకు తలలో నాలుకలా మారారు. ఒక పక్క మిత్ర పక్షంగా వ్యవహరిస్తూనే ప్రజా సమస్యలపై ప్రశ్నలు ఎక్కుపెట్టడంలోనూ, సమస్యల పరిష్కారానికి కృషి చేయడంలోనూ ఎక్కడా రాజీ ధోరణిని అవలంభించకపోవడం కూనంనేని పట్ల ప్రజల్లో అమిత గౌరవం ఏర్పడింది. శాసన సభలో కూనంనేని మాట్లాడుతుంటే ప్రజలు హర్షిస్తున్నారు. సింగరేణి సమస్య మొదలు రైతాంగం, వ్యవసాయ కార్మికులు, విద్యార్థి యువజనులు, మహిళలు ఇలా సమస్య ఎవరిదైనా ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి దాని పరిష్కారానికి కృషి చేయడంలో కూనంనేని కృతకృత్యులయ్యారు. అవసరమైనప్పుడు మద్దతునిస్తూనే ప్రశ్నించాల్సినప్పుడు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య కూనంనేని వారధిలా మారారు. 18 మాసాల కాలంలో కూనంనేని పనితీరు రాజకీయాలకు అతీతంగా పలువురి ప్రశంసలు పొందింది. ఇటువంటి సమయంలో కోర్టు తీర్పు సోమవారం రాబోతుందని తెలిసి ప్రజలు ఒక్కింత ఆందోళనకు గురయ్యారు. ప్రజల పక్షాన నిలబడిన ప్రజా నాయకుని పట్ల తీర్పు ఏవిధంగా వస్తుందోనన్న ఆలోచన కొందరిలో కలిగింది. న్యాయస్థానం సానుకూల తీర్పునిచ్చిందని ప్రత్యర్థులు భంగపాటుకు గురయ్యారన్న వార్త తెలియగానే రాష్ట్ర వ్యాప్తంగా ఆనందోత్సవాలు వెల్లివిరిశాయి. కూనంనేని ఎన్నికకు సంబంధించి వెలువడిన తీర్పు భవిష్యత్తులో ప్రజాభిప్రాయాన్ని కాదని రకరకాల చిక్కులు సృష్టిస్తూ ప్రజలను గందరగోళానికి గురిచేసే వారికి ఈ తీర్పు గొడ్డలి పెట్టుగా మారింది. ఇదే సమయంలో ఈ తీర్పు కూనంనేని సాంబశివరావు బాధ్యతను మరింత పెంచింది.

కొత్తగూడెం, పాల్వంచ, సుజాతనగర్ పట్టణాల్లో భారీ ర్యాలీలు నిర్వహించారు. ఇది ప్రజావిజయంగా సిపిఐ, వివిధ సంఘాల నేతలు అభివర్ణించారు. ఈ తీర్పు పట్ల సిపిఐ సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్‌కె.సాబీర్‌పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బి.అయోధ్య, సిపిఐ ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్, రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మహ్మద్ మౌలానా, వివిధ ప్రజా సంఘాల నేతలు, సింగరేణి కార్మిక సంఘాలు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ పార్టీల నేతలు హర్షం వెలిబుచ్చారు.



## ఇందిరమ్మ ఇండ్లకు రూ.99కోట్లు చెల్లించాం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయని, ప్రయోగాత్మకంగా చేపట్టిన గ్రామాల్లో ఇండ్ల నిర్మాణాలు పూర్తిచేసుకొని గృహ ప్రవేశాలకు కూడా సిద్ధమవుతున్నాయని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ , సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఈనెల 2వ తేదీ నుంచి సోమవారం వరకు లబ్ధిదారులకు రూ 22.64 కోట్లను విడుదల చేసినట్లు ఆయన సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల పథకానికి సంబంధించి గతవారం రోజుల్లో ఇప్పటి వరకు 1549 ఇండ్లు బేస్‌మెంట్, 481ఇండ్లు గోడల నిర్మాణం వరకు మరో 117 ఇండ్లు శ్లాబ్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక విధ్వంసం వల్ల రాష్ట్ర ప్రభుత్వానికి ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ పేదవారికి ఇచ్చిన మాట ప్రకారం తలతాకట్టుపెట్టయినా సరే ప్రతి సోమవారం లబ్ధిదారులకు నిధులను విడుదల చేసి తీరుతామని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటివరకు 9, 877 బేస్‌మెంట్ పూర్తవ్వగా, 1839 ఇండ్లకు గోడలు పూర్తయ్యాయని, 388 ఇండ్లకు స్లాబులు పూర్తయ్యాయని, ఇందుకు మొత్తం రూ.98.64 కోట్లు విడుదల చేశామన్నారు. ఇందిరమ్మ గృహాల నిర్మాణంలో ప్రభుత్వ పర్యవేక్షణ మాత్రమే ఉంటుందని, నిర్మాణ బాధ్యతలను ప్రభుత్వం చేపట్టడం లేదని, లబ్ధిదారులు తమ స్థలానికి అనుగుణంగా తమకు ఇష్టమైన రీతిలో 400 చదరపు అడుగులకు తగ్గకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా నిర్మించుకునే సౌలభ్యాన్ని కల్పించామని వివరించారు. రాష్ట్రంలో దాదాపు 250 మండలాల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ జరుగుతోందని, లబ్ధిదారులకు ఇంజనీర్లు నిర్మాణ పనుల్లో తగు సహకారాన్ని అందించాలని, వర్షాకాలంలో ఇబ్బంది పడకుండా లబ్ధిదారులను ప్రోత్సహించాలని మంత్రి పొంగులేటి సూచించారు.

# మహారాష్ట్రలో ఘోర విషాదం



## రైళ్ల నుంచి జారిపడిన ప్రయాణికులు

### నలుగురు మృతి, 9 మందికి గాయాలు

**ముంబయి :** మహారాష్ట్రలోని థానె జిల్లాలో విషాదకర ఘటన చోటు చేసుకుంది. సోమవారం ఉదయం రద్దీ సమయంలో రెండు స్థానిక రైళ్ల నుండి జారి పడి నలుగురు ప్రయాణికులు మృతి చెందారు. తొమ్మిది మంది గాయపడ్డారని అధికారులు తెలిపారు. ముంబ్రా రైల్వే స్టేషన్ సమీపంలో రైళ్లు ఒకదానికొకటి నిటారుగా ఉన్న మలుపులో ప్రయాణిస్తున్నప్పుడు ఈ ఘటన జరిగింది. కసారా వైపు, ముంబై ఛత్రపతి శివాజీ మహారాజ్ టెర్మినస్ వైపు వెళ్తున్న రెండు రైళ్ల ఫుట్‌బోర్డుపై బాధితులు ప్రయాణిస్తున్నారని సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ స్వప్నిల్ ధన్‌రాజ్ నీలా తెలిపారు. రద్దీగా ఉన్న రైళ్లలో ప్రయాణికులు తలుపులకు వేలాడుతుండగా, రైళ్లు వ్యతిరేక దిశల్లో వెళ్తున్న సమయంలో వారు ఒకరికొకరు తగులుకోవడం వల్ల జారిపడిపోయారని పోలీసులు తెలిపారు. కసారా వైపు వెళ్తున్న రైలు గార్డు ఈ ఘటన గురించి రైల్వే అధికారులకు సమాచారం అందించాడని, రైళ్ల నుండి పడిపోయిన వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించగా, అక్కడ నలుగురు అక్కడికి చేరుకునేలోపే మరణించినట్లు పోలీసులు తెలిపారు. ముంబయిలోని అన్ని కొత్త సబర్బన్ రైళ్లలో ఆటోమేటిక్ డోర్ క్లోజింగ్ సౌకర్యం ఉంటుందని, ఇప్పటికే ఉన్న రైళ్లలో కూడా ఈ యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాలని రైల్వే బోర్డు నిర్ణయించిందని ఒక అధికారి తెలిపారు. ముంబయిలోని సబర్బన్ రైళ్లలో రోజుకు దాదాపు 75 లక్షల మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారని అధికారి తెలిపారు. ప్రమాదానికి గల కారణాలను రైల్వే యంత్రాంగం పరిశీలిస్తోందని ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. బాధితులు, వారి కుటుంబాలకు సహాయం చేయడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఉప ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే తెలిపారు. సబర్బన్ రైల్వే వ్యవస్థలో రద్దీ, ప్రయాణికుల భద్రతపై తీవ్రమైన శ్రద్ధ వహించాల్సిన అవసరాన్ని ఈ ఘటన గుర్తు చేస్తుందని ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ తెలిపారు. మృతులను కేతన్ సరోజ్, రాహుల్ గుప్తా, మయూర్ షా, థానే ప్రభుత్వ రైల్వే పోలీస్ (జిఆర్‌పి) కానిస్టేబుల్ విక్కీ ముఖ్యాద్‌గా గుర్తించారు. ఫుట్‌బోర్డులపై నిలబడి ఉన్న కొందరు ఒకరినొకరు ఢీకొన్న తర్వాత రైళ్ల నుండి ప్రయాణికులు పడిపోయారని గాయపడిన వ్యక్తి చెప్పినట్లు నీలా చెప్పారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీ మృతుల కుటుంబాలకు తన సంతాపం వ్యక్తం చేస్తూ, గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మోదీ ప్రభుత్వం 11 సంవత్సరాల సేవ జరుపుకుంటుండగా, ముంబయి నుండి వస్తున్న విషాద వార్తలలో దేశ వాస్తవికత ప్రతిబింబిస్తుందన్నారు. భారతీయ రైల్వేలు కోట్లాది మంది జీవితాలకు వెన్నెముక, కానీ నేడు అది అభద్రత, రద్దీ, గందరగోళానికి చిహ్నంగా మారిందని రాహుల్‌గాంధీ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. కాగా, జనసమూహం అధికంగా ఉండటం దృష్ట్యా సబర్బన్ రైళ్లలో ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటు చేయడం వంటి చర్యలను సెంట్రల్ రైల్వే అమలు చేయాలని ఎన్‌సిపి (ఎస్‌పి) అధ్యక్షుడు శరద్ పవార్ అన్నారు. 'మధ్య రైల్వే ముఖ్యమైన మార్గాల్లో స్థానిక రైళ్లను పెంచాలి. ప్రయాణికుల భద్రత కోసం అవసరమైన చర్యలు వెంటనే అమలు చేయాలి' అని ఆయన X లో పోస్ట్ చేశారు. 'స్థానిక రైళ్లలో రద్దీ పెరగడమే ప్రధాన కారణమని అందరికీ తెలుసు. ఇటువంటి ప్రమాదాల తర్వాత, వారి మరణాలకు ప్రయాణికులను నిందించడం సరైనది కాదు' అని పవార్ అన్నారు. శివసేన (యుబిటి) ఎంపి ప్రియాంక చతుర్వేది మాట్లాడుతూ, రద్దీ కారణంగా జరిగిన మరణాలు కావని, ఉదాసీనత కలిగిన రీల్ మంత్రి, మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన హత్యలు అని అన్నారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ విషాదానికి బాధ్యత వహించి రాజీనామా చేయాలని ముంబయి కాంగ్రెస్ అధ్యక్షురాలు వర్ష గైక్వాడ అన్నారు. వలసదారుల 'గుంపుల' కారణంగా ముంబయిలోని రైల్వే మౌలిక సదుపాయాలు కుప్పకూలిపోయాయని ఎంఎన్‌ఎస్ అధ్యక్షుడు రాజ్ థాకరే అన్నారు. సబర్బన్ రైళ్లలో ఆటోమేటిక్ తలుపులు ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను ఎన్‌సిపి (ఎస్‌పి) నాయకుడు జితేంద్ర అవ్హాద్ ఎద్దేవా చేశారు. ఈ సౌకర్యం వల్ల ప్రయాణికులు ఊపిరి ఆడక ఇబ్బంది పడతారని అన్నారు.

# ఫోన్ ట్యాపింగ్ అధికారం ఎస్ఐబికి లేదా?

### హోంశాఖ అనుమతి తప్పనిసరి

**(బిరుదరాజు వాసుదేవరాజు)**



తెలంగాణలో సంచలనం సృష్టించిన ఫోన్ ట్యాపింగ్ కేసుపై అందరి దృష్టి ఉంది. అసలు ఫోన్ ట్యాపింగ్ అంటే ఏమిటి, దీన్ని ఎవరు చేస్తారనే పలువురి అనుమానాలకు సవివరమైన వివరాలు ఇలా ఉన్నాయి. అసలు ఫోన్ ట్యాపింగ్ చేసే అధికారం ప్రత్యేక ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబి)కి లేదు. వీళ్లు గనుక ఫోన్ ట్యాపింగ్ చేయాలంటే ముందుగా రాష్ట్ర హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శికి లిఖితపూర్వకంగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఆ తరువాత హోం శాఖ అనుమతి ఇస్తేనే ఎస్ఐబి ఫోన్ ట్యాపింగ్ చేసే అధికారం ఉంటుంది. అయితే ఎస్ఐబి చీఫ్‌గా టి.ప్రభాకర్‌రావు ఉన్న సమయంలో హోంశాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకుండానే స్వతహాగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడ్డారని ఇంత వరకు జరిగిన విచారణలో తేలింది.

**నిబంధనలు ఇలా..**

భారతదేశంలో పోలీస్ శాఖలు లేదా ఎన్ఫోర్స్మెంట్ ఏజెన్సీలు ఫోన్ ట్యాపింగ్ చేయాలంటే చాలా కఠినమైన నిబంధనలు, చట్టపరమైన ప్రక్రియలు పాటించాలి. ఈ ప్రక్రియలు న్యాయపరంగా అనుమతించబడిన సందర్భాల్లో మాత్రమే చట్టబద్ధంగా నిర్వహిస్తారు.

ఫోన్ ట్యాపింగ్‌కు తప్పనిసరిగా చట్టం ఉంది. చట్టం చెబుతున్న నిబంధనల ప్రకారం మాత్రమే ఫోన్ ట్యాపింగ్ చేయాల్సి ఉంటుంది. భారతదేశంలో టెలిఫోన్ ట్యాపింగ్ లేదా ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ ఇంటర్సెప్షన్ ప్రధానంగా ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం1885, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000ల ప్రకారం ఫోన్ ట్యాపింగ్ నిర్వహించవచ్చు. సార్వజనిక భద్రత లేదా అత్యవసర పరిస్థితులలో, ప్రభుత్వానికి అనుమతి ఉంటే మాత్రం ట్యాపింగ్ చేయవచ్చు. ఇది సాధారణంగా కేంద్ర లేదా రాష్ట్ర ప్రభుత్వాలు, లేదా వాటి ద్వారా అధికారాలిచ్చిన అధికారుల ద్వారా మాత్రమే చేయవచ్చు.

**అనుమతి ఇచ్చే అధికారులు ఎవరు?**

కేంద్ర స్థాయిలో..కేంద్ర హోం కార్యదర్శి, రాష్ట్ర స్థాయిలో రాష్ట్ర హోంశాఖ కార్యదర్శి అనుమతి తప్పనిసరి. ఇవే అధికారం కలిగిన అధికారులు. పోలీస్ కమిషనర్లు, డిజిపిలు, ఎస్పిలు స్వయంగా ట్యాపింగ్ ఆర్డర్ ఇవ్వలేరు ఆదేశం తప్పనిసరిగా హోం డిపార్ట్మెంట్ నుంచే రావాలి.

**ఎప్పుడు ట్యాపింగ్ చేయొచ్చు?**

జాతీయ భద్రతకు హాని ఉన్నప్పుడు, అత్యవసర పరిస్థితుల్లో, దేశద్రోహ, ఉగ్రవాద, ముఠా గ్యాంగ్, మానవ అక్రమ రవాణా వంటి కేసులలో, అలాగే సరైన న్యాయమూర్తి అనుమతి ఉన్నప్పుడు (రిమాండ్ సమయంలో) మాత్రమే ఫోన్ ట్యాపింగ్ చేయాలి.ప్రత్యేక ఇంటెలిజెన్స్ బ్రాంచ్ (ఎస్ఐబి) అనేది రాష్ట్ర స్థాయి ఇంటెలిజెన్స్ విభాగం. ఇది పశ్చిమబెంగాళ్, తెలంగాణ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ఆధారాలు, ఇంటెలిజెన్స్ సమాచారం సేకరణ కోసం పనిచేస్తుంది. కానీ...ట్యాపింగ్కు అధికారం ఉండాలంటే, ఇండియన్ టెలిగ్రాఫ్ చట్టం 1885 సెక్షన్ 5(2) ప్రకారం అనుమతి తీసుకోవాలి. ట్యాపింగ్ అనేది గోప్యమైన చర్య కాబట్టి, ఇది కేవలం హోంశాఖ నుంచి లిఖితపూర్వక అనుమతి ఉన్నపుడు మాత్రమే చట్టబద్ధం.

**ఎస్ఐబి అధికారులకైతే?**

వారు స్వయంగా ఫోన్ ట్యాపింగ్ ఆదేశాలు ఇవ్వలేరు. వారి డైరెక్టర్ లేదా హెడ్ అధికారులు ఒక రిక్వెస్ట్ రిపోర్టు తయారు చేసి, హోంశాఖకు పంపాలి. ఆమోదం వచ్చిన తరువాతే సంబంధిత టెలికాం కంపెనీలతో కలిసి ట్యాపింగ్ జరుగుతుంది. ఒక్కసారి మంజూరైన ఆదేశం గరిష్టంగా 60 రోజులు వరకే చెల్లుతుంది (మళ్లీ 180 రోజులు వరకూ పొడిగించవచ్చు).ఫోన్ ట్యాపింగ్‌లపై రాష్ట్ర, కేంద్ర హోంశాఖ కార్యదర్శులు ప్రతి 2 నెలలకు ఒకసారి ఒక రివ్యూ కమిటీ ఈ ట్యాపింగ్ ఆదేశాలను సమీక్షించాలి.చట్టవ్యతిరేకంగా ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడితే మూడు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించవచ్చు.

ఈ సంస్థలకే నేరుగా ట్యాపింగ్ అధికారాలున్నాయి:

| ఏజెన్సీ పేరు | విధానం |
|---|---|
| రిసెర్చ్ అండ్ అనాలైసిస్ వింగ్ (రా) | విదేశీ చారిత్రక సమాచారం |
| ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబి) | దేశీయ ఇంటెలిజెన్స్ |
| జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) | ఉగ్రవాద దర్యాప్తు |
| సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) | ప్రధాన క్రిమినల్ కేసులు |
| డైరెక్టరేట్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఇడి) | ఆర్థిక నేరాలు |
| డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డిఆర్ఐ) | స్మగ్లింగ్, కస్టమ్స్ ఉల్లంఘనలు |
| ఢిల్లీ పోలీసులు | నిర్దిష్ట అనుమతితో మాత్రమే |

## ఉపాధిహామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలి

### కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు రైతు కమిషన చైర్మన్ కోదండరెడ్డి విజ్ఞప్తి



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడంతో పాటు, మైనర్ ఇరిగేషన్‌కు కేంద్ర నిధులు కేటాయించాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు తెలంగాణ వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండరెడి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం కేంద్ర మంత్రిని కలిసిన కోదండరెడ్డి రెండు లేఖలను అందజేశారు. తెలంగాణ గొలుసుకట్టు చెరువులకు నిలయమని, రాష్ట్రంలో 45వేల చెరువులు ఉన్నాయని.. వాటి అభివృద్ధి నిర్వహణకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఈ లేఖలో కోరారు. ఇతర రాష్ట్రాల్లోని చెరువుల అభివృద్ధికి కేంద్రం నిధులు కేటాయిస్తున్న విషయాన్నీ గుర్తుచేశారు. అదేవిధంగా వ్యవసాయ రంగంలో కూలీల కొరత తీవ్రంగా ఉందని, ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం ద్వారా వ్యవసాయ రంగం మరింత పురోగతి చెందుతుందని తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం మంగళ్‌పల్లి గ్రామంలో జరిగిన విక్షిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమంలో కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, పాల్గొన్న రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావుతో కలిసి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి పాల్గొన్నారు.

# సమరశీల ఉద్యమాలతోనే అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం

### ఆంధ్రప్రదేశ్ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు పిలుపు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం జరగాలంటే బాధితులు సమరశీల ఉద్యమాలకు సిద్ధం కావాలని ఆంధ్రప్రదేశ్ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్ధూంభవన్‌లో సోమవారం తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం సర్వసభ్య సమావేశం జరిగింది. గుడిమెట్ల రజిత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి ముప్పాళ్ళ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగావిచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1995లో ప్రారంభమైన అగ్రిగోల్డ్ కంపెనీ యాజమాన్యం మాయలో పడి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా రాష్ట్రాలలో పేద మధ్యతరగతి కుటుంబాల నుండి దాదాపు రూ.7వేల 600 కోట్ల వరకు డిపాజిట్లను సేకరించిన తిరిగి డిపాజిట్ దారులకు డబ్బు ఇవ్వాల్సి వచ్చేసరికి అగ్రిగోల్డ్ మేనేజ్మెంట్ చేతులు ఎత్తివేసిందన్నారు. తెలంగాణలో దాదాపు మూడు లక్షల మంది అగ్రిగోల్డ్ బాధితులు ఉన్నారని, ఇందులో కొందరు ఆత్మహత్యలు చేసుకున్నారని, వారి బాధలను వర్ణించలేమన్నారు. ఆంధ్రప్రదేశ్లో అగ్రిగోల్డ్ బాధితుల ఉద్యమం ఉద్యమాన్ని తీవ్రతరం చేయడం ద్వారా గత ప్రభుత్వం రూ.906 కోట్ల రూపాయలను బాధితులకు 20వేల రూపాయల వరకు డిపాజిట్ చేసిన వారికి ఇవ్వటం జరిగిందన్నారు. ఆత్మహత్య చేసుకున్న బాధిత కుటుంబాలకు 5 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇప్పించామని ఆయన చెప్పారు. తెలంగాణతో సహా ఇతర రాష్ట్రాలలో అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయ పైసా కూడా దక్కలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారంలో నూతన పథకాలను ముందుకు దూసుకు వెళ్తున్న యువ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ప్రతి ఒక్క అగ్రిగోల్డ్ బాధితుడు తమ బాధలను వివరిస్తూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రికి పోస్టుకార్డు ద్వారా ఉత్తరాలు రాయాలని కోరారు.

పశ్యపద్మ మాట్లాడుతూ 1956 కంపెనీ యాక్ట్ కింద రిజిస్టర్ అయిన అగ్రిగోల్డ్ సంస్థ పేద మధ్య తరగతి ప్రజలను దారుణంగా మోసం చేస్తే కఠినమైన చర్యలు తీసుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించకపోవడం సరైంది కాదన్నారు. దాదాపుగా గత 15 ఏళ్లుగా బాధితులకు న్యాయం జరగడంలేదని, ఈ సమస్య పరిష్కారానికి ఉన్నత స్థాయి అధికారులతో కమిటీని ఏర్పాటు చేసి యుద్ధ ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని కోరారు. ఆత్మహత్య చేసుకున్న అగ్రిగోల్డ్ బాధిత కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాను ఇవ్వాలని కోరారు. తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జివిరావు మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల హక్కుల రక్షణ కోసం స్పెషల్ కోర్టును ఏలూరులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఏర్పాటు చేసినట్లుగా తెలంగాణలో కూడా స్పెషల్ కోర్టును ఏర్పాటు చేయాలని కోరారు. రజిత మాట్లాడుతూ ఉమ్మడి 10 జిల్లాల్లో అగ్రిగోల్డ్ బాధితుల సమావేశాలను నిర్వహించి జిల్లా స్థాయి కమిటీలను ఏర్పాటు చేసుకోవటానికి సిద్ధం కావాలన్నారు. ఈ సందర్భంగా అగ్రిగోల్డ్ బాధితుల సమస్యల పరిష్కరించాలని కోరుతూ ముఖ్యమంత్రికి మెమోరాండం ఇవ్వాలని సమావేశం నిర్ణయించింది.

**నూతన కమిటీ ఎన్నిక :** తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. గౌరవ అధ్యక్షులుగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, రాష్ట్ర అధ్యక్షురాలుగా పశ్యపద్మ, ప్రధాన కార్యదర్శిగా కల్లూరి జివి.రావులను ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా గుడిమెట్ల రజిత, వజ్రాల అరుణ, ఉప ప్రధాన కార్యదర్శిగా ఎం.శ్రీనివాసులు, ట్రెజరర్ గా నవీన్ లను సమావేశం ఎన్నుకుంది.

## టిపిసిసి నూతన జంబో కార్యవర్గం

### ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి.వేణుగోపాల్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఎట్టకేలకు తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టిపిసిసి) రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎఐసిసి అధిష్టానం సోమవారం ప్రకటించింది. టిపిసిసి ఉపాధ్యక్షులుగా 27 మందిని, ప్రధాన కార్యదర్శులుగా 69 మందిని పార్టీ అధిష్టానం నియమించింది. నూతన కార్యవర్గంలో పార్టీ సీనియర్ నాయకులు, ఎంపిలు, ఎంఎల్‌ఏలు ఉన్నారు. ఈ మేరకు ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి.వేణుగోపాల్ ఒక ప్రకటన విడుదల చేశారు. టిపిసిసి ఉపాధ్యక్షులుగా నియమితులైన వారిలో పార్టీ సీనియర్ నాయకులు టి.కుమార్ రావు, ఎంపి కే.రఘువీర్ రెడ్డి ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డి, చిక్కుడు వంశీకృష్ణ, ఎమ్మెల్సీలు బల్మూరి వెంకట్, బసవరాజు సారయ్య, సీనియర్ నాయకులు హనుమండ్ల ఝాన్సీ రెడ్డి, బండి రమేష్, కొండ్రు పుష్పలీల, కోట నీలిమ, బి.శైలేష్ కుమార్ తదితరులు ఉన్నారు. అలాగే నూతనంగా నియమితులైన ప్రధాన కార్యదర్శులలో ఎమ్మెల్యేలు వెడ్మా బొజ్జు, సిహెచ్ వర్నికారెడ్డి డాక్టర్ మట్టా రాగమయి సిహెచ్ రాంభూపాల్, ఎ.సంజీవ్ ముదిరాజ్ బొజ్జ సంధ్యారెడ్డి మల్లాది రామిరెడ్డి ఎ.సదాలక్ష్మి తదితరులు ఉన్నారు.

## ఎన్నికల జాబితా సవరణకు సన్నద్ధత

### సిఇఒ సి. సుదర్శన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ ముఖ్య ఎన్నికల అధికారి సి. సుధర్శన్ రెడ్డి రాష్ట్రంలో రాబోయే ప్రత్యేక సారాంశ సవరణ (ఎస్ఎస్ఆర్) కోసం ముందస్తు కార్యక్రమాలను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్లు, ఎన్నికల నమోదు అధికారుల (ఈఆర్ఒ)లకు సోమవారం నిర్వహించిన వీడియో సమావేశంలో ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పోలింగ్ స్టేషన్‌ల సమీకరణ, ఖాళీ పోస్టుల భర్తీ, అధికారుల శిక్షణపై ప్రధాన దృష్టి సారించారు. సి. సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం (ఈసిఐ) మార్గదర్శకాలను అనుసరించి, 1200 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న పోలింగ్ స్టేషన్లను సమీకరించాలని సూచించారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** ప్రకృతి వ్యవసాయంపై యాజమాన్య పద్ధతులపై మండల పరిధిలోని వివిధ గ్రామాలలో రైతులకు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. మండల పరిధిలోని వల్లభాపూర్‌లో మండల వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో భాగంగా చేయవాల్సిన నపనులు గోదారితంగా వేసి ఎరువులు ఆగ్ని హస్తం గణ జీవామృతం బ్రహ్మాస్త్రం పంచగవ్ వేప పిండి కాషాయం తయారీ గురించి రైతులకు వివరించారు. గ్రామంలో ప్రకృతి వ్యవసాయం దానికి ఆసక్తి గల 125 మంది రైతులను ఎంపిక చేయడం జరిగింది. అదేవిధంగా ఎంపిక చేసిన రైతులలో సిఆర్పి కమ్యూనిటి రిసోర్స్ పర్సన్‌గా ఇద్దరు రైతులను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో విస్తరణ అధికారి విజయ్ గౌడ్, గ్రామ రైతులు రవీందర్ రెడ్డి, మోహన్ రెడ్డి, ప్రతాపరెడ్డి, దామోదర్ రెడ్డి, సాయిరాం, బాల్‌రెడ్డి తదితర రైతులు పాల్గొన్నారు.

## 'ఇథనాల్ కంపెనీ' ఏర్పాటు నిర్ణయాన్ని విరమించుకోండి

### జాన్‌వెస్లి అరెస్ట్‌ను ఖండించిన సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ

**ప్రజాపక్షం/హైదరాబాద్:** గద్వాల జిల్లా రాజోలి మండలం పెద్దదన్వాడ గ్రామ శివారులో ఇథనాల్ పరిశ్రమ ఏర్పాటును వ్యతిరేకిస్తూ ఆందోళన చేస్తున్న 12 గ్రామాల రైతులను, రిమాండ్‌లో ఉన్న బాధిత కుటుంబాలను పరామర్శించేందుకు వెళ్లిన సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లి, రాష్ట్ర కమిటీ సభ్యులు ఆర్ శ్రీరాంనాయక్, గద్వాల జిల్లా కార్యదర్శి ఎ వెంకటస్వామి తదితరులను అడ్డుకుని అరెస్ట్ చేయడాన్ని సిపిఐ(ఎం) రాష్ట్రకమిటీ ఖండించింది. ఈ మేరకు సిపిఐ(ఎం) సోమవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇథనాల్ కంపెనీ ఏర్పాటుతో పంట పొలాలు దెబ్బతింటాయని, అందుకే తక్షణమే ఆ కంపెనీ నిర్మాణ నిర్ణయాన్ని వెంటరు ఉపసంహరించుకోవాలని, అరెస్ట్ చేసిన రైతులను బేషరతుగా విడుదల చేయాలని, గ్రామాల్లో పోలీస్ పికెటింగ్‌ను ఎత్తివేసి, అక్రమ అరెస్టులను ఆపాలని సిపిఐ(ఎం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

**ప్రజాపక్షం/జడ్చర్ల:** జడ్చర్ల మండల పరిధిలోని చిట్టెబోయినిపల్లి తాండా సమీపంలో జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని హరి బాబు అనే వ్యక్తి మృతి చెందినట్లు జడ్చర్ల ఎస్సై ఖాదర్ తెలిపారు. సోమవారం నాడు తెల్లవారుజామున హరి బాబు అనే మృతుడు తన మిత్రుడిని జడ్చర్ల పట్టణంలోని వదిలేసి వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం వెనుక వైపు నుంచి వచ్చి ఢీకొన్నదని ఆయన పేర్కొన్నారు. మధ్యాహ్నం మృతదేహాన్ని మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టన్ నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు. మృతునికి ఇద్దరు కుమారులు ఉన్నారని ఆయన పేర్కొన్నారు. ఇదిలా ఉండగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కుటుంబ సభ్యులు డిమాండు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారని పోలీసులు తెలిపారు.

## 12న ఏకరూప దుస్తుల పంపిణీ



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** పాఠశాలలో ప్రారంభం రోజున విద్యార్థిని విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు, మండల విద్యాధికారి నర్సింహ తెలిపారు. మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో మండల పరిధిలోని పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు ఇవ్వాల్సిన ఏకరూప దుస్తులను మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో కుట్టించడం జరుగుతుందని, ఏకరూప దుస్తుల తయారీ కూడా పూర్తికావచ్చిందని వారు తెలిపారు. ఈ నెల 12న పాఠశాలలో ప్రారంభం కావడంతో అదే రోజు మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు ఏకరూప దుస్తులను పంపిణీ చేయడం జరుగుతుందని ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఎంఈఓ నర్సింహ తెలిపారు.

## సంకిరెడ్డిపల్లి గ్రామంలో బడిబాట




**ప్రజాపక్షం/కొత్తకోట :** గ్రామంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డిల ఆదేశాల మేరకు గ్రామంలో బడిబాట కార్యక్రమం గ్రామ పంచాయతీ సెక్రటరీ బొజ్జ నాయక్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ ఎన్ఎస్‌యూఐ ప్రెసిడెంట్ ఎండి.ముస్తఫా, గ్రామ ఉపాధ్యాయులు అంగన్‌వాడీ టీచర్స్, ఆశా వర్కర్స్, గ్రామ పెద్దలు, గ్రామ యువకులు, గ్రామ పంచాయతీ వర్కర్స్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రైవేట్ పాఠశాల వద్దు ప్రభుత్వ పాఠశాల ముద్దు అనే నినాదాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలియజేశారు.

## యోగాసాధనతో సంపూర్ణ ఆరోగ్యం



**ప్రజాపక్షం/బిజినేపల్లి :** ప్రతి ఒక్కరువిధిగా నిత్యం యోగాసాధన చేస్తే సంపూర్ణ ఆరోగ్యం తథ్యమని ఆయుష్ వైద్యాధికారి డాక్టర్ అజహర్‌అహ్మద్ అన్నారు. మండలంలోని పాలెం గ్రామపంచాయతీ కార్యాలయంలో సోమవారం యోగాదినోత్సవ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా యోగాపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఉరుకుల పరుగుల జీవనప్రయాణంలో శారీరక శ్రమ లేకపోవడంవల్ల వయసుతో సంబంధం లేకుండా ప్రతి ఒక్కరు అనారోగ్యం పాలవుతున్నారని అన్నారు. ఉదయం, సాయంత్రం సమయాల్లో గంటపాటు సులభమైన యోగా ఆసనాలతో సంపూర్ణ ఆరోగ్యంతో నూరేళ్లు సంతోషంగా జీవించవచ్చన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ ఆయుర్వే ఆస్పత్రిలో ఉచితయోగశిక్షణ ప్రతిరోజు ఇస్తున్నామని అందరూ వినియోగించుకోవాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి ఆలేటి సందీప్, ప్రభుత్వ యోగ శిక్షకులు శివప్రసాద్, శ్రీకాంత్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## వ్యాయామ ఉపాధ్యాయుడిని (పిఈటీ) నియమించాలి



**ప్రజాపక్షం/ మక్తల్ :** నారాయణపేట జిల్లా మక్తల్ నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (బాలుర)లో దాదాపుగా 790 మంది విద్యార్థులు ఉన్నారు. రెండు సంవత్సరాల నుండి వ్యాయామ (పిఈటీ) ఉపాధ్యాయుడు లేక క్రీడారంగానికి, మానసిక ఉల్లాసానికి దూరం అవుతున్నారు. ఇక్కడ చదువుకోవడానికి మక్తల్ చుట్టుపక్కల ఉండే వివిధ గ్రామాల నుంచి కూలీ చేసుకునే తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పిస్తే తమ పిల్లలకు చదువుతోపాటు అటపాటలలో రాణించడానికి అవకాశం ఉందనుకుంటే ఇక్కడ ఉండే ఫిజికల్ డైరెక్టర్, డిప్యూటేషన్‌పై డివైఎస్ఓగా జిల్లా కేంద్రానికి వెళితే ఇక్కడ పేరొందిన పాఠశాలలో చదువుకునే బడుగు బలహీన వర్గాల పిల్లలు క్రీడా రంగానికి దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి వెంటనే వ్యాయామ (పీఈటీ) ఉపాధ్యాయుడిని నియమించాలని సోమవారం మాదిగ ఎంఆర్‌పిఎస్ జిల్లా బాధ్యులు జీర్గల్ నగేష్ జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులుకి వినతి పత్రాన్ని అందించారు.

## శ్రీహరికి మంత్రి పదవి హర్షణీయం

### జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

**ప్రజాపక్షం/జడ్చర్ల:** బడుగు బలహీన వర్గాలకు చెందిన వాకిటిశ్రీహరికి మంత్రి పదవి దక్కడం హర్షణీయమని జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన విడుదల చేసిన ఒక ప్రకటనలో మంత్రి పదవి గురించి సంతృప్తి వ్యక్తం చేశారు. గత ప్రభుత్వాలు అగ్రవర్ణాలకు ఎక్కువ అవకాశం ఇచ్చారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో బడుగు బలహీన వర్గాలకు సముచిత న్యాయం చేశారని ఆయన గర్వపడ్డారు. అదే విధంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన వాకిటి శ్రీహరి మంత్రి పదవి దక్కడం, గర్వించదగ్గ విషయమని అన్నారు.

# ప్రజావాణి ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దు

### కలెక్టర్ బదావత్ సంతోష్



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** ప్రజావాణికి వచ్చిన ఫిర్యాదులను పెండింగ్‌లో పెట్టొద్దని జిల్లా కలెక్టర్ బదావత్‌సంతోష్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో దరఖాస్తు దారులనుంచి ఆర్జీలు స్వీకరించారు. వివిధ సమస్యలపై 35 ఆర్జీలు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిలో సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో ఎంతో దూరం నుంచి వ్యయ ప్రయాసాల కోర్చి వస్తుంటారని ఈవిషయంలో అధికారులు సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించేలా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. జిల్లాస్థాయి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టడం తోపాటు క్షేత్రస్థాయి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత మండలాలకు బదిలీ చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవసహాయం, వివిధశాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సెక్షన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**బడి ఈడు పిల్లలందరిని బడిలోచేర్చే లక్ష్యంతో బడిబాట :**

బడిఈడు పిల్లలందరిని బడిలో చేర్చే లక్ష్యంతో బడిబాట కార్యక్రమం చేపట్టడం జరిగిందని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం సచివాలయం నుండి పాఠశాలల పునఃప్రారంభ చర్యలు, పాఠ్యపుస్తకాలు, ఏకరూపదుస్తులు, మహిళల అభ్యున్నతికి చేపట్టిన సౌరవిద్యుత్ ప్లాంట్ల, పెట్రోల్‌పంపులు ఏర్పాట్లు, స్వయంసహాయక మహిళా సంఘాల భవనాల నిర్మాణాలు, స్వయంసహాయక సంఘాల్లో కోటిమంది మహిళలను చేర్చ డం, తదితర అంశాలపై రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉన్నతాధికారులతో కలిసి జిల్లాల కలెక్టర్లతో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించిన గ్రామీణ అభివృద్ధి, మహిళ సంక్షేమశాఖల మంత్రి సీతక్క నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టరేట్ మీడియా సమావేశమందిరం నుండి అదనపు కలెక్టర్ దేవసహాయం, సంబంధితశాఖల అధికారులతోకలిసి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొన్నారు. జిల్లాలోని గ్రామీణ, పట్టణప్రాంతాల్లోని పాఠశాలల విద్యార్థులకు అవసరమైన ఏకరూపదుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోటుపుస్తకాలను ఈనెల 12వతేది పాఠశాలల పునఃప్రారంభంనాడు ప్రతి ఒక్కరికి అందించేందుకు అవసరమైన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, నోట్‌పుస్తకాలు పాఠశాలలకు చేర్చినట్లు తెలిపారు. ఈనెల 12న పాఠశాలల పునఃప్రారంభం రోజున పండుగ వాతావరణంలో నిర్వహించేలా ఇదివరకే జిల్లా విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ఆదేశాలు జారీచేశామని తెలిపారు. జిల్లాలో కొనసాగుతున్న బడిబాట కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. జిల్లాలో మహిళాసంఘాలద్వారా ఏర్పాటు చేయనున్న పెట్రోల్‌పంపునకు అవసరమైన స్థల సేకరణను పూర్తిచేస్తామని, జిల్లాకేంద్రంలో నిర్మిస్తున్న మహిళా సమైక్యభవన నిర్మాణాన్ని నవంబర్‌నాటికి పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈనెల 11న ప్రారంభం కానున్న అంగన్‌వాడికేంద్రాలు, 12నుండి ప్రారంభం కానున్న ప్రభుత్వ పాఠశాలల పునఃప్రారంభానికి కావాల్సిన అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని తెలిపారు. నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని వీడియోకాన్ఫరెన్స్ హాల్‌నుండి జిల్లా అదనపు కలెక్టర్ అమరేందర్, సంబంధిత శాఖల అధికారులతోకలిసి జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ పాల్గొన్నారు. ఈసమావేశంలో అన్ని కలెక్టరేట్ ఎన్నికలవిభాగం సూపరిండెంట్ రవికుమార్, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# అందుబాటులో పేద ప్రజలకు కార్పొరేట్ వైద్యం

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి



**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందుబాటులోకి తెస్తున్నామని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పట్టణం లోని ప్రణాయ్ కార్డియాక్ సెంటర్‌లో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకంలో కార్డియాక్ విభాగాన్ని ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పది సంవత్సరాల కాలంలో ఆరోగ్య శ్రీ పథకం నిర్లక్ష్యానికి గురైందని గ్రహించి ప్రజా ప్రభుత్వంలో రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకాన్ని పునరుద్ధరించడం తో పాటు పది లక్షల రూపాయలకు పెంచడం జరిగిందని ఆయన గుర్తు చేశారు. అత్యవసరమైన వైద్య సేవలకు హైదరాబాద్ పోవాల్సిన పరిస్థితి ఇక లేదన్నారు. ప్రణాయ్ కార్డియాక్ సెంటర్‌లో అన్ని రకాల వసతులు ఉన్నాయని పేద ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అనంతరం సీటి న్యూరో, గ్యాస్ట్రో సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కూచుకుల్ల దామోదర్ రెడ్డి, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహ్మారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, సిజె బెనహర్, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సుధాకర్ రెడ్డి, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంపత్ కుమార్ సింగ్, ఐఎంఎ జిల్లా అధ్యక్షులు డాక్టర్ రాంమోహన్, డాక్టర్ సామ్యూల్, డాక్టర్ ప్రణాయ్, డాక్టర్ కిరణ్ కుమార్, డాక్టర్ విజయ కుమార్ మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# బొల్లారం రెవెన్యూ సదస్సులో సిపిఐ నిరసన



**ప్రజాపక్షం/వీపనగండ్ల :** వీపనగండ్ల మండలం బొల్లారం రెవెన్యూ సదస్సులో భూ సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం పట్ల్ సిపిఐ నేతలు నిరసన తెలిపారు. సర్వే నంబర్‌లు 618, 106 సర్వే నంబర్లలో రైతుల సమస్యలను పరిష్కరించాలని నినాదాలు చేశారు. తహసీల్దార్ వరలక్ష్మీ కి 618, 106 సర్వే నంబర్లలో సమస్యలను వివరిస్తూ వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఐ అనుబంధ ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షుడు వంక గోపాల్, మండల కార్యదర్శి ఎం.కురుమయ్య మాట్లాడుతూ సర్వే నంబర్ 618 భూమి గ్రామ కంఠంలో ఉందని, ఆ భూమికి రైతులకు ఇచ్చిన పట్టాలను రద్దు చేసి, దశాబ్దాలుగా ఆ భూమిలో ఇండ్లు కట్టుకొని నివసిస్తున్న వారికి పర్మిషన్లు ఇవ్వాలన్నారు. సర్వే నంబర్ 106లో ఉన్నది. ప్రభుత్వ భూమి అన్నారు. దళితులకు గతంలో పట్టాలు ఇవ్వగా వారు సాగు చేసుకుంటున్నారనారు. రెవెన్యూ రికార్డులో కూడా వారి పేర్లు ఉండేవని, ధరణి వచ్చినప్పుడు పేర్లు రికార్డుల నుంచి మాయమయ్యాయన్నారు. పూర్తి స్థాయిలో విచారించి రికార్డుల్లో ఎక్కించాలన్నారు. అంతేగాక 106 సర్వే నంబర్లో అసలు భూమి లేని రైతుల పేర్లు రెవెన్యూ రికార్డుల్లో ఉన్నాయన్నారు. వాటిని తొలగించి సాగులో ఉన్న రైతులకు పట్టాలు ఇవ్వాలన్నారు. సర్వే నంబర్ 618 గ్రామ కంఠం భూమిపై విచారణ చేపడతామని, తన పరిధిలో ఉంటే పరిష్కరిస్తామని లేదంటే జిల్లా కలెక్టర్ కు నివేదిస్తామని, 106లో ఉన్న భూ సమస్య కూడా తీరుస్తామని ఎమ్మార్వో వరలక్ష్మి హామీనిచ్చారని సిపిఐ నేతలు తెలిపారు. ఈ సర్వే నంబర్ల భూమిలో ఉంటున్న రైతులు కూడా తహసీల్దార్‌కు దరఖాస్తులు ఇచ్చారన్నారు. మండల కార్యదర్శి ఎం.కురుమయ్య, గ్రామ కార్యదర్శి చల్మామారెడ్డి, నేతలు వేమన్న, తిరుపతయ్య, డి.శివ, కృష్ణయ్య, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

### కలెక్టర్ విజయేందిర బోయి




**ప్రజాపక్షం/ మహబూబ్ నగర్ ప్రతినిధి:** ప్రజా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో స్థానిక సంస్థ అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు లతో కలిసి జిల్లా కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారుల దరఖాస్తులలో పేర్కొన్న సమస్యలపై క్షణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో 96 దరఖాస్తులు రాగా అందులో రెవెన్యూ, వ్యవసాయ శాఖ, పంచాయతీ రాజ్, ఇతర శాఖలకు సంబంధించి దరఖాస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారుల సమన్వయ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ సీజనల్ వ్యాధుల నియంత్రణకు పారిశుధ్య చర్యలు తీసుకోవాలని, నీరు నిల్వ లేకుండా చూడాలని, తాగు నీటి వనరుల వద్ద పరిశుభ్రత చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖ పంచాయతీ కార్యదర్శులు, ఎం.పీ.ఓలను మండల ప్రత్యేక అధికారులు సమీక్షించాలని అన్నారు. పదిమంది కంటే ఎక్కువ ఉన్న పని ప్రదేశాలలో మహిళలపై లైంగిక వేధింపులను పరిశీలించేందుకు అంతర్గత ఫిర్యాదుల కమిటీలలో ఉన్న మహిళ సభ్యులలో కొత్తగా వచ్చిన వారి వివరాలు అప్డేట్ చేసి మహిళా, శిశు సంక్షేమ శాఖకు పంపించాలని ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకం కింద ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనార్టీ కార్పొరేషన్ ద్వారా యూని ట్‌ల గురించి కొనుగోలు కమిటీలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కమిటీలు సమావేశం జరిపి యూనిట్‌ల కొనుగోలు సంబంధించి డి.పి. ఆర్ సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్.పి.సి.ఈ.ఓ వెంకట రెడ్డి, డి.ఆర్.డి.ఓ నర్సింహులు, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కూనంనేనిపై పిటిషన్ కొట్టివేత : ఎఐటియుసి నేతల సంబరాలు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు నందులాల్ అగర్వాల్ తక్షణమే క్షమాపణ చెప్పాలి




**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ ప్రతినిధి:** కొత్తగూడెం గడ్డపై తాడిత పీడిత జనాల పక్షాన కార్మిక కర్షకుల ప్రజా గొంతుకై అసెంబ్లీ లోపల, బయట గర్జించే సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు విజయాన్ని జీర్ణించుకోలేకనే తప్పుడు పద్ధతిలో ఎన్నికల అనర్హత పిటిషన్ దాఖలు చేశారని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్ ఆరోపించారు. కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పై నందులాల్ అగర్వాల్ వేసిన ఎన్నికల అనర్హత పిటిషన్‌ను తెలంగాణ హైకోర్టు కొట్టివేతను హర్షం వ్యక్తం చేస్తు సోమవారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో మిఠాయిలు స్వీట్లు పంచి పెట్టి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా పి.సురేష్ మాట్లాడుతూ కామ్రేడ్ కూనంనేని సాంబశివరావు సిపిఐ ఏఐటీయూసీ జెండా ఎత్తుకుని నిత్యం తాడిత పీడిత జనాల పక్షాన నిలబడి ఎన్నో నిర్బంధాలు అటుపోట్లు ఎదుర్కొన్నాడన్నారు. 2024 సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన సిపిఐ అభ్యర్థిగా కొత్తగూడెం నియోజకవర్గం నుండి ఎన్నికల బరిలో నిలబడి 30 వేలకు పైగా భారీ మెజార్టీతో గెలుపొందారని అన్నారు. ఈ విజయాన్ని చూసి ఓర్వలేక కొత్తగూడెంకు చెందిన నందులాల్ అగర్వాల్ ఎన్నికల అఫిడవిట్‌పై వక్ర బుద్ధితో పిటిషన్ దాఖలు చేశారని ఆ పిటిషన్‌పై హైకోర్టు సుదీర్ఘంగా విచారణ జరిపి నేడు ఎలాంటి ఆధారాలు లేవని తేల్చి అనర్హత పిటిషన్ కొట్టివేసిందని అన్నారు. తక్షణమే నందులాల్ అగర్వాల్ కూనంనేని సాంబశివరావుకి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు దేవానంద్, బాలకొటి, యాదయ్య, రామకృష్ణ, గంగాధర్ పాల్గొన్నారు.


## పేదప్రజల జీవనమార్పునకు నాంది పలికింది ఎర్రజెండానే



### సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా


**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** దోపిడి అణచివేతకు గురవుతూ దుర్భరజీవితాలను పేదప్రజల జీవనమార్పునకునాంది పలికిన ఆధునికతవైపు నడిపించినది సిపిఐ ఎర్రజెండానే అని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎం.బాల్‌నర్సింహ్మా అన్నారు. సోమవారం తాడూరు మండలం నాగదేవుపల్లి గ్రామంలో సిపిఐ గ్రామశాఖ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణం కమ్యూనిస్టుల అంతిమ లక్ష్యమని అన్యాయం దోపిడి అణచివేత ఉన్నంతకాలం ఎర్రజెండా సిపిఐ ఉంటుందన్నారు. పేదలపక్షాన నిలబడి అనేక పోరాటాలకు కమ్యూనిస్టుపార్టీ సిపిఐ నాయకత్వం వహించి వేల ఎకరాల భూమిపేదలకు పంచిందన్నారు. ప్రజలను చైతన్యవంతంచేసి ప్రశ్నించే పోరాడేతత్వాన్ని నేర్పిందన్నారు. కమ్యూనిస్టులు లేకుండా చేయాలని కుట్రలు చేసిన వారిని ఇండ్లకే పరిమితం చేసిన పోరాటపటిమ నాగర్‌కర్నూల్ ప్రాంత ప్రజలదన్నారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నాయని అన్నారు. రేషన్‌కార్డులు, కొత్తపింఛన్ల ప్రస్తావనేలేదని పింఛన్లు పెంచి ఇస్తామన్న హామీని నెరవేర్చలేదన్నారు. మరెన్నో సమస్యల ఉద్యమాలకు సిపిఐ సిద్ధంగా ఉన్నదని ప్రజలందరూకూడా సన్నద్ధంకావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు వార్లవెంకటయ్య, సిపిఐ జిల్లాకార్యవర్గసభ్యులు కొమ్ముభరత్, సిపిఐమండల కార్యదర్శి కుత్బుద్దీన్, సిపిఐజిల్లా సమితిసభ్యులు శివశంకర్, సిపిఐ గ్రామకార్యదర్శి రాముడు, సిపిఐ జిల్లానాయకులు శివకృష్ణ, గ్రామనాయకులు మాసన్న, కొమ్ముజంగయ్య, బారుసావులు, వెంకటయ్య, శంకర్, కిరణ్, హన్మంతు, ఎల్లయ్య, జయమ్మ, ఈశ్వరమ్మ, అలివేలు, బంగారయ్య, బాలస్వామి పాల్గొన్నారు.

## ఫిర్యాదులు సత్వరమే పరిష్కరించాలి



**ప్రజాపక్షం/నారాయణపేట్ :** ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టర్ ఛాంబర్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 32 ఫిర్యాదులు అందాయి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. అర్జీదారుల దరఖాస్తులలో పేర్కొన్న సమస్యలపై క్షణ్ణంగా పరిశీలించి, వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో 32 దరఖాస్తులు స్వీకరించగా వాటిని వెంటనే సంబంధిత అధికారులకు బదిలీ చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సంచిత్ గంగ్వార్ జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలన అధికారి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ఫిర్యాదులు పెండింగ్‌లో ఉంచరాదు



### జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**ప్రజాపక్షం/ నారాయణపేట్ :** జిల్లాలోని ప్రజా ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని, ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లో పెండింగ్లో ఉంచరాదని, ప్రజలకు తక్షణమే న్యాయం అందించి పోలీస్ వ్యవస్థపై నమ్మకం భరోసా కలిగేలా విధులు నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. ప్రతి సోమవారం జిల్లా ఎస్పీ ప్రధాన కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా సోమవారం ఉదయం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 08 మంది ఫిర్యాదులను జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ పరిశీలించి సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యక్షంగా ఫోన్లో మాట్లాడి వెంటనే ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని తగిన సలహాలు సూచనలు ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ. పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు అందిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయలని తదుపరి కేసు విచారించి పరిష్కరించాలని తెలిపారు. ప్రజలు అత్యవసర సమయంలో డయల్ 100 కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ తెలిపారు.

## నూతన గ్రామకమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/నాగర్‌కర్నూల్‌ప్రతినిధి :** నందివడ్డెమాన్ గ్రామంలో సిపిఐ శాఖ మహాసభ జరిగింది. ఈ శాఖ మహాసభ సమావేశం సాయిలు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లాకార్యవర్గసభ్యులు ఈర్ల చంద్రమౌళి, మండల కార్యదర్శి పి.కృష్ణాజి పాల్గొని మాట్లాడుతూ సిపిఐపార్టీ వందసంవత్సరాలు పూర్తిచేసుకుందన్నారు. 1925 డిసెంబర్ 26న కాన్పూర్‌లో ఆవిర్భవించిందన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో దున్నేవాడికే భూమి ఇవ్వాలని ఉండే వారికే ఇల్లు ఇవ్వాలని కమ్యూనిస్టుపార్టీ పోరాడిందన్నారు. ఆపోరాటంలో ఎంతోమంది అమరులయ్యారని అన్నారు. 10లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన ఘనత సిపిఐపార్టీది అన్నారు. అనంతరం నందివడ్డెమాన్‌గ్రామంలో ఏకగ్రీవంగా 9మందితోపాటు గ్రామకమిటీని ఎన్నుకున్నారు. గ్రామకార్యదర్శిగా ఉషమ్మ, సహాయ కార్యదర్శిగా తిరుపతమ్మ, కోశాధికారిగా సాయిలు, కమిటీ మెంబర్ బాలీశ్వరమ్మ, కమిటీ మెంబర్లుగా ఎల్లయ్య, ఆంజనేయులు, రాజులను ఎన్నుకున్నారు.

## పునరావాసం కల్పించండి

**ప్రజాపక్షం/చండూరు:** నల్లగొండ జిల్లా చండూరు మండలం బంగారిగడ్డ గ్రామంలో ఇటీవల ఆర్ అండ్ బి అధికారులు రోడ్డు వెడల్పు కార్యక్రమంలో భాగంగా 66 ఫీట్ల రోడ్డు ఉండే విధంగా మార్కింగ్ చేశారు. ఈ విధంగా ఉంటే ఆ పరిధిలో రోడ్డు వెంబడి ఉన్న ఇండ్ల కుటుంబాలు ఇండ్లు కోల్పోతున్నారని వారికి పునరావాసం కల్పించాలని కోరుతూ సోమవారం నల్లగొండలోని గ్రీవెన్స్‌డేలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతి పత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ ఇండ్లు కోల్పోతున్న



వారికి న్యాయం జరిగే విధంగా చూస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

## ఉరేసుకొని యువతి ఆత్మహత్య

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉరి వేసుకోని యువతి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలోని యాద్గార్‌పల్లి గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. మిర్యాలగూడ రూరల్ ఎస్ఐ లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని వెంకటాద్రిపాలెం గ్రామ పరిధిలో జంకుతండాలో గల రాజీవ్‌నగర్‌కు చెందిన బుడిగపాక శోభ తన కూతురు దివ్య(23)ను నాలుగు సంవత్సరాల క్రితం యాద్గార్‌పల్లి గ్రామానికి చెందిన బొంత వెంకటేష్ అనే వ్యక్తి ప్రేమించి పెళ్లి చేసుకోగా వారికి పాప, బాబు సంతానం కలిగారు. కాగా గత రెండు సంవత్సరాల నుంచి వెంకటేష్ వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకోగా ప్రశ్నించిన దివ్యను నువ్వు కట్నం తేలేదు, తక్కువ కులస్థురాలివి అని దూషిస్తూ ఇబ్బందులకు గురి చేస్తుండేవాడు. దీంతో మానసికంగా కుంగిపోయిన దివ్య సోమవారం ఉదయం 8.30గంటల సమయంలో ఇంట్లో ఎవరూలేనిది చూసి తన చీరతో ఉరి వేసుకోని మృతిచెందింది. కాగా మృతురాలి తల్లి శోభ ఇచ్చిన ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.





## ప్రభుత్వ పథకాల్లో పైరవీలకు తావులేదు

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల అమలులో పైరవీలకు తావులేదని, అర్హులైన లబ్ధిదారులు ఎవ్వరుకూడా ఏ పైరవీదారునికి, ఏ ఒక్క నాయకునికి డబ్బులు ఇయ్యాల్సిన అవసరం లేదని, ప్రతి పేదోనికి న్యాయం జరగాలనేదే ప్రభుత్వ లక్ష్యమని, ఎవరైనా పైరవీలకు పాల్పడితే వారిపై చర్యలు తీసుకుంటామని ఆలేరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య అన్నారు. తుర్కపల్లి మండల కేంద్రంలో రంగా కన్వెన్షన్ హాల్లో మండలానికి చెందిన 276 మందికి ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్లు, 133 కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలేరు నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నానని అన్నారు. తెలుపుతున్నట్లు సభను విజయవంతం చేసినందుకు అందరికీ రుణపడి ఉంటారని అన్నారు. నియోజకవర్గానికి ప్రభుత్వం 3500 ఇండ్లు మంజూరు చేసిందని, అందులో 500 ఇండ్లను తుర్కపల్లి మండలానికి కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలేరు మార్కెట్ కమిటీ చైర్పర్సన్ అయినాల చైతన్య మహేందర్‌రెడ్డి, మండల స్పెషల్ ఆఫీసర్ మోతిలాల్, తహసిల్దార్ దేశనాయక్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

జిల్లా కలెక్టర్ తేజస్‌నంద్‌లాల్ పవార్





**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్:** బడిఈడు పిల్లలందరిని బడిలోనే ఉంచాలని, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జూన్ 12 ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో రూపొందించిన గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైనందున బడిఈడు పిల్లలందరిని పాఠశాలలో చేర్పించాలని ఎవరు కూడా పనిప్రదేశంలో ఉండవద్దని, బాలలను ఎవరైనా పనిలో పెట్టుకుంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలిపారు. బడి బాట కార్యక్రమం ప్రారంభమైనందున ప్రజలు, తల్లిదండ్రులు, అధికారులందరూ కలిసి నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ జరిగే విధంగా కృషి చేసి సూర్యాపేట జిల్లాను బాలకార్మిక రహిత జిల్లాగా రూపొందించడానికి కృషి చేయాలనితెలిపారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నర్సింహరావు, ఎయిడ్ సంస్థ జిల్లా కోర్డినేటర్ శ్రీనివాస్, కమ్యూనిటి సోషల్ మొబిలైజర్లు వగ్గు సోమయ్య పాల్గొన్నారు.

## మంత్రివర్గ విస్తరణలో బిసిలకు అన్యాయం

బిసినేత ధనుంజయనాయుడు



**ప్రజాపక్షం/కోదాడ (చిలుకూరు):** తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ కూర్పులో బిసిలకు తీరని అన్యాయం జరిగిందని బిసి హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్రప్రధాన కార్యదర్శి దూళిపాళ ధనుంజయనాయుడు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం ఆయన చిలుకూరు మండల కేంద్రంలో బిసి హక్కుల సాధన సమితి కార్యాలయంలో ఆ సఘ మండల ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మంత్రివర్గ విస్తరణ పట్ల అదిగో ఇదిగో అంటూ కాలయాపన చేస్తూ ఎట్టకేలకు మంత్రివర్గ విస్తరణ చేసిందని తీరా చూస్తే మంత్రివర్గంలో జనాభా ప్రతిపాదికన తగు న్యాయం, సమన్యాయం జరగలేదని, 56 శాతం ఉన్న బిసిలకు కేవలం ఒక్క మంత్రి పదవిని మాత్రమే ఇచ్చారని అది బిసిలలో అధిక జనాభా ఉన్న మున్నూరు కాపులకు మొండి చేయి చూపిందన్నారు. నూతన మంత్రివర్గంలో మరో రెండు పదవులు బిసిలకు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిసి హక్కుల సాధన సమితి జిల్లా అధ్యక్షులు చిలకరాజు శ్రీను, ప్రధాన కార్యదర్శి పిల్లుట్ల కనకయ్య, కాసాని అంజయ్య, కొండా శివరాం, కట్టెకోల రమేష్, పోలేబోయిన రాములు పాల్గొన్నారు.

## పనిచేయని అటవీ శాఖ తనిఖీ కేంద్రాలు

ప్రభుత్వ ఆదాయానికి గండి

**ప్రజాపక్షం/నందికొండ:** కొద్దిరోజుల క్రితం నాగార్జునసాగర్ టైగర్ టైగర్ రిజర్వ్ ఫారెస్ట్ ఆధ్వర్యంలో మూడు తనిఖీ కేంద్రాలను ప్రారంభించగా అవి స్థానిక అటవీ శాఖ కార్యాలయం వద్ద ఒకటి హైదరాబాద్ రోడ్డులోని లెఫ్ట్ కెనాల్ బెత్తెలతండ వద్ద మరొకటి అదేవిధంగా నల్లగొండ రోడ్డు సమ్మక్క సారక్క ఫ్లై ఓవర్ సమీపంలో నిర్వహిస్తున్న అటవీ శాఖ తనిఖీ కేంద్రాలు ఉండగా వాటిలో సాగర్ అటవీశాఖ కార్యాలయం వద్ద ఉన్న తనిఖీ కేంద్రాలు గత నాలుగు రోజుల నుంచి పని చేయడం లేదు.ఆధునిక సాంకేతికతను ఉపయోగించడం ద్వారా తనిఖీలను మరింత సమర్థవంతంగా నిర్వహించాలనే ఉద్దేశంతో వీటిని ఏర్పాటు చేశారు.ఫాస్ట్ టాగ్ ద్వారా పని చేసేఈ చెక్ పోస్ట్ భారీ వాహనాలకు 80vతేలిక పాటి వాహనాలకు 50 రూపాయలు వసూలు చేస్తున్నారు. రోజుకు ఈ రోడ్డు మార్గం గుండా భారీ నుంచి తేలికపాటి వాహనాలు సుమారు 300 నుంచి 400 వందల వరకు ప్రయాణిస్తూ ఉంటాయి ఆ రెండు చెక్ పోస్ట్ లు పనిచేయకపోవడంతో ప్రభుత్వ ఖజానా కు నష్టం భారీగానే వాటిల్లితుంది.

**సాంకేతిక సమస్యలతో తాత్కాలికంగా మూసివేత:ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రాఘవేంద్రరావు**

తనిఖీ కేంద్రం వద్ద విద్యుత్ సరఫరా లో హెచ్చుతగ్గుల వలన అంతరాయం ఏర్పడటంతోఆనెన్‌లో వాహనాలను స్కాన్ చేసి నమోదు చేసే పరికరాలు కాలిపోవడంతో తనిఖీ కేంద్రాలను తాత్కాలికంగా మూసివేయడం జరిగింది. పరికరాలను రిపేర్ కోసం బెంగుళూరు పంపించాము. అవి వచ్చిన వెంటనే తనిఖీ కేంద్రాలను యథాతథంగా కొనసాగించడం జరుగుతుంది.



## రైతుపై ఆర్థిక భారం పడకుండా ఇందిర సౌర గిరి జల వికాసం

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్:** విద్యుత్తు వినియోగం లేకుండా, రైతుపై ఏలాంటి ఆర్థిక భారం పడకుండా ఇందిర సౌర గిరి జల వికాస పథకం ఉపయోగపడుతుందని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. గతంలో ఈ పథకాన్ని ఇందిర జలప్రభ, తదితర పేర్లతో అటవీ ప్రాంతంలోని గిరిజన రైతులకు అమలు చేయడం జరిగిందని, అయితే విద్యుత్తు ద్వారా బోర్లతో సాగునీటిని అందించే పద్ధతి ఉండేదని, ఇందిర సౌర గిరి జల వికాస పథకం కింద రైతులకు ఇలాంటి ఇబ్బందులను తొలగించడం, ముఖ్యంగా ఆర్థిక భారాన్ని తగ్గించేందుకు ఈ ఇందిర సౌర గిరిజల వికాస పథకం దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలోని గిరిజన ప్రాంతాలైన దేవరకొండ, మిర్యాలగూడ తదితర గిరిజన ప్రాంతాలలోని 14 మండలాలలోఈ పథకాన్ని అమ లు చేసేందుకు ప్రణాళిక రూపొందించడం జరిగిందని తెలిపారు. గుర్తించిన ఈ 14 మండలాల్లో సుమారు 6800 మంది గిరిజనులను ఇందిర సౌర గిరి జల వికాస పథకానికి గుర్తించడం జరిగిందని,ఆర్ఓఎఫ్ఆర్ కింద గిరిజనులకు పంపిణీ చేసిన భూముల్లో ఈ పథకం కింద సాగు చేసుకునే అవకాశం ఉన్నట్లు ఆమె వెల్లడించారు.ఈ పథకం కింద ఒక యూనిట్‌కు 6 లక్షలు ఖర్చు చేయడం జరుగుతుందని, ఆర్ ఓ ఎఫ్ ఆర్ పట్టా పొందిన, రెండున్నర ఎకరాల పొలం ఉన్న గిరిజన రైతులకు సోలార్ యూనిట్ ను ఇవ్వడం జరుగుతుందని, మొదటి సంవత్సరం జిల్లాలో 270 మంది గిరిజనులకు ఈ పథకం అమలు చేసేందుకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు. ఇన్చార్జి జిల్లా రెవెన్యూ అధికారి వై.అశోక్ రెడ్డి, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్ ఉన్నారు.



### 10 నుండి 17 వరకు అమ్మ మాట అంగన్‌వాడీ బాట

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 10 నుండి 17 వరకు అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా పెద్ద ఎత్తున నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. ఈ సందర్భంగా 3 సంవత్సరాలలోపు పిల్లలను బడిలో చేర్పించే కార్యక్రమంలో గ్రామ పంచాయతీలు ,గ్రామ ప్రజలను భాగస్వాములను చేయాలని తెలిపారు.ఈనెల 10 న అమ్మ మాట అంగన్వాడి బాట ప్రారంభానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను చేయాలని ఆమె జిల్లా సంక్షేమ అధికారిని, అంగన్వాడీ కేంద్రాల నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమానికి తల్లి దండ్రులతో పాటు, గ్రామ పెద్దలు అందర్నీ భాగస్వాములను చేయాలని చెప్పారు.

## ప్రజావాణి దరఖాస్తులు పెండింగ్ ఉండొద్దు

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంతరావు



**ప్రజాపక్షం/యాదాద్రి :** వివిధ ప్రాంతాల ప్రజల సమస్యల నుండి వచ్చిన దరఖాస్తులను పెండింగ్ లేకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 41 ఆర్జీలను జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు తో కలసి స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 28, జిల్లా పరిషత్ 4, మున్సిపాలిటీ 3, జిల్లా పంచాయతీ శాఖ 2, హౌసింగ్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, పశు వైద్య శాఖ, ఎస్సీ కార్పొరేషన్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభా రాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### చట్టపరంగా చర్యలు తీసుకుంటాం : ఎస్‌పి



**ప్రజాపక్షం/సూర్యాపేట:** శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ప్రజా సమస్యలు పరిష్కరిస్తూ బాధితులకు అండగా ఉంటూ ఫిర్యాదులపై వెంటనే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్‌పి కె.నర్సింహా అన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజావాణి సందర్భంగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి అర్జిలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫిర్యాదుదారులకు బరోసా కల్పించాలని, ప్రతి అంశాన్ని చట్ట పరిధిలో పరిష్కరించడంలో బాధితులకు న్యాయం చేయడంలో వేగంగా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులను అదేశించారు.

### ప్రజావాణి లో 52 దరఖాస్తుల స్వీకరణ

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల ప్రతినిధి:** ప్రజా సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను సత్వరమే పరిశీలించి పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బి.ఎం సంతోష్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు లక్ష్మీ నారాయణ, నర్సింగరావు లతో కలిసి జిల్లా కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారులు దరఖాస్తులలో పేర్కొన్న సమస్యలపై క్షుణ్ణంగా పరిశీలించి వెంటనే పరిష్కరించుటకు తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో మొత్తం 52 దరఖాస్తులు అందాయని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.





## 20.531 లక్షలు మొక్కలు నాటాలి

యాదాద్రి జిల్లా కలెక్టర్ హనుమంత రావు

వన మహోత్సవం శాఖల సమన్వయంతో విజయవంతం చేయాలి

**ప్రజాపక్షం/యాదాద్రి :** వన మహోత్సవాన్ని అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్నారు. సోమవారం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం మందిరంలో డిఎఫ్ఓ పద్మజా అధ్యక్షతన జరిగిన సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్ రావులతో కలిసి జిల్లా కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 20.531లక్షలు మొక్కలు నాటాలన్నారు. మొత్తం మొక్కలు నాటెందుకు సిద్ధం చేశారని తెలిపారు. డిఆర్‌డిఏ, అటవీ, అగ్రికల్చర్, హార్టికల్చర్, జిల్లా పంచాయతీ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, మున్సిపాలిటీ అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ తమకిచ్చిన లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. ఎక్సైజ్ శాఖ వారు ఈత వనాలను స్థలాలలో పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. నియోజకవర్గాల వారీగా మండలాల వారీగా ఒక రోజు పెద్ద మొత్తంలో మొక్కలు నాటే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటడానికి సరిపడే స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. వర్షాకాలం మొదలైనందున జూలై లోపే మొక్కలు పెద్ద ఎత్తున నాటాలని తెలిపారు ప్రజలకు ఉపయోగపడే లాంటి మొక్కలను నాటేలా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు మొక్కలు నాటిన రోజు నుండి చెట్లకి నీళ్లు పోసేందుకు పాదులు చేయాలనీ, ఎరువు వేయాలని, ప్రతిరోజు నీళ్లు పెట్టాలని, మొక్కలకి చుట్టూ ఫినిషింగ్ ఏర్పాటు చేయాలన్నారు. వర్షాలు కురుస్తున్నప్పుడు మొక్కలు నాటాలని అన్నారు. జిల్లాలోని అన్ని మొక్కలు నాటే ప్రదేశాలను గుర్తించి, ఆ ప్రదేశాలు టిజిఎఫ్ఎంఐఎస్ వెబ్సైట్‌లో జియోకోఆర్డినేట్‌లతో నమోదు చేయాలని ఆన్నారు. ఈ సమావేశంలో భువనగిరి రెవిన్యూ డివిజనల్ అధికారి కృష్ణా రెడ్డి, సీఈఓ శోభారాణి, డిఆర్‌డిఓ నాగిరెడ్డి, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## సిపిఐ సూర్యాపేట జిల్లా మహాసభలు సక్సెస్

డిసెంబర్ 26న సభకు రెండు లక్షల మంది జనసమీకరణ

మూడోసారి జిల్లా కార్యదర్శిగా ఎన్నుకున్న నాయకులకు ధన్యవాదాలు : బెజవాడ వెంకటేశ్వర్లు

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** సూర్యాపేట జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన సిపిఐ జిల్లా మహాసభ విజయవంతమైందని ఈ మహాసభల్లో మూడోసారి తనను జిల్లా కార్యదర్శిగా ఎన్నిక చేసిన రాష్ట్ర కమిటికి, నాయకులకు, కార్యకర్తలకు సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు ధన్యవాదాలు తెలిపారు. సోమవారం స్థానిక ధర్మబిక్షం భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిసెంబర్ 26న ఖమ్మంలో సిపిఐ 100 సంవత్సరాల ఉత్సవాలు జరగనున్నాయని ఈ సభలకు రెండు లక్షల వరకు జన సమీకరణ చేస్తామన్నారు. ఈ మహాసభలకు జాతీయ, అంతర్జాతీయ వ్యాప్తంగా ప్రతినిధులు రానున్నారని తెలిపారు. సిపిఐ 4వ మహాసభలో గత కార్యక్రమాలను సమీక్షించుకుని పలు అంశాలపై తీర్మానించడం జరిగిందన్నారు. సూర్యాపేట జిల్లాకు ధర్మబిక్షం పేరు పెట్టాలని, మున్సిపల్ కార్పోరేట్ ప్రాంతాల్లో ఉపాధి హామీని కొనసాగించాలని, జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికి 200 రోజులు పని కల్పించి రోజు కూలి 700 రూపాయలు ఇవ్వాలన్నారు. కుల గణన చేపట్టి విద్య, వైద్య, ఉపాధి రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు కల్పించాలని, బిసిలకు 42శాతం రిజర్వేషన్ కల్పించిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. తెలంగాణలో ప్రసిద్ధి చెందిన జాన్‌పహాడ్‌కు బస్సు సౌకర్యం కల్పించాలని, స్థానిక పరిశ్రమల్లో స్థానికులకు 80శాతం ఉద్యోగాలు కల్పించాలని, మహిళ రిజర్వేషన్ బిల్లు అమలు చేయాలని, ప్రైవేట్ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని, పొడు భూముల రైతులకు హక్కు పత్రాలు ఇవ్వాలని, ఎన్‌ఎస్‌పి కాలువల్లో పూడిక తొలగించాలని, హుజూర్‌నగర్ రామస్వామిగుట్టపై నిర్మించిన ఇండ్లను అర్హులకు ఇవ్వాలని, అన్ని నియోజకవర్గాల్లో వంద పడకల ఆసుపత్రులను ఏర్పాటు చేయాలని తీర్మానించినట్లు తెలిపారు. సిపిఐ సూర్యాపేట జిల్లా సమితి ప్రత్యేక అహ్వానితులుగా గన్న చంద్రశేఖర్, కార్యదర్శిగా బెజవాడ వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులుగా యల్లావుల రాములు, దూళిపాళ ధనుంజయనాయుడు, మేకల శ్రీనివాస్, ఉస్తేల నారాయణరెడ్డి, యల్లంల యాదగిరి, మండవ వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, పోకల వెంకటేశ్వర్లు, కంబాల శ్రీనివాస్, బద్దం కృష్ణారెడ్డి, ఎస్‌కె లతీఫ్, దేవరం మల్లేశ్వరి, బత్తినేని హనుమంతరావు, బూర వెంకటేశ్వర్లు, గుండు వెంకటేశ్వర్లు, కార్యవర్గ ఆహ్వానితులుగా ఎస్‌కె సాయిబెల్లిలను ఎన్నుకున్నట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్రకార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జిల్లా నిర్మాణ సభ్యులు పల్లా వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొమ్మగాని ప్రభాకర్, గన్నా చంద్రశేఖర్, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో సిపిఐ పట్టణ కార్యదర్శి వెంకటేశ్వర్లు, మహిళ నాయకురాలు దేశగాని హేమలత, గురుస్వామి పాల్గొన్నారు.





## పిల్లల బంగారు భవిష్యత్తుకు విద్య నాంది

: ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి



**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** పిల్లల బంగారు భవిష్యత్తు కు నాంది విద్యనని విద్య లేని జీవితం అంధకారంలో ఉన్నట్టేనని ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి అన్నారు.మండల కేంద్రంలోనీ ఇటీవల నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల నూతన విద్యాలయ భవనాన్ని ఎమ్మెల్సీ ఎం సి కోటిరెడ్డి తో కలసి ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలోని నూతనంగా ఏర్పాటైన ఇంత చక్కటి బాలికల విద్యాలయాన్ని మూడు కోట్ల 33 లక్షల వ్యయంతో నిర్మించుకోవడం చాలా ఆనందంగా ఉంది అన్నారు. గతంలో అద్దె భవనాలలో అరకొర వసతులతో ఈ కేజీబీవీ స్కూలు నడిపించారన్నారు. ఈ పాఠశాలలో ముఖ్యం గా తల్లి , తండ్రి లేని అనాధ పిల్లలకు ప్రథమంగా చోటు కల్పించడమే ముఖ్య ఉద్దేశమని అన్నారు. ఈ పాఠశాలలో నాణ్యమైన విద్య బోధన, పౌష్టికాహారము, స్నాక్స్ లభిస్తుందని అన్నారు. స్కూల్ బిల్డింగ్ చుట్టూ ప్రహరీ గోడను, మెయిన్ రోడ్డు నుండి లింక్ రోడ్డును సి సి వేయుటకు వెంటనే నిధులను సమకూర్చి అట్టి నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కర్నాట లింగారెడ్డి, మాజీ ఎంపీపీ భగవాన్ నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కలసాని చంద్రశేఖర్ జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డం సాగర్ రెడ్డి,జడ్పిటిసి మాజీ సూర్య భాషా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణ నాయక్, దేవస్థాన కమిటీ చైర్మన్ శగం నాగిరెడ్డి, షాగం రాఘవరెడ్డి,వెంపటి శ్రీను పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యం

**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** కాంగ్రెస్ పార్టీతోనే సామాజిక న్యాయం సాధ్యమని యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ అన్నారు. సోమవారం యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కమిటి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి, ఎఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు చెవిటి వెంకన్నయాదవ్‌ల అదేశాలతో జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎఐసిసి అధ్యక్షులు ఖర్గే, సోనియాగాంధీ, రాహుల్‌గాంధీతో పాటు మంత్రివర్గ సభ్యుల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎలిమినేటి అభినయ్ మాట్లాడుతూ దేశ, రాష్ట్ర రాజకీయాల్లో సామాన్య కార్యకర్తలు, నాయకులకు, కుల మాతాలకు అతీతంగా కాంగ్రెస్ పార్టీ ఉన్నతమైన పదవులను కట్టబెట్టిందని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీలో అన్ని కులాల, మతాల వారికి సమానమైన ప్రాధాన్యత లభిస్తుందన్నారు. ఇటీవల జరిగిన మంత్రి వర్గ విస్తరణలో కాంగ్రెస్ పార్టీ పాటించిన సామాజిక న్యాయం దేశ రాజకీయాలకు ఆదర్శంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు అంజద్‌అలీ, నాయకులు కక్కిరేణి శ్రీనివాస్, కుమ్మరికుంట్ల వేణుగోపాల్, చింతమళ్ల రమేష్, రుద్రంగి రవి, సిరివెళ్ల శబరి, అలేటి మాణిక్యం, డిఆర్ ఉపేందర్ పాల్గొన్నారు.

## ప్రైవేటు విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టం

ఎఐఎస్ఎఫ్ డిమాండ్

ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల దోపిడీపై ఎఐఎస్ఎఫ్ రౌండ్ టేబుల్ సమావేశం

**ప్రజాపక్షం/జోగులాంబ గద్వాల :** జోగులాంబ గద్వాల జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేట్ విద్యా సంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర స్థాయి పిలుపు మేరకు సోమవారం సిపిఐ కార్యాలయంలో ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం ఎఐఎస్ఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి ప్రవీణ్ అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సమావేశానికి వివిధ విద్యార్థి సంఘాలతో పాటు పార్టీల సంఘాల నాయకులు హాజరైనారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నాగర్ దొడ్డి వెంకట్రాములు సిపిఐ జిల్లా కార్యదర్శి బి.ఆంజనేయులు హెచ్ఎమ్ శుభాన్ పార్టీ బిఆర్ఎస్వి కుర్వపల్లయ్య, టిపిఎఫ్ రాష్ట్ర కో కన్వీనర్ ప్రభాకర్, ఉపాధ్యక్షుడు నాగన్న ఐటిఐ కళాశాల ప్రిన్సిపల్ వాల్మీకి , హాజరై మాట్లాడుతూ జిల్లాలో ఉన్నటువంటి ప్రైవేటు విద్యాసంస్థల్లో ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలు ప్రతి విద్యా సంవత్సరం ఫీజులను ఇష్టానుసారంగా పెంచుతున్నారని అన్నారు. తల్లి దండ్రులు తమ పిల్లలను మంచి భవిష్యత్తు ఇవ్వడం కోసం ఇంగ్లీష్ మీడియం లో చదివించాలని అనుకున్న కూడా ఈ ప్రైవేట్ విద్యాసంస్థల్లో అధికంగా ఫీజు ఉండటం వలన వారు నిరాశ చెందవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. అలాగే రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థలో ప్రవేశపెట్టిన నిబంధనలను ఉల్లంఘించి ప్రైవేట్, కార్పోరేట్ విద్యా సంస్థల యజమాన్యం ప్రవర్తిస్తుందని, అడ్మిషన్ ఫీజు కళాశాల ఫీజు ఒకేసారి కట్టాలని విద్యార్థులని ఇబ్బందులకు గుర్తిచేస్తుంది అంతేకాకుండా నీట్ కోచింగ్ పేరుతో విద్యార్థుల దగ్గర్నుంచి అధిక ఫీజులు వసూల చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాల అవుతున్న విద్యా వ్యవస్థలో ఉన్న సమస్యలను పట్టించుకోకపోవడం ఏమిటినీ మండిపడ్డారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని లేని పక్షంలో పెద్ద ఎత్తు ఆందోళన కార్యక్రమాలు చేస్తాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పివైఎల్ అధ్యక్షులు దానయ్య, ఎఐఎస్ఎఫ్ నాయకుడు కాసిం, నరేష్ ఎఐటియుసి నాయకుడు రంగన్న, పిడిఎస్ యు జిల్లా అధ్యక్షుడు హరీశ్, బిఆర్ఎస్ నాయకులు వినోద్, కృష్ణారెడ్డి, ఆర్‌సిఎస్ ఉత్తనూర్ ఎంకన్న, వెంకటేష్ పాల్గొన్నారు.



# క్రీడ

# స్వదేశంలో వెస్టిండీస్, ఆస్ట్రేలియా సిరీస్..

## మ్యాచ్ వేదికల్లో మార్పులు.!



ఐపిఎల్ ముగియడంతో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లిన భారత జట్టు అనంతరం స్వదేశంలో వన్డే సిరీస్ ఆడనుంది. మహిళల జట్టు సైతం సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో తలపడనుంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి సోమవారం మ్యాచ్ వేదికలను ఖరారు చేసింది. అయితే.. షెడ్యూల్ ప్రకారం ముందస్తుగా కేటాయించిన మైదానాల్లో స్వల్ప మార్పులు చేసింది బీసీసీఐ. వెస్టిండీస్ పురుషుల జట్టు అక్టోబర్‌లో రెండు టెస్టుల సిరీస్ కోసం భారత పర్యటనకు రానుంది. ఇరుజట్ల మధ్య తొలి మ్యాచ్ అక్టోబర్ 2న అహ్మదాబాద్‌లో జరుగనుంది. అనంతరం 10వ తేదీన రెండో టెస్టు కోల్‌కతాలో జరగాల్సింది. కానీ, ఈ మ్యాచ్‌ను వేదికను ఢిల్లీకి తరలించింది బీసీసీఐ. నవంబర్ 14న భారత్, దక్షిణాఫ్రికాలు ఢిల్లీలోని అరుణ్ జైట్లీ మైదానంలో తొలి టెస్టు ఆడాల్సింది. కానీ, ఇప్పుడు ఆ మ్యాచ్‌కు కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదిక కానుంది.

### చిదంబరంలో కాదు

హర్మన్‌ప్రీత్ కౌర్ సారథ్యంలోని టీమిండియా స్వదేశంలో ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌లో అమీతుమీ తేల్చుకోనుంది. ఇంతకుముందు ఈ మూడు వన్డేల సిరీస్‌ను చెన్నైలోని చిదంబరం స్టేడియంలో నిర్వహించాలనుకున్నారు. కానీ, కానీ, అక్కడ పిచ్, ఔట్‌ఫీల్డ్ మరమ్మతు పనులు జరుగుతున్నందున వేదికను మార్చాలని బీసీసీఐ భావించింది. అందుకే వీటిలో తొలి రెండు మ్యాచ్‌లను ఛండీగఢ్‌లో, చివరి వన్డే ను ఢిల్లీలో జరపాలని బీసీసీఐ నిర్ణయించింది.

అలానే భారత 'ఏ' జట్టుతో దక్షిణాఫ్రికా 'ఏ' జట్టు మ్యాచ్‌ల వేదిక కూడా మారింది. నవంబర్ 13 నుంచి మూడు వన్డే మ్యాచులకు చిన్నస్వామి స్టేడియం ఆతిథ్యం ఇవ్వాల్సింది. అయితే.. ఈ మైదానం బదులు రాజ్‌కోట్‌లో సఫారీ ఏ జట్టుతో భారత కుర్రజట్టు తలపడనుంది.

# అందుకే కెప్టెన్సీని ఇష్టపడతా

## శ్రేయాస్ అయ్యర్



నాయకుడంటే ముందుండి నడిపించాలి. అనామకులతో కూడిన బృందాన్ని అద్భుతంగా తీర్చిదిద్దాలి. ఒక్కమాటలో చెప్పాలంటే.. ఒత్తిడిలోనూ ప్రశాంతంగా ఉంటూ, అందర్నీ సమన్వయం చేసుకుంటూ మునిగిపోతున్న నావను ఒడ్డుకు చేర్చేవాడే నిజమైన కెప్టెన్. ఈ మాటలు శ్రేయాస్ అయ్యర్‌కు అతికినట్టు సరిపోతాయి. తన నాయకత్వ పటిమతో 18వ సీజన్‌లో పంజాబ్ కింగ్స్ జట్టును ఫైనల్‌కు తీసుకెళ్లిన అయ్యర్ తాజాగా 'టీ20 ముంబై లీగ్'లోనూ తన ముద్ర వేశాడు. తన మార్క్ కెప్టెన్సీతో సొబో ముంబై ఫాల్కన్స్‌ను సెమీఫైనల్‌కు తీసుకెళ్లాడు. లీగ్ ఏదైనా సరే తన సారథ్యానికి తిరుగులేదని చాటుతున్న అయ్యర్.. కెప్టెన్సీని ఎంతో ఇష్టపడుతానని చెబుతున్నాడు. ఈ సొగసరి బ్యాటర్ ఇంకా ఏం చెప్పాడంటే..'నాకు కెప్టెన్సీ అంటే ఇష్టం. నాయకత్వం వహించే సమయంలో నాలోని అత్యుత్తమ సామర్థ్యాన్ని కనబరుస్తాను. సారథ్యం అనేది పరిణితితో కూడిన ఒక బాధ్యత. జట్టు కోసం ప్రతిసారి అత్యుత్తమంగా ఆడాల్సి వస్తుంది. అలానే జట్టు కష్టాల్లో ఉన్నప్పుడు అందరూ కెప్టెన్ వైపే చూస్తారు. అందుకే.. నేను లీడర్‌గా ఉండేందుకు ఇష్టపడుతా. 22 ఏళ్లప్పుడే తొలిసారి జట్టు పగ్గాలు అందుకున్నా. ఆ సమయంలో ఒక సారథికి ఎదురయ్యే సవాళ్లను నేర్పుగా అధిగమించాను.'నీ కెప్టెన్సీ రహస్యం ఏంటి ?' అని అందరూ అడుగుతుంటారు. వాళ్లకు నేను చెప్పేది ఒక్కటే.. నేను కూల్‌గా ఉంటాను. నా ముందున్న వనరుల్ని సద్వినియోగం చేసుకోవడంపైనే దృష్టి సారిస్తా. మ్యాచ్ జరుగుతున్నంత సేపు ఫోకస్‌గా ఉండేందుకు ప్రయత్నిస్తా. వర్తమానంలోనే ఉంటూ పరిస్థితులకు తగ్గట్టు నడుచుకుంటాను. స్టాండ్స్‌లోని అభిమానులను ఉత్సాహపరచడం, వాళ్లు నా పేరు మార్మోగిపోయేలా అరుస్తుంటే భలే మజాగా ఉంటుంది. ఫ్యాన్స్ మద్దతుతో మరింత స్ఫూర్తి పొందుతాను అని అయ్యర్ వెల్లడించాడు.

# బోణీ కోసం నిరీక్షిస్తున్న టీమిండియా



ఎఫ్ఐహెచ్ ప్రో లీగ్‌లో భారత పురుషుల జట్టుకు వరుసగా రెండో షాక్ తగిలింది. అలవోకగా గెలవాల్సిన మ్యాచ్‌లో అలసత్వం ప్రదర్శించిన టీమిండియా మరోసారి నెదర్లాండ్స్ చేతిలో చేజేతులా ఓడిపోయింది. శనివారం 12తో పరాజయం మూటగట్టుకున్న భారత్.. ఈసారి ఆఖరి నిమిషంలో గోల్ సమర్పించుకొన్న హర్మన్‌ప్రీత్ సింగ్ సేన విజయాన్ని చేజార్చుకుంది. దాంతో, లీగ్‌లో బోణీ కోసం నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. యూరప్ పర్యటనలో తొలి పోరులో నెదర్లాండ్స్‌పై ఓటమికి బదులు తీర్చుకోవాలనుకున్న భారత ఆటగాళ్లు రెండోమ్యాచ్‌లో దూకుడుగా ఆడారు. వందో మ్యాచ్ ఆడుతున్న అభిషేక్ 20వ నిమిషంలో గోల్ చేయగా ఆధిక్యంలోకి వెళ్లింది. కాసేపటికి నెదర్లాండ్స్ తరఫున తిజ్స్ వాన్ డామ్ (24వ నిమిషం) గోల్ సాధించగా స్కోర్లు సమం అయ్యాయి. తొలి గోల్‌తో పోటీలోకి వచ్చిన డచ్ జట్టుకు జెప్ హూడెమేకర్స్(33వ నిమిషం) రెండో గోల్ అందించాడు. 2 గోల్స్‌తో నెదర్లాండ్ విజయం దిశగా సాగుతున్న వేళ జుగ్‌రాజ్ సింగ్ 54వ నిమిషంలో పెనాల్టీ కార్నర్‌ను ప్రత్యర్థి గోల్ పోస్ట్‌లోకి పంపాడు. దాంతో.. మ్యాచ్ డ్రా అవుతుందనిపించింది. కానీ, డచ్ ప్లేయర్ జిప్ జన్‌సెన్(57వ నిమిషంలో) గోల్ చేయగా టీమిండియాకు ఓటమి తప్పలేదు.

**9 పెనాల్టీ కార్నర్స్** తొలి అర్ధ భాగంలోనే భారత్‌కు 9 పెనాల్టీ కార్నర్స్ లభించాయి. ఆట మొదలైన ఆరో నిమిషంలోనే గోల్ చేసే అవకాశం వచ్చినా అభిషేక్ సఫలం కాలేదు. కాసేపటికే శిలానంద్ లక్రా మిడ్‌ఫీల్డ్ నుంచి బంతిని ప్రత్యర్థి గోల్ పోస్ట్‌లోకి బంతిని పంపాలనుకున్నాడు. కానీ, బంతి బయటకు వెళ్లింది. ఆ తర్వాత కూడా ఛాన్స్‌లు వచ్చినా భారత స్టార్ ఆటగాళ్లు గోల్ చేయడంలో విఫలం అయ్యారు. తదుపరి మ్యాచ్‌లో జూన్ 11న అర్జెంటీనాతో టీమిండియా తలపడనుంది.

# యువతరంగం

## ఫోకస్

# యుద్ధం.. విధ్వంసకారకం

ఎప్పుడైనా... ఎక్కడైనా... యుద్ధం విధ్వంసకారకమే అవుతుంది. ప్రపంచ చరిత్రను తిరగేస్తే, యుద్ధాలు మనిషి ఆవిర్భావం నాటి నుంచీ కొనసాగుతూనే ఉన్నాయనే విషయం స్పష్టమవుతుంది. ఆ యుద్ధాలకు వ్యతిరేకంగా ఎంతో మంది గొప్పవాళ్లు వేదనతో వేదనలు చెప్పినా, ఇప్పటికీ ఆయుధాల మోత ఆగలేదు. ఈ మానవ నిర్మిత సంక్షోభాల్లో అత్యధికంగా ఇబ్బంది పడే వర్గం యువత.



శక్తితో, ఆశతో, కలలతో నిండిన వారు... అనుకోకుండా యుద్ధపు ఆరాటాల్లో బలవుతుంటారు. వారికి బుల్లెట్ల మోతలు బాల్యాన్ని నాశనం చేస్తాయి, బాంబుల కేకలు భవిష్యత్తుపై నీడలు మోస్తాయి. యుద్ధాల వల్ల మొదటి దెబ్బ విద్యపై పడుతుంది. యుద్ధం మొదలైన వెంటనే అక్కడి విద్యా వ్యవస్థ నిలిచిపోతుంది. పాఠశాలలపై బాంబులు పడతాయి, విద్యార్థులు ప్రాణభయంతో పాఠశాలలకు కూడా వెళ్లరు. జనావాసాలు, ఆసుపత్రులు, విద్యా సంస్థలపై దాడులు చేయరాదన్న యుద్ధ నియమాల ఉల్లంఘన నిరాటంకంగా కొనసాగుతునే ఉంటుంది. గాజాలోని పాఠశాలలపై ఇజ్రాయెల్ వైమానిక దాడులు చేయడం, వందలాది మంది ప్రాణాలు కోల్పోవడం మన కళ్ల ముందు కనిపిస్తున్న సత్యం. యుద్ధాల కారణంగా విద్యాలయాలు మూతపడతాయి. ఉపాధ్యాయులు ఆ ప్రాంతం విడిచి వెళ్లిపోతారు. ఇంటర్నెట్, విద్యా వనరులు కూడా నిలిచిపోతాయి. ఉదాహరణకు యుక్రెయిన్‌లో 2022 తరువాత వేలాది మంది విద్యార్థులు ఆన్లైన్ విద్యను కొనసాగించలేక విద్యను మానేశారు. యుద్ధ సమయాల్లో దేశంలోని యువతను సైనికులు నియమించడం పరిపాటి. చాలా సందర్భాల్లో యువతకు నిర్బంధ సైనిక సేవ అనివార్యమవుతుంది. సరైన శిక్షణ, నైపుణ్యం లేనికారణంగా, వీరే శత్రు దాడుల్లో ఎక్కువగా గాయపడతారు. మందుల కొరత వల్ల చికిత్స లేక చనిపోతారు. ఆయుధాలు పట్టే చేతులు, ఒకప్పటికి పుస్తకాలు పట్టినవే కావడం తీవ్ర విషాదం. యుద్ధం మానవ మనస్సును చిదిమేస్తుంది. యువతలో మానసిక ఆరోగ్యం తీవ్రంగా దెబ్బతింటుంది. నిరంతరం భయాందోళన వెంటాడుతుంది. కుటుంబాలకు దూరం కావడంతో, ఒంటరితనం వేధిస్తుంది. ఆత్మహత్యలు పెరుగుతాయి. యుద్ధం జరిగే ప్రాంతాల నుంచి లక్షలాది మంది యువత ఇతర దేశాల్లోకి శరణు వెళ్లడం జరుగుతున్నది. ఇక, బాల్యానికి బదులు బాంబులతో పిల్లల సహవాసం అత్యంత దారుణం. వారు తినే ఆహారం, దుస్తులు, ఆరోగ్య సదుపాయాలు అన్నీ అంతంత మాత్రమే. వివిధ దేశాల్లో యుద్ధ సమయంలో బాల సైనికులను నియమించడం ఒక దుర్మార్గపు పద్ధతిగా మారింది. కాంగోలో బాల సైనికుల సంఖ్య లక్షకు పైగా ఉండేది. 10 ఏళ్ల పిల్లల చేతుల్లో ఎకె47లు ఉండేవి. యువతుల పరిస్థితి కూడా భయంకరంగానే ఉంటుంది. లైంగిక దాడులు.. అక్రమ గర్భధారణలు జోరందుకుంటాయి. మానవ అక్రమ రవాణా సాధారణమైన విషయంగా మారుతుంది. అవకాశాలుగా ఉండాల్సిన యుక్తవయసు, అపహాస్యమవుతుంది. స్థూలంగా చెప్పాలంటే యుద్ధాలు అన్ని వర్గాలను దెబ్బతీస్తాయి. ముఖ్యంగా యువత కోలుకోలేని దెబ్బ తింటుంది. ఆర్థిక వ్యవస్థ నాశనమవుతుంది. నిరుద్యోగం విలయతాండవం చేస్తుంది. పరిశ్రమలు మూతపడతాయి. వ్యవసాయ భూములు ధ్వంసమవుతాయి. ఆధునికత ఊసే ఉండదు. అభివృద్ధి ఎక్కడా కనిపించదు. క్రీడలు, కళలు, సాహిత్యం.. ఇలా అన్నింటా చిమ్మచీకట్లే.. క్రీడాకారులు తుపాకులు మోస్తారు. కళాకారులు శరణార్థుల శిబిరాల్లో పాడుతారు. రచయితలు శోకగీతాలు రాస్తారు. యువత అభివ్యక్తికి మార్గాలు కరవై, దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతుంటారు. సిరియాలో యుద్ధం వల్ల యువత చదువుకోలేక, బాల సైనికులుగా మారారు. వారి కోరికలన్నీ శ్మశానంలో కలిసిపోయాయి. పాలస్తీనాపై జరుగుతున్న నిరంతర దాడులతో యువత జీవితాన్ని ప్రారంభించలేకపోయారు. వారిని ప్రపంచం చిన్న చూపుతో చూస్తోంది. సూడాన్, ఇరాక్, లిబియా వంటి దేశాల్లో ఆయుధాలు మాత్రమే మాట్లాడే భాష. అక్కడ యువత మౌనం తప్ప సాధించిందేమీ లేదు. ఉక్రేన్‌లో కాలేజీ విద్యార్థులు రంగులో కళలు కాక, రక్తం చూశారు. అక్కడి కళాశాలలు కూలిపోయినప్పుడు కలలూ కూలిపోయాయి. ప్రస్తుత కాలంలో జరుగుతున్న యుద్ధాల్లో చాలా వరకూ నివారించతగినవే కావడాన్ని ఇక్కడ ప్రత్యేకంగా ప్రస్తావించుకోక తప్పదు. వివిధ దేశాలు ఆధిపత్య ధోరణలను విడిచిపెట్టి, యుద్ధం కాకుండా మౌలిక సంస్కరణలపై దృష్టి పెట్టాలి. యువతకు మానసిక వైద్య సేవలు అందించాలి. శరణార్థులకు న్యాయమైన జీవిత అవకాశాలు ఇవ్వాలి. యువతను శాంతి ప్రతినిధులుగా తీర్చిదిద్దాలి. యుద్ధం మానవతకు చేటు. కానీ అది యువతను తినేస్తే, అది భవిష్యత్తునే అంధకారంలో నెట్టివేస్తుంది. యువత కన్నీళ్లు కాదు, నవ్వుల కోసం పుట్టింది. బాంబుల దుమ్ములో వారు కనపడకపోయినా, వారి చాటుకున్న బాధలు ప్రపంచం వినాలి. ప్రపంచం వారి కోసం స్పందించాలి. వారికి తుపాకులు కాకుండా పుస్తకాలు కావాలి. వారు శిబిరాల్లో కాదు.. విద్యాలయాల్లో ఉండాలి. – శాస్త్రాల మందిరాల్లో ఉండాలి. వారు కన్నీళ్లలో కాక.. కలల్లో.. కళల్లో తేలాలి. ఆ రోజు వస్తుందని ఆశిద్దాం.

# మధ్యాహ్న భోజన కార్మికులకు సమాన పనికి సమాన వేతనం

## సంఘం రాష్ట్ర యూనియన్ డిమాండ్

## కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా, వినతిపత్రాల అందజేత




**ప్రజాపక్షం/జయశంకర్ భూపాలపల్లి ప్రతినిధి :** ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు సమానపనికి సమాన వేతనం ఇవ్వాలని, నాలుగు నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొరిమి సుగుణ డిమాండ్ చేశారు. వంట కార్మికుల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా నిరసన తెలిపి సోమవారం జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయం ఎదుట మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి (అనుబంధం) ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ధర్నా నిర్వహించారు. అనంతరం అదనపు కలెక్టర్ అశోక్‌కుమార్, డిఇఒ రాజేందర్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కొరిమి సుగుణ మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా వంట బిల్లులు ఇవ్వలేదని, కోడిగుడ్లు, అల్పాహార బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. పాఠశాలలు ప్రారంభమవుతున్న తరుణంలో మధ్యాహ్న కార్మికులకు బిల్లులు రాక ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్నారని, వెంటనే ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించి మధ్యా హ్నం భోజన కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వరలక్ష్మి, ఉమాదేవి, బెల్లంకొండ స్వప్న, సంబడి చంద్రక్క, వేముల రాజేశ్వరి, సమత, సరోజన, కళావతి, మమత, వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**ములుగు :** పాఠశాల వంట కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు విడుదల చేయాలని మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ డిమాండ్ చేశారు. యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ములుగు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ముత్యాల రాజు, సంఘం జిల్లా అధ్యక్షురాలు సామల రమ, పోరెడ్డి ప్రమీల,గడ్డం భారతి, లక్ష్మి, పిసమ్మక్క, జమున, సుశీల, విజయ, చెంచులక్ష్మి, రమణ, వెంకటలక్ష్మి, రాజ్యలక్ష్మి, రాజకుమారి, పద్మ, షఫియా, జానకీ, జె లక్ష్మి, ఎం సరోజన, సుమతి, నర్సమ్మ, తులసి, కుమారి, వెంకటరమణ, రమాదేవి, ఫైమా, లావణ్య, నాగమణి పాల్గొన్నారు.

**పెద్దపల్లి :** మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు పెంచాలని, నాలుగు నెలల పెండింగ్ బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేస్తూ పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ఎఐటియుసి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో ఎఐటియుసి పెద్దపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి సునీల్, యూనియన్ జిల్లా కార్యదర్శి పూసల రమేష్, ఓదెల రమేష్, సిహెచ్ తిరుపతి, కళావతి, రాధమ్మ, పద్మ, భాగ్య. ఎండి ఎరిగాన, కాసర్ల పద్మ, మున్నాబి తదితరులు పాల్గొన్నారు.

**భువనగిరి రూరల్ :** మధ్యాహ్న భోజన కార్మికుల పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే విడుదల చేయాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి ఇమ్రాన్ డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకే కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపి కలెక్టర్ హనుమంతరావు, అదనపు కలెక్టర్ భాస్కర్‌రావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సామల శోభన్‌బాబు, మధ్యాహ్న భోజన వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు బాగుల వసంత, జిల్లా ప్రధానకార్యదర్శి ముంతాజ్ బేగం, అనసూర్య, పారిజాత, స్వేత, పూర్ణమా, రమ, లక్ష్మమ్మ, రమ, వరలక్ష్మి, రత్న, జాన్సీ, రూప, మున్ని, లక్ష్మి, రేణుక, వెంకటమ్మ, పారిజాత, పుష్ప, గంగమ్మ, తదితరులు పాల్గొన్నారు.







# ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం

## సిపిఐ సిద్దిపేట జిల్లా కార్యదర్శి మంద పవన్

**ప్రజాపక్షం/ సిద్దిపేట ప్రతినిధి :** ప్రజా సమస్యల పరిష్కారమే కమ్యూనిస్టుల ధ్యేయమని సిపిఐ జిల్లా కార్యదర్శి మంద పవన్ అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరించే ప్రజావ్యతిరేక విధానాలపై నిరంతర ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు. సోమవారం సిద్దిపేట రూరల్ మండలం రాఘవాపూర్‌లో సిపిఐ మండల మహాసభ నిర్వహించారు. మహాసభకు ముఖ్య అతిథిగా హాజరై మంద పవన్ పార్టీ జెండా ఆవిష్కరించి అనంతరం ప్రతినిధులను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్రంలో మోదీ ప్రభుత్వ హయాంలో అన్నివర్గాల ప్రజల భవిష్యత్ అంధకారంలో నెట్టివేయబడిందన్నారు. నరేంద్రమోదీ ప్రభుత్వం పేద ప్రజల కోసం కాకుండా పెట్టుబడిదారుల కోసం పనిచేస్తుందన్నారు. కార్మికవర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను రద్దు చేసి, 4 లెబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మిక లోకాన్ని అభద్రత భావంలోకి నెట్టివేశారన్నారు. నిత్యావసర ధరలు పెంచి సామాన్య ప్రజలపై భారం మోపి పేద ప్రజల నడ్డి విరుస్తుందని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ అర్హులైన పేదలందరికీ ఇంటి స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాసం కింద దరఖాస్తు చేసుకున్న ప్రతి అర్హుడికి రుణం మంజూరు చేసి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. అనంతరం మహాసభలో 11సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. సభలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కనుకుంట్ల శంకర్. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కిష్టపురం లక్ష్మణ్, మండల కార్యదర్శి మిట్టపల్లి సుధాకర్, సంజీవ్, మల్లయ్య, వెంకట్, మల్లేశ్, మిట్టపల్లి నవీన్, రాజయ్య తదితరులు పాల్గొన్నారు.



# 'ఇందిరమ్మ, రాజీవ్' పథకాల్లో అవకతవకలు

## అర్హుల ఎంపికలో కుమ్మక్కు

## విచారణ జరిపి చర్యలు చేపట్టాలి

## సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్

## ఎంపిడిఒ కార్యాలయం ముట్టడి

## పలువురి అరెస్టు




**ప్రజాపక్షం/చిగురుమామిడి :** ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక, రాజీవ్ యువ వికాస్ పథకం లబ్దిదారుల ఎంపికలో అవతకవకలు జరిగాయని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ ఆరోపించారు. కాంగ్రెస్ నాయకులతో అధికారులు కుమ్మక్కై అర్హులకు అన్యాయం చేస్తున్నారని, ఎంపిడిఒపై అధికారులు సమగ్రమైన విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ చిగురుమామిడి మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో ఎంపిపి కార్యాలయాన్ని ముట్టడించారు. కార్యాలయం ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. అర్హులైనవారికి ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకంలో లబ్ది చేకూర్చకుండా కాంగ్రెస్ నాయకులు ఎంపిడిఒతో కలిసి అనర్హులను ఎంపిక చేశారంటూ ఆరోపించారు. అర్హులైన పేదలకు పథకాలు మంజూరు చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తూ ఎంపిడిఒ వైఖరిని ఖండించారు. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని ఆందోళన విరమించే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులకు సిపిఐ నాయకులకు మధ్య తోపులాట చోటు చేసుకుంది. ఈ క్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్‌తో సహ సిపిఐ నాయకులందరినీ అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పంజాల శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలను పేదలకు అందించే క్రమంలో అర్హులైన నిరుపేదలకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇందిరమ్మ ఇండ్లు, రాజీవ్ యువ వికాసం పథకం లబ్దిదారుల ఎంపికలో అవకతవకలు చోటు చేసుకున్నాయని ఆరోపించారు. ధర్నాలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె స్వామి, బోయిని అశోక్, గూడెం లక్ష్మి ,మండల కార్యదర్శి నాగెల్లి లక్ష్మారెడ్డి, జిల్లా కౌన్సిల్‌సభ్యులు కాంతాల శ్రీనివాస్‌రెడ్డి, అందె చిన్నస్వామి, మావురపు రాజు, తేరాల సత్యనారాయణ, బావండ్లపెల్లి యుగేందర్, మండల సహాయ కార్యదర్శి బూడిద సదాశివ, పైడిపల్లి వెంకటేష్, మాజీ సర్పంచులు గోలి బాపురెడ్డి, కోమటిరెడ్డి జయపాల్ రెడ్డి, గ్రామ శాఖ కార్యదర్శులు ఎలగందుల రాజు, కయ్యం తిరుపతి, మంద ఎల్లయ్య పాల్గొన్నారు.



# సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం

## ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపు




**ప్రజాపక్షం/చింతపల్లి:** ప్రజాపోరాటాలతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. మండల పరిధిలోని మాల్ వెంకటేశ్వరనగర్‌లో బిజెగార్డెన్‌లోని మల్లోజు చంద్రమణెమ్మ ప్రాంగణంలో సిపిఐ మండల 15 మహాసభలు సోమవారం జరిగాయి. మహాసభకు నెల్లికంటి సత్యం, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పల్లా నరసింహారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. దున్నే వాడికి భూమి కావాలనే నినాదంతో దేశచరిత్రలో మహోజ్వలమైన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నడిపి, పది లక్షల ఎకరాల భూములను పేదలకు పంచిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీది అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశ సంపదను, ప్రజల ఆస్తులను కార్పొరేట్ పెట్టుబడుదారులకు దోచిపెడుతుందని, సంపద సృష్టికర్తలైన కార్మిక, కర్షకులకు వ్యతిరేకంగా నల్ల చట్టాలను పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టి, వారి జీవితాలతో చెలగాటమాడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుకుంటే వాటిని అదుపు చేయడంలో కేంద్రం వైఫల్యం చెందిందన్నారు. రాజ్యాంగ పరిరక్షణకు, లౌకిక ప్రజాస్వామ్య వ్యవస్థను కాపాడుకోవడం కోసం ప్రజలందరూ ఏకమై కేంద్రంలోని బిజెపి ప్రభుత్వంపై అవలంబిస్తున్న మతోన్మాద రాజకీయాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట ప్రభుత్వం ఆసరా పెన్షన్లు పెంచాలని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని, పార్టీలకతీతంగా పేదలను గుర్తించి ఇళ్లను మంజూరు చేయాలని, డిండి ఎత్తిపోతల పథకాన్ని పూర్తిచేసి దేవరకొండ, మునుగోడు నియోజకవర్గాల రైతులకు సాగునీరు అందించాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం డిమాండ్ చేశారు. ప్రజాసమస్య ల పరిష్కారానికి నిరంతరం పోరాడే కమ్యూనిస్టు పార్టీకి ప్రజలంతా బాసటగా నిలవాలని నెల్లికంటి పిలుపునిచ్చారు. సభలో మాజీఎమ్మెల్యే ఉజ్జిని యాదగిరిరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య, గిరిజన సమాఖ్య రాష్ట్ర ప్రధానకార్యదర్శి అంజయ్య నాయక్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి పల్లా దేవేందర్‌రెడ్డి, సిపిఐ జిల్లా నాయకులు ఉజ్జిని యుగంధర్‌రావు, పోలే వెంకటయ్య, సుదర్శన్ రెడ్డి, ఉజ్జిని అంజల్‌రావ్, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి చెల్లం పాండురంగరావు, బుచ్చయ్య, శంషోద్దీన్, వీరయ్య తదితరులు పాల్గొన్నారు.






# మహానగరి
గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## ప్రజా సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/మల్కాజిగిరి : డివిజన్‌లో ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో జిహెచ్ఎంసి అధికారులు దృష్టి సారించాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ కోరారు. రాంబ్రహ్మంనగర్ ప్రాంతంలో సోమవారం ఆయన సంజీవ్, ఆనంద్, నందు యాదవ్, బాబాన్‌సింగ్, మురళిగౌడ్, ఆశ, లక్ష్మి, కృష్ణలతో కల్సి జిహెచ్ఎంసి మల్కాజిగిరి సర్కిల్ అధికారులను కలిశారు. వర్షాకాలం దృష్ట్యా పారిశుద్య పనుల విషయమై ప్రాధాన్యత ఇవ్వాలని, ఎక్కడా నీరు నిలువకుండా, డ్రైనేజిలు పొంగి పొర్లకుండా చూడాలన్నారు.

## కళాకారులుగా తీర్చిదిద్దటంలో 'శివానంద లహరి' కృషి అద్భుతం



ప్రజాపక్షం/ఖైరతాబాద్ : విద్యార్థులను కళాకారులుగా తీర్చిదిద్ది భారతీయ కళా సంస్కృతిని విశ్వవ్యాప్తం చేయడంలో ప్రముఖ అకాడమీ ఆఫ్ డ్యాన్స్, మ్యూజిక్, ఫైన్ ఆర్ట్స్ సంస్థ 'శివానంద లహరి' కృషిచేస్తున్నదని కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత, కళారత్న సురభి ఆర్.వేణు గోపాల్‌రావు కొనియాడారు. ఆదివారం రాత్రి హైదరాబాద్ నాంపల్లి నందమూరి తారకరామారావు కళా మందిరంలో శివానంద లహరి సంస్థ ఆధ్వర్యాన శాస్త్రీయ నృత్య పరీక్షల ధ్రువపత్రాల ప్రదానోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. మానవ జీవనానికి భారత శాస్త్రీయ, జానపద, సంప్రదాయ నృత్య కళలు సంజీవని వంటివన్నారు. అనంతరం విద్యార్థులు పుష్పాంజలి నృత్యం, ముకుంద ముకుంద, సరస్వతీదేవి స్తుతి గీతం, నటేషకౌత్వం, జతిస్వరం, భగవద్గీత శ్లోకాలు, స్వాగతం కృష్ణా, తిల్లానాలను ప్రదర్శించారు. వనం నాగవర్శిణి తదితరుల నృత్యరూపకాలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ ఎం.జపమాల రాణి, గురు శ్యామల శ్రీనివాస్, కె.జయశ్రీ, సంస్థ అధ్యక్షులు బి.వివేకానంద (రాజు), బి.జ్యోతి ఉన్నారు.

## వృద్ధులకు ప్రత్యేక కౌంటర్లు కావాలి



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటి పరిధిలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొర్రెముల శాఖ బ్యాంక్‌లో వయో వృద్దుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని తెలంగాణా ఆల్ స్టేట్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ బ్యాంకు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం అసోసియేషన్ ప్రతినిధులు బంగారి రాజయ్య, ఆళవందార్ వేణు మాధవ్, సంజీవ్ రెడ్డి, రాజనర్సు, మల్లయ్య, ఎస్.లక్ష్మి, నారాయణ, సర్జిత్ సింగ్ లక్ష్మి కాంత్ మాట్లాడుతూ మండలంలోని కొర్రెముల, చౌదరి గూడ ప్రాంతాల్లోని అధిక శాతంగా ప్రభుత్వ, ప్రయివేట్ రంగాల్లో పని చేసిన విశ్రాంతి ఉద్యోగులు తమ పెన్షన్లతో పాటు ఇతర లావాదేవీలపై బ్యాంక్‌పై ఆధారపడుతున్నారని, మహిళలు, విద్యార్థులు ఇదే బ్యాంకు శాఖకు ప్రతి రోజు వస్తుంటారన్నారు. రద్దీ ఉంటోందని, వయో వృద్ధ లకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## 4వ తరగతిలో ప్రవేశాలు ప్రారంభం

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : తెలంగాణా రాష్ట్ర క్రీడా పాఠశాలల్లో 4వ తరగతిలో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైందని మేడ్చల్ జిల్లా కలెక్టర్ గౌతం పేర్కొన్నారు. హకీంపేట,ఆదిలాబాద్, కరీంనగర్‌లలోని క్రీడా పాఠశాలల్లో ప్రవేశాలు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్నారని, దీనికి సంబంధించి వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. 4వ తరగతిలో ప్రవేశాల కోసం 8 నుండి 9 ఏళ్ల వయస్సు గల విద్యార్థినీ విద్యార్థులు తమ వయస్సు, విద్యార్హత, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుండి ధృవపత్రాలతో పాటు గ్రామ పంచాయతి లేక మున్సిపాలిటి లేక తహసీల్దార్ కార్యాలయాల నుండి జారీ అయిన జన్మ దినపత్రము, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్టు, 3 పాస్‌పోర్టు ఫోటోలు, ఆధార్ కార్డు,, కుల ధృవీకరణ పత్రాలు ఎంఈఓ నిర్దేశించిన తేదీల్లో తీసుకొని పోటీలకు హాజరు కావాలన్నారు. మండల స్థాయిలో పోటీల ద్వారా ఎంపికైన బాలబాలికలను జిల్లా స్థాయి పోటీలకు పంపిస్తారని, జిల్లా స్థాయి పోటీల్లో ఎంపికైన వారిని జూలై 3,4 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఎంపిక చేసి తుది జాబితా రూపొందిస్తారన్నారు.

## ప్రజావాణికి 70 ఫిర్యాదులు



ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : ప్రజావాణిలో వచ్చే అర్జీలను ప్రాధాన్యతాపరంగా పరిష్కరించాలని జిల్లా ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి ఆదేశించారు. తమ స్థాయిలో పరిష్కరించలేని వాటి గురించి ధరఖాస్తుదారులతో పాటు సవివరంగా ఉన్నతాధికారులకు తెలియ పరుస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. డిఆర్‌ఓ హరిప్రియ, ఇతర జిల్లా ప్రభుత్వ శాఖల అధికారులతో కల్సి ప్రజావాణిలో 70 అర్జీలను స్వీకరించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయొద్దన్నారు.

## 11న భూ సేకరణ కోసం ప్రజాభిప్రాయం

ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి : ప్యారడైజ్ జంక్షన్ నుండి శామీర్‌పేట ఓఆర్ఆర్ జంక్షన్ వరకు కొనసాగే ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణ భూ సేకరణ, పునరావాస, పునరుపాధి కల్పన కోసం ఈ నెల 11న ఉదయం 10.30 గంటలకు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నామని మేడ్చల్ జిల్లా కలెక్టర్ ఓ ప్రకటనలో తెలిపారు. తూంకుంట మున్సిపల్ కార్యాలయంలో జరిగే ఈ కార్యక్రమంలో దేవరయాంజల్, తూంకుటలకు చెందిన ప్రజలు హాజరై అభిప్రాయాలు, అభ్యంతరాలు, సూచనలు, సలహాలు ఇవ్వాలన్నారు.

## రైల్వేస్టేషన్‌లో భద్రతపై అవగాహన



ప్రజాపక్షం/చర్లపల్లిః చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో జిప్ అపరేటింగ్ దొంగ తనాలకు సంబంధించిన అవగాహన కార్యక్రమాన్ని ఆర్‌పిఎఫ్ ఇన్స్‌పెక్టర్ రాకేష్,ఏఎస్‌ఐ బి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్టేషన్, రైలులో ప్రయాణించేటప్పుడు కీలకమైన భద్రతా చర్యలు, భద్రతా ప్రోటోకాల్‌లు గూర్చి ప్రయాణీకులకు అవగాహన కల్పించారు. కదులుతున్న రైలును ఎక్కడం,దిగిపోకుండా ఉం దడం, ఫ్లాట్‌ఫారమ్‌ల మధ్య సురక్షితమైన కదలిక కోసం ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను ఉపయోగించాలని వారికి సూచించారు.

## ఇందిరమ్మ ఇళ్ల పనులు ప్రారంభం

ప్రజాపక్షం/దమ్మాయిగూడః అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని కమిటీ సభ్యులు కొత్త భాస్కర్‌గౌడ్,మణిపాల్‌రెడ్డిలు అన్నారు.సోమవారం దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డులో ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులు పైళ్ల ప్రసన్న ఇంటి నిర్మాణానికి ముగ్గు పోసి ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించారు.ఇంటి నిర్మాణంలో ప్రభుత్వం ఇచ్చిన సూచనలతో నిర్మాణం చేయాలని వారు అన్నారు.ఈ కార్యక్రమంలో నానునాయక్,తిరుపతిరెడ్డి,బాల్‌రెడ్డి,రాజు ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల చెంతకు సంక్షేమ పథకాలు

### వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్



ప్రజాపక్షం/వికారాబాద్ ప్రతినిధి: ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ అభివృద్ధి పథకాలు ప్రజలకు అందేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా జిల్లా నలుమూలల నుండి వచ్చిన దరఖాస్తులనుఅదనపు కలెక్టర్ లింగ్యానాయక్, సుదీర్, ఆర్‌డిఓ వాసుచంద్ర లతో కలిసి విజ్ఞప్తులను స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు ఇందిరమ్మ ఇండ్లు నిర్మాణాలు ,బడి బాట ,వరి ధాన్య కొనుగోలు కేంద్రాలను పరిశీలించాలని సూచించారు. చౌక ధర దుకాణాల్లో సన్న బియ్యం పంఫిణిపై ప్రత్యేక దృష్టి సారించాలని అదేవిధంగా ,మంజురైన ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండ్ంగ్ చేసి పనులు పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణికి 84 దరఖాస్తులు రాగా రెవెన్యూ సమస్యలతో పాటు వ్యవసాయ ,భూముల సర్వే ,పెన్షన్లు ,ఆర్టీసీ ,ఇండ్ల ,రేషన్ కార్డుల మంజురు తదితర అంశాలపై విజ్ఞప్తులు వచ్చాయని తెలిపారు.

### ప్రతిపాదనలు ఇవ్వండి

ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో కావలసిన సదుపాయాల ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ ప్రతీక్‌జైన్ అధికారులకు సూచించారు. సోమవారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని ఏరియా ఆసుపత్రిని కలెక్టర్ తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ఏమైనా మరమ్మత్తులు ఉంటే ప్రతిపాదనలు సమర్పించాలని పంచాయతీరాజ్ ఇఇ ఉమేష్ కుమార్‌కు సూచించారు. జిల్లా కలెక్టర్ తనిఖీల్లో జిల్లా ఆసుపత్రిసూపరింటెండెంట్‌రామచంద్రయ్య సిబ్బంది పాల్గొన్నారు.

## సేంద్రీయ ఎరువులతోనే అధిక లాభాలు



ప్రజాపక్షం/దోమ : వ్యవసాయ పరిశోదన ఏరువాక కేంద్రం అధ్వర్యంలో సోమవారం దోమ మండల పరిధిలోని దాదాపూర్ రైతువేదికలో రైతులకు పంట సాగుపై వ్యవసాయ శాస్త్రవేత సుధారాణి, డాక్టర్ లక్ష్మణ్ అవగాహన కల్పించారు. వారు మాట్లాడుతూ రైతులు రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువులను వాడి ప్రకృతిని కాపాడాలన్నారు. సిఫారసు చేసిన మోతాదులో ఎరువులు వాడాలని, అధికంగా రసాయన ఎరువులు వాడటం వల్ల పర్యావరణం దెబ్బతింటుందని తెలిపారు. పంట మార్పిడి విధానాన్ని అవలంభించాలని వ్యవసాయ అధికారి ప్రభాకరావు, సలహాలు సూచనలు పాటిస్తు వితనం నాటి అధిక దిగుబడి పొందాలని తెలిపారు. మండల పిఏసిఎస్ చైర్మన్ యాదవరెడ్డి , మండలపార్టీ అద్యక్షులు విజయ్‌కుమార్‌రెడ్డి, ఏడిఏ లక్ష్మి కుమారి, మండల వ్యవసాయ అధికారి ప్రభాకర్‌రావు , సీనియర్ అధికారి రాఘవేందర్‌రెడ్డి,చెన్నయ్య ,బాబ్యానాయక్ ,తదితరులు పాల్గోన్నారు.

## విద్యార్థిని 'జగ్జీవని'కి అభినందన



ప్రజాపక్షం / కొడంగల్: దేశంలోనే అతి ప్రాముఖ్యమైనటువంటి యూనివర్సిటిలో ఉచిత సీటు సంపాదించిన విద్యార్థిని తెలంగాణ విద్యావంతుల వేదిక ఉపాధ్యాయులు సోమవారం ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా తెలంగాణ విద్యావంతుల వేదిక రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌గౌడ్ మాట్లాడుతు బోంరాస్‌పేట మం డల పరిధిలోని రేగడిమైలారం గ్రామానికి చెందిన మొండి అంజిలప్ప కూతురు జగ్జీవని బడుగు బలహీనవర్గాలకుటుంబంలో అతిపేదరికంలో జన్మించి, ప్రభుత్వ గురుకుల పాఠశాలలో చదివి దేశంలోనే అత్యంత ప్రాముఖ్యమైనటువంటి అజీమ్ ప్రేమ్‌జీ యూనివర్సిటి అర్హత పరీక్షలలో అత్యంత మార్కులు సాధించి 100 శాతం ఫ్రీ సీట్ సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. తల్లీదండ్రుల ఆశలు ఆశయాలను నెరవేర్చేందుకు కృషి చేస్తున్న విద్యార్థిని అభినందించారు. విద్య ఖర్చుల నిమిత్తం ఆర్థిక సహాయాన్ని అందించారు.

### విద్యార్థులకు సన్మానం

పది పరీక్షలలో అత్యంత మార్కులు సాధించి జిల్లా టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ శేరీ రాజేష్‌రెడ్డి మాట్లాడుతు జిల్లాలో పదవ తరగతి పరీక్షలలో టాపర్‌లుగా నిలిచిన విద్యార్థులనుసన్మానించడంగర్వకారణమన్నారు. అదేవిధంగా మన పాఠశాల ఆవరణలోనే నూతన గ్రంథాలయాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. మండల ఎంఈవోలు హరిలాల్, విజయరామరావు, తెలంగాణ విద్యావంతుల వేదిక ఉపాధ్యాయులు బా కారంచంద్రశేఖర్,పల్నాటి అనిల్‌కుమార్,లక్ష్మి, విజయలక్ష్మి, మర్పల్లి వెంకటేష్, బాకారం మల్లయ్యలతో పాటు కాంగ్రెస్ పార్టీ మండల అద్యక్షుడు నర్సిములుగౌడ్,రామచంద్రరెడ్డి, పిఏసిఎస్ చైర్మెన్ జయకృష్ణ, మాజీ మార్కెట్ కమిటి చైర్మెన్ వెంకట్రాములు గౌడ్, బిజెపి నాయకులు విజయవర్ధన్ పాల్గోన్నారు.

## ప్రజల సొమ్ము.. ప్రజలకే ఖర్చు పెడుతున్నాం..

### ఎంపి ఈటెల రాజేందర్



ప్రజాపక్షం/అల్వాల్: నడిచే సిసి రోడ్డు, పారే మురికి కాలువ, పెరిగే మొక్కలు, తినే బియ్యం ఇలా అన్నీ కేంద్ర ప్రభుత్వ పథకాలేనని మల్కాజ్‌గిరి పార్లమెంటు సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. సోమవారం అల్వాల్ పట్టణ పరిధిలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో బిజెపి కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై మీడియా సమావేశం నిర్వహించారు. ప్రధానంగా రోడ్లు రైల్వే గేట్ల వద్ద ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటి నివారణకు రైల్వే ట్రాక్‌ల వద్ద ఆర్యూబీలు, ఆర్ఓబీలు, జాతీయ రహదారులు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైన అభివృద్ధి పనులు అని ఆయన తెలిపారు. మచ్చ బొల్లారం డివిజన్ పరిధి తురకపల్లి, బొల్లారం రైల్వే గేటు వద్ద, జనప్రియ హోమ్స్ వద్ద ప్రజల ఇబ్బందులను గుర్తించి ఆర్‌యుబి నిర్మాణాల కోసం పార్లమెంట్ లో కొట్లాడి నిధులు మంజూరు చేయించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలు చేయడం జరిగిందని చెప్పుకోవడమే తప్ప నిధులు మాత్రం కేంద్ర ప్రభుత్వానివేనని పేర్కొన్నారు. గ్రేటర్ హైదరాబాద్ లో మేడ్చల్ జిల్లాలో వేలకోట్ల వ్యయంతో నిధులు మంజూరు చేయించి రైల్వే స్టేషన్ లు రైల్వే ఓవర్ బ్రిడ్జిలు రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందన్నారు. కెసిఆర్ గానీ రాష్ట్ర ప్రభుత్వాల నాయకులు గానీ మేము చేశాం అని చెప్తారు. కానీ ప్రజల సొమ్ము ప్రజలకు ఖర్చు పెడుతున్నామని ఒక్కరు చెప్పడం లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ మాత్రం నేను సేవకున్ని మీ సేవ చేస్తున్నానని చెప్తున్నారు. నేనే చేశానని ఎక్కడ చెప్పిన సందర్భాలు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా నాయకులు మల్లారెడ్డి, చింతల మాణిక్య రెడ్డి, మల్లికార్జున్ గౌడ్, మహిపాల్ రెడ్డి, గోపు రమణారెడ్డి, దండుగుల వెంకటేష్, శ్రీకాంత్ గౌడ్, అజయ్ రెడ్డి, మోయి సుజాత, కరుణశ్రీ, పద్మిని, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

## దివ్యాంగులకు ఉచిత ఉపకరణాలు



ప్రజాపక్షం/ కొడంగల్: కొడంగల్ నియోజకవర్గంలోని దివ్యాంగులు మరియు వయోవృద్దుల సంక్షేమ శాఖ,సామాజిక న్యాయ మరియు సాధికారత మంత్రిత్వ శాఖ, భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ(అలింకో) ఆద్వర్యంలో సోమవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో కొడంగల్ ఐసీడీఎస్ ఇన్‌చార్జి సీడీపీవో రజిత సమక్షంలో శిభిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అథితిగా విచ్చేసిన జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి జయసుద దివ్యాంగులను, వయోవృద్దులను ఉద్దేశించి మాట్లాడారు.నియోజకవర్గంలోని దివ్యాంగులు, వయోవృద్దులు ఉచిత సహాయక ఉపకరణాల కొసం దరఖాస్తులు చేసుకోవాలని అన్నారు. ప్రతి ఒక్కరు సదరం సర్టిఫికేట్, బీపీఎల్ రేషన్‌కార్డు, యుడిఐడి కార్డు, మరియు ఆధార్‌కార్డు తప్పనిసరిగ్గా తీసుకురావాలని తెలిపారు. భారత ప్రభుత్వ ఏడీఐపి పథకం కింద గుర్తించబడిన ఆర్హత కలిగిన దివ్యాంగులకు ఉచితంగా సహాయక ఉపకరణాలు అయిన బ్యాటరీ వీల్ చైర్స్, మోటరైజ్డ్ ట్రై సైకిల్స్, హ్యాండ్ ప్రోఫైల్డ్, ట్రైసైకిల్స్, వీల్ చైర్స్, హియరింగ్ ఎయిడ్స్ వంటి సహాయక పరికరాలను ఈ శిభిరంలో ఎంపికైన దివ్యాంగులకు అందివ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ సహాయక ఉపకరణాలు పొందుటకు కనీసం 40 శాతం వైకల్యం తప్పనిసరిగ్గా కలిగి ఉండాలని పేర్కోన్నారు. ఈ శిభిరంలో దాదాపు 154 మంది దివ్యాంగులు సహాయక ఉపకరణాల కోసం దరఖాస్తులు చేసుకోవం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సంబందిత శాఖ అధికారులు జహీరుద్దీన్, హేమలత, అలిమ్కో ప్రతినిధులు, మహిళ శిశు సంక్షేమ శాఖ సిబ్బంది, అంగన్‌వాడి టీచర్‌లు తదితరులు పాల్గోన్నారు.

## తాండూరు డిఎస్‌పిపై చర్యలు తీసుకోవాలి

### డిఎస్పీ కార్యాలయం ముట్టడించిన దళితా ప్రజా సంఘాలు



ప్రజాపక్షం/తాండూరుః దళిత ప్రజా సంఘాలను అక్రమంగా అరెస్టు చేసి అగ్రకుల పెత్తందారులకు కొమ్ముకాస్తున్న తాండూరు డిఎస్పీపై చర్యలు తీసుకోవాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. తాండూరు మండల పరిధి బెల్కాటూర్ గ్రామంలో దళిత యువకుడు పెండ్లి బరత్‌ను అడ్డుకుని దళితులపై దాడి చేసిన అగ్రవర్ణ కులాల పెత్తందారులను అరెస్టు చేయాలని సోమవారం తాండూరు డిఎస్పి కార్యాలయం ముట్టడికి దళిత ప్రజా సంఘాల నేతలు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. సోమవారం ఉదయం తాండూరు పట్టణంలోని అంబేద్కర్ చౌక్ నుండి శాంతి యుతంగా బయలుదేరి తాండూరు డిఎస్పీ కార్యాలయం ముందు ధర్నాకు దిగారు. ప్రజా సంఘాల నేతలను పోలీసులు అడ్డుకుని అరెస్టు చేయడంపై వారు మండిపడ్డారు. అగ్రవర్ణాలకు కొమ్ముకాస్తున్న తాండూరు డిఎస్పీపై చర్యలు తీసుకోవాలని, ఆయనను వెంటనే సస్పెండ్ చేయాలని తాండూరు డివిజన్ సబ్‌కలెక్టర్ ఉమా శంకర్ ప్రసాద్‌కు ఫిర్యాదు చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శ్రీనివాస్ మాట్లాడుతూ రాజకీయనాయకుల ఒత్తిళ్ళకు తలొగ్గి అగ్రకుల పెత్తందారులను అరెస్టు చేయకుండా వారికి కొమ్ముకాస్తున్నారనిమండిపడ్డారు. ఉన్నతాధికారులు ఆ డిఎస్పీ చర్య లు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ దర్నా కార్యక్రమంలో దళిత ప్రజాల సంఘాల నేతలు పాల్గోన్నారు.

## మా సర్కిల్‌లోని పనులను పర్యవేక్షించండి

### జోనల్ కమిషనర్‌కు సిపిఐ వినతి



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్:కుత్బుల్లాపూర్, గాజులరామారం సర్కిల్ లో సిపిఐ గా ఒకే సమస్యలు పై ఇప్పటికి 3 సార్లు వినతి పత్రం, ఒకసారి ధర్నా చేసినప్పటికి నేటికీ సమస్య పరిష్కారం అవట్లేదని మీరైన స్పందించాలని నేడు ప్రజవానిలో కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ కి సిపిఐ ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది. సర్కిల్ పరిధిలో బహుళ అంతస్తులు పై చర్యలు శూన్యమని అవి అధికారులకు కాసులు కురిపిస్తున్నాయని ప్రజలు అనుకుంటున్నారని, ఫిర్యాదులు ఇస్తే కనీసం స్పందన లేదని, రోడ్డు వెడల్పు చేసి వాహనాలు పార్కింగా కోసం ఉపయోగపడుతుందని, సీసీ రోడ్డు పై సీసీ రోడ్డు వేస్తున్నారని అధికారులు ఆశాస్త్రీయంగా కేవలం ప్రజల డబ్బులను దుబారా చేస్తున్నారని కావున సిపిఐ గా ఇచ్చిన పిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, కార్యవర్గ సభ్యులు కృష్ణ, శ్రీనివాస్, మనోహర చారీ, ప్రజానాట్యమండలి బాబు, ప్రభాకర్, యాదయ్య లు పాల్గొన్నారు.

## స్టూడెంట్స్ బస్‌పాస్ చార్జీలు తగ్గించాలి



ప్రజాపక్షం/అల్వాల్: తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ యాజమాన్యం విద్యార్థుల బస్ పాస్ ఛార్జీలను 20 శాతం పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే వెనక్కి సుకోవాలని యువిస్ఎఫ్ఐ తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తోంది. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గతంలో పెంచిన బస్ ఛార్జీలు స్టూడెంట్స్ పాస్ ఛార్జీలు కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 20 శాతం ఛార్జీలు పెంచి అమలు చేస్తే బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ప్రధానంగా ఉన్నత విద్య కోసం బస్ నమ్ముకున్న విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోని చదువుకు దూరం అయ్యే ప్రమాదం ఉంది. ఆర్టీసీ యాజమాన్యం ఇప్పటికే చాలా రూట్లలో విద్యార్థులు కోసం బస్సులు నడపడం లేదు. ఒక ప్రక్క బస్సులు సంఖ్య పెంచి ఉచిత బస్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ వస్తున్న నేపథ్యంలో ఛార్జీలు బస్ పాసులు పెంచే ఆలోచన చేయడం దుర్మార్గపు చర్య తక్షణమే పాసుల ఛార్జీలు పెంపు ఆలోచనలు విరమించుకోవాలి. లేకుంటే అన్ని డిపోల ఎదుట యుఎస్ఎఫ్ఐ ఆందోళన కార్యక్రమాలకు పిలుపునిస్తున్నామని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బ్యాగరి వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ఆర్ నాయక్‌నగర్‌లో ఎక్కడి చెత్త అక్కడే..!

### ప్రజావాణిలో స్థానికుల ఫిర్యాదు



ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ : సోమవారం రోజు కుత్బుల్లాపూర్ మున్సిపల్ కార్యాలయంలో ప్రజావాణిలో సుభాష్ నగర్ డివిజన్ ఎస్ఆర్ నాయక్ నగర్ లో పారిశుధ్య పనులు సరిగా చేయకపోవడంతో ఎక్కడికక్కడ చెత్త చెదారం పేరుకు పోయిందన్నారు. ఈ విషయాన్ని స్థానిక నాయకులు, కాలనీవాసులు మున్సిపల్ ఉప కమిషనర్ నరసింహన్ దృష్టికి తీసుకువెళ్లారు. వచ్చేది వర్షాకాలం కాబట్టి ఇప్పుడే సరిగా లేకపోతే అంటూ వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది కాబట్టి శానిటేషన్ మీద పూర్తిగా దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని కాలనీవాసులు కోరారు. సానుకూలంగా స్పందించిన ఉప కమిషనర్ సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారం దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. దోమల మందు ఫాగింగ్, స్ప్రే మందు సరిగా కొట్టడం లేదని దీనిపై కూడా చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో ధర్నా నిర్వహిస్తామని, కాలనీవాసులు ఆరోగ్యంగా ఉండేటట్టు దోమలు ఎక్కువ కాకుండా చూడాలని ఉప కమిషనర్ నరసింహ ను కోరారు. జిహెచ్ఎంసి పార్కులో గతంలో బోర్ వేసేటప్పుడు వాకింగ్ ట్రాక్ తవ్వి మళ్లీ నిర్మించకుండా గుంతల గుంతలుగా ఉండటం వలన వాకింగ్ చేసే వారికి ఇబ్బందికరంగా మారింది . ఈ సమస్య కూడా పరిగణనలో తీసుకుని వెంటనే ఆ ట్రాకుకు మరమ్మతులను చేయాలని కోరారు. అలాగే పార్క్ సెక్యూరిటీ రూమ్ పెచ్చులు ఊడిపోవడం వలన వచ్చేది వర్షాకాలం కాబట్టి ఆ రూమ్ కూలిపోయే అవకాశం ఉందన్నారు. కొత్త రూమ్ నిర్మించాలని కోరారు. అట్టి పార్కులో ఎంట్రెన్స్ బోర్డు కూడా ఊడిపోవడంతో నూతన బోర్డు నిర్మించాలని ఉప కమిషనర్‌ని కోరడం జరిగింది. స్పందించిన కమిషనర్ అక్కడ ఉన్న ఈఈ గణేష్‌తో మాట్లాడి సమస్య పరిష్కారం చేయాలని ఆదేశించారు.ఈకార్యక్రమంలో గుబ్బల లక్ష్మీనారాయణ, ఆలూరి వెంకట శేషాచారి, పివి భాస్కర్ రెడ్డి, పూర్ణ చంద్రగుప్త, కూరపాటి ప్రభాకర్ రావు ఉన్నారు.



# మహానగరి

గ్రేటర్ హైదరాబాద్ GREATER HYDERABAD

## పెంచిన బస్ పాస్ ధరలను వెనక్కి తీసుకోవాలి : ఎఐవైఎఫ్

**ప్రజాపక్షం/తుర్కయంజాల్:** బస్ పాస్ ధరలను పెంచుతూ ఆదేశాలు జారీ చేసిన టీజీఎస్ఆర్టీసీ యాజమాన్యం వెనక్కి తీసుకోవాలని లేకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు నిర్వహిస్తామని ఎఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పి శివకుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టికెట్ల ధరల పెంపుతో సామాన్య ప్రజలతో పాటు, విద్యార్థులు ఇబ్బంది పడాల్సి ఉంటుందని, రోజువారి పనులు చేసుకునే ఉపాధి కూలీలకు నిరుద్యోగులకు అంతరాయం ఏర్పడుతుందని వారు తెలిపారు. రూ.1,400 కు, మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్‌ధరను రూ.1300 నుండి రూ.1600 కు, మెట్రో డీలక్స్ పాస్ ధరను రూ.1450 నుండి రూ 1800 కు పెంచిన ఆర్టీసీ యాజమాన్యం సకలజనులను దృష్టిలో పెట్టుకొని మరోసారి పునరాలోచించాలని వారు అన్నారు. ఆర్టీసీ యజమాన్యం ఉచిత బస్సు పథకం వల్ల జరిగే నష్టాన్ని భర్తీ చేయడానికే ప్రజలపై భారం వేస్తుందని ఆరోపించారు

## తెలంగాణ సాగునీరుపై ఎపి కుట్రను అడ్డుకుందాం

అఖిలపక్ష సమావేశంలో పలువురు వక్తలు



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** తెలంగాణకు సాగునీరు దక్కకుండా ఎపి పాలకులు చేస్తున్న కుట్రలను అడ్డుకొనేందుకు మరో పోరాటానికి సిద్ధం కావాలని వక్తలు పిలుపునిచ్చారు. రాష్ట్రానికి జాతీయ హోదా, నిధులిచ్చి ప్రాజెక్టులు పూర్తయ్యేవరకు ఎపికి ఎలాంటి అనుమతులు, నీటి కేటాయింపులు చేయొద్దని కేంద్రప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గోదావరి కావేరి అనుసంధానం పేరిట తెలంగాణ నీటిని ఆంధ్రకు తరలించటాన్ని ఆమోదించబోమని స్పష్టంచేశారు. సోమవారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరిగింది. బిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ సమన్వయకర్తగా వ్యవహరించిన సమావేశానికి ముఖ్యఅతిథులుగా మాజీ ఎంపి వి.హనుమంతరావు, జలవనరుల నిపుణులు వి.ప్రకాశ్, బిఆర్ఎస్ అధికార ప్రతినిధి రావుల శ్రీధర్‌రెడ్డి, హైకోర్టు న్యాయవాది శైలజ హాజరయ్యారు. వి.హనుమంతురావు మాట్లాడుతూ కృష్ణా – గోదావరి నదుల అనుసంధానం న్యాయబద్ధంగా జరిగేలా కేంద్రం చర్యలు చేపట్టాలని కోరారు. వి.ప్రకాశ్ మాట్లాడుతూ బనకచర్ల పేరిట 200 టిఎంసిలకుపైగా గోదావరి జిలాలను రాయలసీమకు తర్వాత తమిళనాడుకు తరలించే కుట్ర జరుగుతుందని పేర్కొన్నది. ఆర్.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు ప్రాజెక్టుతో కృష్ణాజలాలను పోగొట్టుకొన్నామని, బనకచర్ల, గోదావరి కావేరీ అనుసంధానంతో శాశ్వతంగా గోదావరి జలాలు పోగొట్టుకొనే ప్రమాదం ఉన్నదన్నారు. తెలంగాణకు నీటి పంపిణీపై 75 ఏండ్లుగా జరుగుతున్న కుట్రలపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉన్నదన్నారు.

## ఆరోగ్య సమసమాజమే 'ఆరోగ్యమిత్ర' లక్ష్యం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్ :** ఆరోగ్యకరమైన సమసమాజ స్థాపన లక్ష్యంగా 'ఆరోగ్య మిత్ర' పనిచేస్తున్నదని ఆరోగ్యమిత్ర స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకులు, హోమియోపతిక్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్. అశోక్ పరికపండ్ల తెలిపారు. సోమవారం హైదరాబాద్ బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సంతృప్తికరమైన జీవితం, పరస్పర సహకారం, సహృద్భావంతో మెలుగుతూ ప్రశాంత జీవితం గడపాలని సూచించారు. 2020లో ఆరోగ్యమిత్ర స్థాపించామని, నేటికి 25 ఏండ్లు పూర్తిచేసుకొని, 8 వేల మందికి సేవ చేసిందని వివరించారు. ఈ సందర్భంగా 25 మంది ఉత్తమ వ్యక్తులకు అవార్డులిస్తామన్నారు. 25 సంస్థలతో కలిసి 25 జిల్లాల్లో వేలాది మందికి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఎవరూ ఆత్మహత్య చేసుకోవద్దని, జీవితాన్ని చక్కదిద్దుకునే లా ఆలోచన చేయాలని సూచించారు. అనంతరం డిజిపి జితేందర్‌తో కలిసి ఆరోగ్య మిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో దత్తు ఆయుర్వేదం వ్యవస్థాపకులు డాక్టర్ గుమ్మడవెల్లి శ్రీనివాస్, గాలి అరుణ్‌రెడ్డి పాల్గొన్నారు.

## జాబితా నుంచి తొలగించిన కులాలపై విచారణ జరిపిన బిసి కమిషన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణ బిసి కులాల జాబితా నుండి తొలగించిన 26 కులాలను తిరిగి చేర్చుకోవాలని వచ్చిన విజ్ఞప్తులపై తెలంగాణ బిసి కమిషన్‌లో సోమవారం బహిరంగ విచారణ నిర్వహించారు. బిసి కమిషన్ ఛైర్మన్ జి.నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి రంగు, మెంబర్ సెక్రెటరీ బాల మాయా దేవి, డిప్యూటి డైరెక్టర్ యు.శ్రీనివాసరావు, స్పెషల్ ఆఫీసర్ జి.సతీష్‌కుమార్, రీసెర్చ్ ఆఫీసర్ జి.లక్ష్మి నారాయణ పాల్గొన్నారు. బహిరంగ విచారణకు 13 ప్రతినిధుల బృందాలను కమిషన్ విచారించింది. కళింగ, తూర్పుకాపు కుల సంఘాల వారు కమిషన్ ముందు హాజరై తమ కులాలను బిసి జాబితాలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ బిసిలు ఏ కులాల పరిరక్షణ సమితి, తెలంగాణ ప్రదేశ్ గంగపుత్ర సంఘం, కొందరు తెలంగాణ మేధావులు తొలగించిన 26కులాలను తిరిగి చేర్చుకోవద్దని విజ్ఞప్తిచేశారు. బహిరంగ విచారణ కమిషన్ కార్యాలయంలో ఈనెల 10,11 తేదీలలో కూడా జరుగుతుందని కమిషన్ ఛైర్మన్ నిరంజన్ తెలిపారు.

## ప్రతి ఉపాధ్యాయుడు యోగాకు అంబాసిడర్ కావాలి

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రతి ఉపాధ్యాయుడు యోగాకు అంబాసిడర్ కావాలని కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. ఈనెల 21న జరిగే 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా సోమవారం సిజిఓ టవర్స్‌లో జరిగిన సన్నహాక సమావేశంలో కేంద్రమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం యోగా డేను లాల్ బహదూర్ స్టేడియంలో ఒక రోజు ముందే ఈ నెల 20న నిర్వహిస్తున్నామన్నారు.

## బస్ పాస్ ఛార్జీలు పెంచిన టిజిఎస్ ఆర్‌టిసి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** టిజిఎస్ ఆర్‌టిసి బస్ పాస్ ఛార్జీల ధరలను పెంచింది. సోమవారం నుంచి కొత్త బస్ పాస్ ధరలు అమల్లోకి వచ్చాయి. సాధారణ ప్రజల తీసుకునే బస్ పాసులతో పాటు, స్టూడెంట్ పాస్ ధరలను కూడా ఆర్‌టిసి పెంచింది. 20 శాతం పైగా బస్ పాస్ ధరలను ఆర్‌టిసి పెంచింది. 1150 రూపాయలుగా ఉన్న ఆర్డినరీ పాస్ ధర పెంపు తర్వాత 1400 రూపాయలకు చేరింది. 1300 ఉన్న మెట్రో ఎక్స్‌ప్రెస్ పాస్ 1600 రూపాయలకు చేరింది. 1450 రూపాయలుగా ఉన్న మెట్రో డీలక్స్ పాస్ 1800 రూపాయలైంది. గ్రేటర్ హైదరాబాద్, గ్రీన్ మెట్రో ఏసి పాస్ ధరలను కూడా ఆర్‌టిసి పెంచింది.

# ప్రజావాణి విన్నపాలకు సత్వర పరిష్కారం

జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ప్రజావాణిలో వచ్చిన విన్నపాలను బాధ్యతతో సత్వరమే పరిష్కరించాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్‌వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయలో సోమవారం జరిగిన ప్రజావాణిలో నగరం నలు వైపుల నుండి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కమిషనర్‌కు విన్నవించుకున్నారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలకు సంబంధించిన అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి, సత్వర పరిష్కారించాలని సంబంధిత అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ గ్రేటర్ వ్యాప్తంగా తమ సమస్యలను తెలియజేయడాని, విజ్ఞప్తులు అందజేసిన నేపథ్యంలో అధికారులు వారి విన్నవించిన సమస్యను బాధ్యతతో పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజల సమస్యలు పరిష్కారంలో సంబంధిత హెచ్ఒడిలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రజావాణిలో కమిషనర్‌తో పాటు అదనపు కమిషనర్లు స్నేహ శబరీష్, వేణుగోపాల్, రఘుప్రసాద్, చీఫ్ సిటీప్లానర్ కె.శ్రీనివాస్ రావు, వేణుగోపాల్ రెడ్డి, నళిని పద్మావతి, ఎస్.పంకజ, గీతా రాధిక, సత్యనారాయణ, స్మామాట్ అశోక్, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ పద్మజ, చీఫ్ వెటర్నరీ అధికారి డాక్టర్ అబ్దుల్ వకీల్, ఉమాప్రకాశ్, భూసేకరణ డిప్యూటీ కలెక్టర్ రాము నాయక్, అదనపు చీఫ్ సిటీప్లానర్లు గంగాధర్, వెంకన్న, ప్రదీప్ కుమార్, డిప్యూటీ సిఇ పనస రెడ్డి, మహేశ్ కులకర్ణి, ఎస్ఎన్‌డిపి ఎస్ఇ. పివి రెడ్డి, ఎఇ బాలాజీ, హౌసింగ్ ఇఇ రాజేశ్వర్ రావు పాల్గొన్నారు.

### ప్రజలు తమ సమస్యలను ఆన్‌లైన్‌లో కూడా విన్నవించవచ్చు..

నగర ప్రజలు తమ సమస్యలను ఎపుడైనా జిహెచ్‌ఎంసి యాప్ ద్వారా విన్నవించవచ్చునని కమిషనర్ ఆర్‌వి. కర్ణన్ తెలిపారు. జిహెచ్‌ఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి సందర్భంగా గోపనపల్లి డైమండ్ హేట్స్ కాలానికి సంబంధించిన కొందరు మా కాలనీ రోడ్డు బాగాలేదని, కాలనీలో నివాసితులు వాట్సప్ గ్రూప్‌లో పోస్టు చేసిన నేపథ్యంలో ఆన్‌లైన్‌లో జిహెచ్‌ఎంసికి ఫిర్యాదు చేయవద్దని పోస్ట్ చేస్తున్నారని కాలనీకి సంబంధించిన కొందరు వ్యక్తులు కమిషనర్ దృష్టికి తీసుకొని రాగా నగర ప్రజలు తమ సమస్యలను నేరుగానే కాకుండా ఆన్‌లైన్ కూడా ఫిర్యాదు చేయవచ్చునని వారికి కమిషనర్ వివవరించారు.

## మౌలిక వసతులు లేని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మల్లేష్



**ప్రజాపక్షం/గండిపేట :** విద్యార్థులకు సౌకర్యవంతమైన మౌలిక వసతులు, పర్మిషన్ లేని ప్రవేట్ పాఠశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ఎంఇఒ విజయ్ కుమార్‌ను కలిసిన ఎఐటియుసి జిల్లా కార్యదర్శి మల్లేష్, నాయకులు ఎం.శంకరయ్య, మండల కార్యదర్శి బాబురావులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మల్లేష్ మాట్లాడుతూ గండిపేట మండల పరిధిలో ప్రైవేట్ స్కూళ్లలో పర్మిషన్ లేనివి, ప్లే గ్రౌండ్ లేకుండా, ఇష్టం వచ్చినట్లు ఫీజులు వసూలు చేస్తు విద్యార్థులను ఇబ్బంది పెడుతున్న యజమాన్యాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. లేనియెడల ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీకాంత్ సుధాకర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మాదాపూర్‌లో వరద కట్టడికి చర్యలు

వరద కాలువలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మాదాపూర్‌లోని వరద ముంపు ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏ.వి. రంగనాథ్ సోమవారం క్షేత్ర స్థాయిలో పర్యటించారు. నాలాల్లో వరద సాఫీగా సాగుతుందా లేదా, ఎక్కడైనా ఆటంకాలున్నాయా అనే అంశాలను పరిశీలించారు. వర్షం పడితే నీట మునుగుతున్న నెక్టార్ గార్డెన్స్ పరిసరాలలో వర్షపు నీరు నిలవకుండా తీసుకోవాల్సిన చర్యలపై జిహెచ్‌ఎంసి, ఇరిగేషన్, జలమండలి అధికారులతో చర్చించారు. దుర్గం చెరువుకు ఎండాకాలంలో కూడా నీటి కొరత ఉండదు కనుక, వర్షాకాలంలో నీటి నిలువల స్థాయిని తగ్గిస్తే వరద పోటెత్తదని అధికారులు సూచించారు. వర్షం పడితే నడుములోతు నీళ్లు తమ కాలనీలో నిలబడుతున్నాయని స్థానికులు కమిషనర్‌కు తెలిపారు. దుర్గం చెరువుకు ఇన్ ఫ్లో ఎంత మొత్తంలో ఉంది, ఔట్ ఫ్లో ఎంతనే అంశాలను చెరువు చుట్టూ తిరిగి పరిశీలించారు. చెరువులోపల తూములను, గేట్లను కూడా పరిశీలించారు. ఇందులో ఏ గేటు ఎత్తితే ఎంత నీరు వెళ్తుంది అనే అంశాలను అడిగి తెలుసుకున్నారు.

### త్వరలో దుర్గం చెరువుపై సమీక్ష..

దుర్గం చెరువులో నీటిమట్టం నిర్వహణపై ఇరిగేషన్, జలమండలి, జిహెచ్ఎంసి అధికారులతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని హైడ్రా కమిషనర్



ఏ.వి. రంగనాథ్ నిర్ణయించారు. వరద కాలువలను విస్తరించాల్సినవసరం ఉన్నా, వర్షాకాలంలో అయినా కొంత మేర తగ్గిస్తే మాదాపూర్ ప్రాంతంలో వరద ముంపు తగ్గించడానికి వీలవుతుందా అనే విషయమై ఇందులో చర్చించనున్నారు. దుర్గం చెరువు దిగువ భాగంలో ఆక్రమణలతో పాటు వరద కాలువకు ఉన్న ఆటంకాలను కూడా పరిశీలించారు. దుర్గం చెరువులో ఇనార్బిట్ మాల్ వైపు మట్టి పోయడంపై విచారించారు. అక్కడ పార్కు చేసిన వాహానాలకు సంబంధించి వాకబు చేశారు. పూర్తి వివరాలు తెలుసుకోవాలని అధికారులను ఆదేశించారు. దుర్గం చెరువు వరద కాలువకు ఆటంకం లేకుండా ఎంత మొత్తం నీరు విడుదల చేసినా సాఫీగా మల్కం చెరువుకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు.

# ప్రభుత్వ పాఠశాల్లో నాణ్యమైన విద్య లక్ష్యం

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

**ప్రజాపక్షం/షాద్‌నగర్:** కార్పొరేట్ విద్య కంటే ప్రభుత్వ పాఠశాల్లోనే నాణ్యమైన విద్య అభిస్తుందనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఫరూఖ్‌నగర్ మండల విద్యాశాఖ అధికారి మనోహార్ ఆధ్వర్యంలో బడి బాట కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులు కలిగిన ఉపాధ్యాయులు ఉంటారని, క్రమశిక్షణతో కూడిన విద్యను అంధించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్, శ్రీధర్‌రెడ్డి, నందిగామ సురేష్, భాగ్యమ్మ, సత్యం, లింగారెడ్డిగూడ అశోక్‌లు పాల్గొన్నారు.

**ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించిన ఎమ్మెల్యే...** ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సమక్షంలో ఏడుగురు విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చేరారు.



### రెవిన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

**కొత్తూరు:** ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవిన్యూ సదస్సులను రైతులందరూ సద్వినియోగం చేసుకొని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. నందిగామ మండల కేంద్రంలో నిర్వహించిన రెవిన్యూ సదస్సులో పాల్గొని రైతులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో జంగ నరసింహ, కొమ్ము కృష్ణ, కుమారస్వామిగౌడ్, కావలి కృష్ణ పాల్గొన్నారు.

## అన్నిరంగాల్లో అభివృద్ధి లక్ష్యం

ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



**ప్రజాపక్షం/గండిపేట:** బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో రూ.ఐదు కోట్ల 81లక్షల అభివృద్ధి పనులకు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్డు వెడల్పు పనులకు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ సోమవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బండ్లగూడ జాగీర్ మున్సిపాల్ కార్పొరేషన్ అన్ని రంగాల్లో అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమన్నారు. కార్యక్రమంలో బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్‌చంద్ర, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, మాజీ మేయర్ మహేందర్ గౌడ్, రాజేందర్‌రెడ్డి, సాగర్‌గౌడ్, సురేష్‌గౌడ్, పాపయ్య యాదవ్ పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్‌ల స్టేటస్ కో సమస్యను పరిష్కరిస్తాం : మధుయాష్కీ

**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** హయత్ నగర్ డివిజన్ పరిధిలోని కమాలనగర్, ఆంధ్రకేసరి నగర్ కాలనీలలో రిజిస్ట్రేషన్‌లపై స్టేటస్ కో విధించిన సమస్యను పరిష్కారిస్తామని టిపిసిసి ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. సోమవారం ఆయా కాలనీల అసోసియేషన్ల ఆహ్వానం మేరకు కాలనీ కమ్యూనిటీ హాల్ వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 40 ఏళ్ల కిందట చేసిన లేఅవుట్లను తమ ఇనాం భూములు అని పేర్కొంటూ,, కొంత మంది కోర్టుకు వెళి, ఇప్పుడూ తమవంటే చెల్లదన్నారు. కాలనీవాసుల ముందే ఆర్డీవోతో మాట్లాడిన మధుయాష్కీ ఏ ప్రతిపదికన రిజిస్ట్రేషన్‌లపై స్టే విధిస్తారని ప్రశ్నించారు. తను కూడా న్యాయవాదినని, హైకోర్టు నుంచి నిర్దిష్టమైన ఆదేవాలు లేకుండా ఏ విధంగా రిజిస్ట్రేషన్‌లపై స్టేటస్‌కో ఇస్తారు అని ప్రశ్నించారు. రిజిస్ట్రేషన్‌లపై విధించిన స్టేను వెంటనే ఎత్తివేసేలా ఆర్డర్‌ను రూపొందించి విడుదల చేయాలని సూచించారు. కోర్టు కేసు, రిజిస్ట్రేషన్లపై స్టేటస్ కో కారణంగా ఆందోళనకు గురవడంతో పాటు అనారోగ్య కారణాలతో మరణించిన కాలనీ వాసి పివి రమణ



రావు దేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. కార్యక్రమంలో వనస్థలిపురం కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ ప్రభాకర్‌రెడ్డి, చెన్నగొని రవీందర్, టీవీ రావు, సుబ్బారావు, దివాకర్, న్యాయవాది వెంకటేశ్వర్లు, మార్కెట్ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, బుడ్డ సత్యనారాయణ, పట్లోళ్ల మాధవరెడ్డి, రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** గ్రామ పంచాయతీ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల వేతనాలను చెల్లించడంతోపాటు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు టంగుటూరి నర్సింహ్మారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమీషనర్/డైరెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహ్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న సిబ్బందికి రెండు నెలల నుండి వేతనాలు ఇవ్వడం లేదని, దాంతో వారు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటరాజాం, కోశాధికారి ఆంజనేయులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 64 ఫిర్యాదులు

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి:** ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 64ఫిర్యాదులు అందాయని ఆయన తెలిపారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్‌కి విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పరిష్కరించాలని అధికారులకు స్పష్టం చేశారు. నాటి ప్రజావాణికి రెవెన్యూ శాఖ 24, ఇతర శాఖలకు సంబందించి 40, మొత్తం 64 దరఖస్తులు అందాయని కలెక్టర్ తెలిపారు.

### అందుబాటులో నోట్‌బుక్స్, యూనిఫామ్స్

అనంతరం జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి జిల్లా అధికారులతో



మాట్లాడుతూ పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి పాఠశాలల్లో, హాస్టల్స్, సంక్షేమ వసతి గృహాలలో ఉండే విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్, స్కూల్ యూనిఫామ్స్ అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలు, హాస్టల్స్ పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, మౌలిక సదుపాయాలు వెంటనే కల్పించాలని, చిన్న చిన్న సమస్యలు ఉంటే పరిష్కరించాలని, ఆవరణలలో పరిశుభ్రత, పచ్చదనం ఉండాలని, తాగునీటి వసతి వంటి సదుపాయాలు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ విద్యాసంస్థల్లో 50శాతం ఫీజు రాయితీ

జిల్లా కలెక్టర్‌కు టియుడబ్ల్యుజె రంగారెడ్డి జిల్లా సమితి వినతి

**ప్రజాపక్షం/రంగారెడ్డి ప్రతినిధి :** జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేటు విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ కల్పించేందుకు కృషి చేయాలని టియుడబ్ల్యుజె (ఐజెయు)రంగారెడ్డి జిల్లా సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, విద్యాశాఖ అధికారి సుశీందరరావులకు సోమవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా టియుడబ్ల్యుజె (ఐజెయు) నాయకులు మాట్లాడుతూ జర్నలిస్టుల పిల్లలు కార్పొరేట్ పాఠశాల, కళాశాలల్లో విద్యను అభ్యసించేందుకు ఫీజు రాయితీ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. గతంలో మాదిరిగా ఫీజు రాయితీ కల్పించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని జిల్లాల్లో విద్యాశాఖ ప్రత్యేక సర్కులర్‌ను జారీ చేశారని గుర్తు చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమవు తుంది కాబట్టి కలెక్టర్, విద్యాశాఖ అధికారులు సకాలంలో స్పందించి రాయితీకి సంబంధించిన సర్కులర్ జారీ చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో టియుడబ్ల్యుజె (ఐజెయు) జిల్లా అధ్యక్షుడు సలీం, ఉపాధ్యక్షుడు భాస్కర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, కార్యదర్శి రాఘవేందర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



# రీల్

# 14న గద్దర్ ఫిలిం అవార్డుల వేడుక




తెలంగాణ ప్రభుత్వం తొలిసారిగా సినిమా రంగానికి ఇస్తున్న తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డుల ప్రధానోత్సవ వేడుక ఈనెల 14న హెచ్ఐసిసిలో అంగరంగ వైభవంగా నిర్వహించను న్నారు. గద్దర్ పేరుతో ఇస్తున్న ఈ ఫిలిం అవార్డులకు సంబంధించిన పుబ్లిసిటీ పనులను ప్రభుత్వం మొదలు పెట్టింది. అక్కడక్కడా హోర్డింగ్స్ పెట్టదంతో పాటూ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్నారు. ఈ అవార్డుల లోగో ఎలా ఉంటుంది? అనే ఆసక్తి అందరిలోనూ ఉంది. ప్రభుత్వం చేస్తున్న పబ్లిసిటీని చూస్తుంటే ఫిలిం అవార్డు లోగోను కూడా ప్రచారంలోకి తీసుకొచ్చారు. ఒకచేతిలో కంజెరి ఉన్న లోగోను ప్రభుత్వం జనం ముందుకు తీసుకువచ్చింది. 2024 ఏడాదికి సంబంధించినంత వరకు వ్యక్తిగత అవార్డుకు కూడా ఇస్తున్నారు. గడచిన పదేళ్లలో ఒక్కో ఏడాదికి మూడు సినిమాల చొప్పున అవార్డులు ఇవ్వనున్నారు. దీంతో పాటే ఆరు జాతీయ అవార్డులు కూడా ప్రధానం చేస్తారు. ఎన్టీఆర్ జాతీయ అవార్డు, పైడి జయరాజ్ జాతీయ అవార్డు, బి ఎన్ రెడ్డి అవార్డు, నాగిరెడ్డి అండ్ చక్రపాణి అవార్డు, కాంతారావు అవార్డు, రఘుపతి వెంకయ్య అవార్డులను కూడా బహూకరిస్తారు. ఈ అవార్డుల వేడులను సక్సెస్ ఫుల్‌గా జరపడానికి సినిమా పరిశ్రమలో ముఖ్యులందరికి ఇప్పటికే ఆహ్వాన పత్రికలు చేరినట్టు తెలుస్తోంది. చాలా మంది సినిమా ప్రముఖులు తెలంగాణ గద్దర్ ఫిలిం అవార్డు వేడుకకు హాజరు కానున్నట్టు సమాచారం.



# 'సర్దార్ 2' షూటింగ్ పూర్తి

హీరో కార్తి తమిళం, తెలుగు భాషల్లో బ్లాక్ బస్టర్ హిట్ అయిన 'సర్దార్'కి సీక్వెల్ 'సర్దార్ 2'తో ప్రేక్షకులు ముందుకు రానున్నారు. ప్రీక్వెల్‌కి దర్శకత్వం వహించిన పిఎస్ మిత్రన్ సర్దార్2 కి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రిన్స్ పిక్చర్స్ నిర్మిస్తోంది. తాజాగా ఈ చిత్రం షూటింగ్ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా టీం అందరూ సెట్ లో కేక్ కట్ చేసి సెలబ్రేట్ చేసుకున్న ఫోటోలని మేకర్స్ షేర్ చేశారు. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి.ఈ చిత్రంలో మాళవిక మోహన్, ఆషికా రంగనాథ్, రజిషా విజయన్ ఫిమేల్ లీడ్స్‌గా నటిస్తుండగా ఎస్‌జె సూర్య ఓ పవర్ ఫుల్ పాత్రలో కనిపిస్తున్నారు.సర్దార్ 2 భారీ బడ్జెట్‌తో హ్యూజ్ స్కేల్ లోతెరకెక్కుతోంది. ఈ సినిమాకి టాప్ టెక్నిషియన్స్ పని చేస్తున్నారు. సర్దార్ 2 చిత్రానికి యువన్ శంకర్ రాజా సంగీతం అందించనున్నారు. జార్జ్ సి విలియమ్స్ ఫోటోగ్రఫీ డైరెక్టర్, దిలీప్ సుబ్బరాయన్ స్టంట్ డైరెక్టర్. రాజీవ్ నంబియార్ ప్రొడక్షన్ డిజైనర్.విజయ్ వేలుకుట్టి ఎడిటర్. AP పాల్ పాండి ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్. ఎ వెంకటేష్ సహ నిర్మాతగా, ఎస్. లక్ష్మ ణ్ కుమార్ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

# అలీ క్లాప్‌తో 'చండీ దుర్గమా'



నూతన నటీ నటులను పరిచయం చేస్తూ హెచ్‌బిజె క్రియేషన్స్, మదర్ అండ్ ఫాదర్ పిక్చర్స్ నిర్మిస్తున్న సినిమా 'చండీ దుర్గమా'. ఈ సినిమాకు జయశ్రీ వెల్ది నిర్మాత. ఒలి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మైను ఖాన్ ఎండీ దర్శకత్వం వహిస్తున్నారు. చండీ దుర్గమా సినిమా పూజా కార్యక్రమాలతో సోమవారం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ప్రముఖ కమెడియన్ అలీ ఈ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసి ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. కెమెరా స్విచ్ ఆన్ నటుడు చిట్టి చేయగా, ముహూర్తపు సన్నివేశానికి రఘు కారుమంచి దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా అలీ మాట్లాడుతూ చండీ దుర్గమా సినిమా ప్రారంభోత్సవానికి అతిథిగా రావడం సంతోషంగా ఉంది. అమ్మవారి కథతో వస్తున్న సినిమా కాబట్టి మంచి విజయం సాధించాలని కోరుకుంటున్నా అని అన్నారు. డైరెక్టర్ మైను ఖాన్. ఎండీ. మాట్లాడుతూ అమ్మవారి నేపథ్యంగా సినిమాలు రూపొందడం లేదు. సౌందర్య అమ్మోరు, విజయ శాంతి చండీ సినిమా తర్వాత అమ్మవారి కథతో సినిమా రాలేదు. ఇప్పటి ట్రెండ్‌కు అనుగుణంగా, ఈతరం ప్రేక్షకులకు నచ్చేలా డార్క్ థీమ్‌లో సరికొత్త స్క్రీన్ ప్లే, కాన్సెప్ట్‌తో చండీ దుర్గమా చిత్రాన్ని రూపొందిస్తున్నాం. ప్రస్తుతం థియేటర్స్‌కు ప్రేక్షకులు రావడం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో థియేటర్స్‌కు ఆడియెన్స్‌ను రప్పించేలా చండీ దుర్గమా సినిమా మేకింగ్ ను డిజైన్ చేస్తున్నామని చెప్పారు. నిర్మాత జయశ్రీ వెల్ది మాట్లాడుతూ అమ్మవారి నేపథ్యంతో ఒక మంచి కథతో చండీ దుర్గమా సినిమాను నిర్మించే అవకా శం రావడం అదృష్టంగా భావిస్తున్నా. మన తెలుగు ఆడియెన్స్ అమ్మవారి నేపథ్యంగా వచ్చిన చిత్రాలను ఎంతో ఆదరించారు. మా సినిమాకు కూడా అలాంటి సక్సెస్ ఇస్తారని ఆశిస్తున్నాం. హై క్వాలిటీ మేకిం గ్‌తో మంచి ప్యాడింగ్ ఆర్టిస్టులు, ప్రతిభ గల కొత్త నటీనటులతో చండీ దుర్గమా సినిమాను మీ ముందుకు తీసుకొస్తాం అన్నారు.త్వరలో నటీనటులను ప్రకటించనున్న ఈ చిత్రానికి ఎడిటింగ్, మ్యూజిక్ ఎంకే, సినిమాటోగ్రఫీ వైఎస్ కృష్ణ, కో ప్రొడ్యూసర్ ఒలి, ప్రొడ్యూసర్ జయ శ్రీ వెల్ది, రచన, దర్శకత్వం మైను ఖాన్ ఎండీ.

# అంచనాల్ని పెంచేసిన 'శంబాల' టీజర్



'ఈ విశ్వంలో అంతుపట్టని రహస్యాలెన్నో ఉన్నాయి.. సైన్స్‌కి సమాధానం దొరకనప్పుడు మూఢ నమ్మకం అంటుంది.. అదే సమాధానం దొరికితే అదే తన గొప్పదనం అంటుంది'. 'పంచ భూతాలని శాసిస్తోందంటే ఇది సాధారణమైనది కాదు. దీని ప్రభావం వల్ల మనం ఎలాంటి పరిస్థితుల్ని ఎదుర్కోవాల్సి వస్తుందో ఊహించలేం'. 'ఇప్పుడు ఈ రక్కసి క్రీడను ఆపాలంటే'.అంటూ వచ్చిన వాయిస్ ఓవర్.. చూపించిన డైలాగ్స్‌తో సినిమా రేంజ్ ఏంటో అందరికీ అర్థం అవుతోంది.అంటున్నాడు హీరో ఆది సాయికుమార్. షైనింగ్ పిక్చర్స్ బ్యానర్ పై రాజశేఖర్ అన్నభీమోజు, మహీధర్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి యుగంధర్ ముని దర్శకత్వం వశిస్తున్న శంబాలా టీజర్ సినిమాపై అంచనాలను పెంచిందని అది సాయికుమార్ అభిప్రాయం వ్యక్తం చేశారు.సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'శంబాల: ఎ మిస్టికల్ వరల్డ్. సినిమాను తెరకెక్కించారని చెప్పారు. ఈ చిత్రంలో అర్చన అయ్యర్, స్వాసిక, రవివర్మ, మధునందన్, శివకార్తీక్ వంటి వారు నటిస్తున్నారు. ప్రవీణ్ కే బంగారి అందించిన విజువల్స్, శ్రీచరణ్ పాకాల ఇచ్చిన బీజీఎం అన్నీ కూడా నెకట్స్ లెవెల్లో ఉన్నాయి. పాన్ ఇండియన్ మూవీకి సరిపడా సబ్జెక్ట్, కంటెంట్ ఉందని అర్థమవుతోంది. ఇందులో అంతరిక్షం నుంచి ఏదో ఒక అతీంద్రియ శక్తి ఉన్న ఉల్క, రాయి లాంటిది ఓ గ్రామంలో పడటం.. దాని ప్రభావంతో ఊర్లోని జనాలు చనిపోవడం, వింతగా ప్రవర్తించడం జరుగుతుంటుంది. దాన్ని ఛేదించేందుకు హీరో రావడం.. ఓ ఊరితో పోరాటం చేయడం వంటి ఆసక్తికరమైన అంశాలతో శంబాలను తెరకెక్కిస్తున్నామని దర్శకుడు యగందర్ చెప్పారు. ప్రస్తుతం ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌ను ప్రకటించనున్నారు.

# బ్రోకోడ్ చిత్రంతో హీరో, నిర్మాతగా రవి మోహన్



కోలీవుడ్‌లో రవి మోహన్‌కు ఉండే క్రేజ్ అందరికీ తెలిసిందే. ఇన్నేళ్లు హీరోగా అందరినీ మెప్పించిన రవి మోహన్ ఇకపై నిర్మాతగానూ ప్రేక్షకుల ముందుకు రానున్నారు. తాజాగా ఆయన హీరోగా, నిర్మాతగా రానున్న 'బ్రోకోడ్ చిత్రానికి సంబంధించిన అప్డేట్ ప్రకటించారు. 'డిక్కిలూనా', 'వడక్కుపట్టి రామసామి' వంటి చిత్రాలతో ప్రసిద్ధి చెందిన కార్తీక్ యోగి దర్శకత్వంలో ఈ 'బ్రోకోడ్ రానుంది. నలుగురు ప్రముఖ మహిళా నటులతో పాటు ప్రముఖ నటుడు ఎస్.జె. సూర్య కూడా ఈ చిత్రంలో ఒక ముఖ్యమైన పాత్రను పోషించనున్నారు. నలుగురు ప్రముఖ మహిళా నటీనటుల గురించి అధికారిక ప్రకటన త్వరలో వెలువడనుంది. ఈ చిత్రం షూటింగ్ సెప్టెంబర్‌లో ప్రారంభం కానుంది. రవి మోహన్ ప్రస్తుతం సుధా కొంగర దర్శకత్వం వహిస్తున్న 'పరాశక్తి', గణేష్ కె. బాబు డైరెక్ట్ చేస్తున్న 'కరాటే బాబు' చిత్రాలలో కూడా నటిస్తున్నారు.

# 20న '8వసంతాలు' విడుదల

నూతన నటి అనంతిక హీరోయిన్‌గా నటించిన వైవిధ్యమైన ప్రేమ కథ చిత్రం '8వసంతాలు'. ఫణింద్ర నరిసెట్టి దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో 'పరిచయమిలా' అనే పాటను ఈనెల 11న విడుదల చేయనున్నారు. మైత్రి మూవీస్ బ్యానర్ పై నిర్మితమవుతున్న ఈ సినిమాలో పాటను గేయ రచయిత వనమాలి రాయగా, హాయ్ నాన్న, ఖుషి ఫేం మలయాళ సంగీత దర్శకుడు హేశం అబ్దుల్ వాహబ్ సంగీతం అందిస్తున్నారు. వైవిధ్యమైన ప్రేమ కథ చిత్రాంగి నిర్మిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అన్ని పనులు పూర్తి చేసి జూన్ 20న థియేటర్లలో విడుదల చెయ్యడానికి సన్నాహాలు చేస్తున్నామని దర్శకుడు ఫణింద్ర నరిసెట్టి తెలిపారు. ఇతర పాత్రల్లో రవితేజ, హను రెడ్డి, కన్నా పసునూరి, సంజన, సమీర్ కోశోర్ , స్వరాజ్ రెబ్బ ప్రగాఢ తదితరులు నటిస్తున్నారు. ఈ మధ్య కాలంలో వచ్చిన ప్రేమ కథ చిత్రాలన్నిటిలో ఇది భిన్నంగా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ప్రతి ఫ్రేమును ఎంతో అందంగా తీర్చిదిద్దానని పేర్కొన్నారు.




# గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ ప్రపంచానికి మార్గదర్శకం

## కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్‌తో ప్రపంచవ్యాప్తంగా మిల్లెట్ల ప్రాముఖ్యతను పెంపొందించేందుకు ఇది మార్గదర్శకంగా పనిచేయనుందని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివ రాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. హైదరాబాద్‌లోని ఐసిఏఆర్ భారత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మిల్లెట్స్ రీసెర్చ్ (ఐసిఏఆర్ఐఐఎంఆర్) ప్రాంగణంలో సోమవారం గ్లోబల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఆన్ మిల్లెట్స్ (సిఒఈ) కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ సహాయ మంత్రి భగీరథ్ చౌధరి, తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తో కలి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిరుధాన్యాల పరిశోధన, అభివృద్ధి, శిక్షణ, ప్రాచుర్యం దిశగా కీలక మైలురాయిగా నిలవనుందన్నారు. కార్యక్రమంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, వ్యవసాయ పరిశోధకులు, శాస్త్రవేత్తలు, రైతులు ఇతర ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

**వ్యవసాయ రంగం బలోపేతానికి సహకరించాలి: మంత్రి తుమ్మల విజ్ఞప్తి**

తెలంగాణలో వ్యవసాయ రంగం బలోపేతానికి సహకారం అందించాలని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయ మంత్రి భగీరథ్ చౌధరిలకు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విజ్ఞప్తి చేశారు.భద్రాద్రి కొత్తగూడెంలో కొబ్బరి అభివృద్ధి బోర్డు ప్రాంతీయ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని, అదేవిధంగా ఆయిల్ పామ్ రైతులకు ఆయిల్ పామ్ గెలల కనిష్ఠ మద్దతు ధర రూ.25 వేలు గా నిర్ణయించాలని కోరారు.ఆయిల్ పామ్ విత్తనాల సరఫరాదారుల ఎంప్యానెల్మెంట్ ని ఏర్పాటు చేయాలిలని, ఆయిల్ పామ్ దిగుమతి సుంకం తగ్గింపు నిర్ణయాన్ని పునఃసమీక్షించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం (2014) లోని 13వ షెడ్యూల్ ప్రకారం తెలంగాణ రాష్ట్రానికి హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం హామీ ఇచ్చిందని ఈ సందర్భంగా మంత్రిగారు గుర్తుచేశారు. ఇందుకు సంబంధించి రూ.1823.20 కోట్ల బడ్జెట్‌తో ప్రాజెక్ట్ రిపోర్టు సమర్పించామని, అయితే ఇప్పటివరకు కేవలం రూ.135 కోట్లు మాత్రమే విడుదలయ్యాయని మంత్రి తెలిపారు. ప్రస్తుతం ఈ విశ్వవిద్యాలయం కనీస వసతులతో కొనసాగుతోందని, పూర్తిస్థాయిలో విద్యా, పరిశోధన, విస్తరణ సేవలు అందించేందుకు మిగతా నిధుల విడుదల అత్యవసరం అని కేంద్ర మంత్రికి వివరించారు. ఇందుకోసం రూ.100 కోట్లు తక్షణమే మంజూరు చేయాలని కోరారు. అన్ని అంశాలకు సంబంధించి కేంద్ర మంత్రులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు రెండు లేఖలను అందజేశారు.

# ఆర్‌టిసి ఉద్యమం ఉధృతం

## టిజిఎస్ ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి హెచ్చరిక



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఆర్‌టిసి ఉద్యోగులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం పట్ల ప్రభుత్వం టిజిఎస్ ఆర్‌టిసి కార్మికుల జెఎసి ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ నెల 5వ తేదీన జరిగిన కేబినెట్ సమావేశంలో ఆర్‌టిసి కార్మికుల సమస్యలను ప్రస్తావించకపోవడం, ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించడం పట్ల జెఎసి చైర్మన్ ఈదురు వెంకన్న, కో చైర్మన్ కె. హనుమంతు ముదిరాజ్, వైస్ చైర్మన్ ఎం.థామస్ రెడ్డి, కన్వీనర్ ఎండి మౌలానా, కో కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేశ్, బి.యాదగిరి ముక్తకంఠంతో ఖండించారు. ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి సోమవారం అజామాబాద్ పరిశ్రామిక వాడలోని ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయంలో సమావేశమైంది. ఈ సందర్భంగా జెఎసి నాయకులు మాట్లాడుతూ కార్మిక సమస్యలను పరిష్కరించకపోతే తమ ఉద్యమాన్ని ఉధృతం చేయడమే లక్ష్యంగా భవిష్యతు కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. అందులో భాగంగానే జెఎసిలో కలవని కార్మిక సంఘాలను కూడా తమలో భాగస్వామ్యం కావడానికి, ఉమ్మడి ఎజెండాతో, విశాల ఐక్యతతో ఒకే వేదిక ద్వారా ముందుకు పోవడానికి జూన్ 13వ తేదీన హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అన్ని ఆర్‌టిసి కార్మిక సంఘాలతో సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. అందుకు సంబంధించిన ఆహ్వాన లేఖలను అన్ని సంఘాల నాయకులకు అందజేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో ప్రస్తుతం జరుగుతున్న పరిణామాల గురించి చర్చించి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిచడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జెఎసి ప్రతినిధులు జె. రాఘవులు, ఎన్. కమలాకర్ గౌడ్, నరేందర్, రమేష్, మజీద్, బి. పాపయ్య, కె.ఎస్. పాల్, బి. శ్రీనివాస్, బి.కె. మూర్తి పాల్గొన్నారు.

# కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)

బియ్యం పంపిణీ చేసేవారు. ఈ నెలలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సాఫ్టవేర్‌తో కూడిన ఇ–పాస్ యంత్రాలు డీలర్లకు ఇచ్చారు. దీంతో బియ్యం పంపిణీకి ఒక్కో వ్యక్తికి సుమారు అరగంట సమయం పడుతోంది. గతంలో ఏనెలకు ఆ నెల కోటా బియ్యం మాత్రమే ఇచ్చేవారు. ఈ సారి ఎన్నడూ లేని విధంగా ప్రభుత్వం మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి ఇస్తుండడంతో లబ్ధిదారులు రేషన్ దుకాణాల వద్ద బారులు తీరుతున్నారు. దీంతో ఉదయం 6 గంటల నుంచే బస్తా సంచులు పట్టుకొని క్యూలో నిల్చుంటున్న పరిస్థితి ఏర్పడింది. దాదాపు అన్ని రేషన్ షాపుల వద్ద నీడ సరిగా లేకపోవడంతో ఎండలో ఉండాల్సి వస్తోంది. ఈ నెలాఖరు వరకు బియ్యం తీసుకునే అవకాశం కల్పించినా లబ్ధిదారులు ముందుగా తీసుకునేందుకే ఆసక్తి చూపుతున్నారు. ఆలస్యం అయితే బియ్యం ఉండవు అన్న ప్రచారంతో అందరూ ముందే తీసుకోవడానికి పోటీ పడుతున్నారు. దీంతో రేషన్ దుకాణాల వద్ద తీవ్రమైన రద్దీ ఉంటోంది. మరో వైపు మూడు నెలల బియ్యం కోటాను రేషన్ డీలర్లు డంప్ చేసుకునే స్థలం కూడా లేకపోవడంతో వారు సైతం ఇబ్బందులు పడుతున్నారు. షాపులో డంప్ చేసుకున్న బియ్యం పంపిణీ పూర్తి అయితేనే తిరిగి మిగిలిన బియ్యం కోటాను తెచ్చుకుంటున్నారు. కాగా, సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో షాపుల వద్ద జనం ఎగబడుతున్నారు.

**రేషన్ బియ్యం ఇవ్వడంలో ఆలస్యం**

మూడు నెలల బియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తుండటంతో ఒక్కో లబ్ధిదారుడు ఇ–పాస్ యంత్రాలపై మూడుసార్లు వేలి ముద్ర వేయాల్సి వస్తోంది. ఇలా ప్రతిసారి రేషన్ కార్డు నెంబరు నమోదు చేయాల్సి ఉంటుంది. బియ్యం కూడా మూడు సార్లు తూకం వేయాల్సి వస్తుండటంతో పంపిణీకి సమయం ఎక్కువగా పడుతోంది. గ్రామీణ ప్రాంతాల్లో సన్న బియ్యం కష్టాలు మరింత ఎక్కువగా ఉన్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఇంటర్‌నెట్ సరిగా లేక సర్వర్ మొరాయిస్తోంది. ఒక్కొక్కరికి అర గంట సమయం పడుతుండటంతో గంటల తరబడి రేషన్ షాపుల ముందు నిల్చోలేక లబ్ధిదారులు విసుగుచెందుతున్నారు. రేషన్ బియ్యం కోసం పనులు వదులుకోవాల్సి వస్తోందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మూడు నెలల బియ్యం ఒకేసారి ఇస్తుండటంతో పనులు వదులుకుని ఇబ్బంది అయినా తీసికొని వెళుతున్నారు. కొన్ని చోట్ల టోకెన్‌ల సిస్టం పెట్టి ఉదయం 20మందికి, సాయంత్రం 20 మందికి బియ్యం అందిస్తున్నారు. మూడు సార్లు వేలిముద్ర వేయడంతో చాలా సమయం పడుతోంది. సర్వర్ డౌన్ అయితే గంట వేచి ఉండాల్సి వస్తోంది.

**నెలాఖరు వరకూ బియ్యం పంపిణీ**

మూడు నెలలకు ఒకేసారి బియ్యం పంపిణీ చేపడుతుండటంతో ఇబ్బంది అవుతోందని, లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా సివిల్ సప్లై అధికారులు తెలిపారు. రేషన్ కార్డు ఉన్న ప్రతీ ఒక్కరికి తప్పకుండా బియ్యం అందజేస్తామని, రేషన్ దుకాణాల వద్ద వేచి ఉండకుండా టోకెన్లు అందజేసి క్రమ పద్ధతిలో సరుకులు అంద జేయాలని డీలర్లకు సూచించామని తెలిపారు. గతంలో ప్రతీ నెల 15 వరకు బియ్యం పంపిణీ చేసేవారని, కానీ, ఈసారి నెలాఖరు వరకు పంపిణీ చేస్తారని తెలిపారు

# అంతరిక్ష యాత్ర రేపు

(మొదటి పేజీ తరువాయి)

12వ తేదీన ఐఎస్ఎస్‌కు చేరుతుంది. అక్కడ సిబ్బంది మానవాళి కక్ష్య ప్రయోగశాలలో సుమారు 14 రోజుల పాటు గడుపుతారు. ఈ సుదీర్ఘ అంతరిక్ష బస యాదృచ్ఛికం కాదు. సూక్ష్మ గురుత్వాకర్షణ వాతావరణంలో పరిశోధనా అవకాశాలను పెంచుకోవడానికి, శాస్త్రీయ లక్ష్యాలను సాధించడానికి ఉన్న అచంచలమైన నిబద్ధతకు ఇది నిదర్శనం.

ఇలావుంటే, ఆక్సియమ్ మిషన్ 4లోని నలుగురు సభ్యుల సిబ్బందిలో శుభాంశు శుక్లా ఒకడు. ఈ యాత్రకు సారథ్యం వహించే కమాండర్ పెగ్గీ విట్సన్‌కు, నాసా మాజీ వ్యోమగామిగా, ఆక్సియమ్ స్పేస్ మానవ అంతరిక్ష ప్రయాణ డైరెక్టర్‌గా అపారమైన అనుభవం ఉంది. ఆమె మూడుసార్లు ఐఎస్ఎస్‌కు వెళ్లింది. కాగా, శుభాంశు శుక్లా ఈ చారిత్రక ప్రాజెక్టులో భాగస్వామి కావడం విశేషం. ఐఎస్ఎస్‌కు వెళ్లే మొదటి భారతీయ వ్యోమగామి అతనే అవుతాడు. 1984లో దిగ్గజ రాకేష్ శర్మ తర్వాత అంతరిక్షంలోకి వెళ్ళిన రెండవ భారతీయుడు కూడా అతనే. మానవ అంతరిక్ష ప్రయాణ కార్యక్రమం గగన్‌యాన్‌కు ఒక కీలకమైన సోపానం. అంతరిక్షంలో దీర్ఘకాల కార్యకలాపాలు, సిబ్బంది శిక్షణ, నిజమైన కక్ష్య వాతావరణంలో ఆరోగ్య పర్యవేక్షణ వంటి అంశాలపై ఇస్రోకు అమూల్యమైన అంతర్దృష్టులను పొందడానికి ఇది సహాయపడుతుంది. శుభాంశు శుక్లా ఉనికి భారతదేశ స్వావలంబనను, ప్రపంచ అంతరిక్ష సమాజంలో మన దేశానికి పెరుగుతున్న అనుసంధానాన్ని స్పష్టంగా సూచిస్తుంది. ఇది భారతీయులందరికీ ఓ గొప్ప స్ఫూర్తినిస్తుంది. ఈ విశిష్ట సిబ్బందిలో హంగేరీకి చెందిన మిషన్ స్పెషలిస్ట్ టిబోర్ కాపు కూడా ఉన్నారు. ఆయన హంగేరియన్ అంట్రోహాబ్ కార్యక్రమం కింద ఎంపికైన వ్యోమగామి. ఆయన ప్రయాణం 40 సంవత్సరాలకు పైగా హంగేరీ ప్రభుత్వం మద్దతుతో జరుగుతున్న మొదటి మానవ అంతరిక్ష ప్రయాణాన్ని సూచిస్తుంది. అలాగే పోలాండ్‌కు చెందిన యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఇవిస్ఎ) వ్యోమగామి మిషన్ స్పెషలిస్ట్ స్లావోస్జ్ ఉజ్నాన్స్కీ విస్నియెవ్స్కీ కూడా ఉన్నారు. ఆయన ఇఎస్ఏ మిషన్‌లో భాగంగా అంతరిక్షంలోకి వెళ్తున్నారు. ఇది 1978 తర్వాత పోలాండ్ మొదటి సిబ్బంది యాత్ర. వారి సమష్టి స్ఫూర్తికి, జాతీయ గర్వానికి చిహ్నంగా, సిబ్బంది 'జాయ్' నితమ జీరోగ్రావిటీ ఇండికేటర్‌గా ఎంచుకున్నారు. ఇది వారి స్ఫూర్తికి నిదర్శనం.



# సాంకేతికత ఆధారంగా వార్తా సేకరణ ఉండాలి

## మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/మేడ్చల్ ప్రతినిధి :** ఆధునిక సాంకేతిక యుగంలో వస్తున్న చరిత్రాత్మక మార్పులకు అనుగుణంగా సాంకేతిక ఆధారంగా తమ పాత్రికేయ వృత్తిలో రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలంగాణా మీడియా అకాడమి చైర్మన్ కె.శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. నాంపల్లిలోని మీడియా అకాడమి భవనంలో మేడ్చల్ జిల్లా పాత్రికేయులకు సోమవారం పారంభమైన రెండు రోజుల శిక్షణా తరగతుల కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్తా సేకరణలో సామాజిక ప్రభావం వంటి పలు అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయని, సాంకేతికను సమగ్రంగా తెల్సుకొంటేనే తమ వృత్తిని సులభంగా నెరవేర్చ గలుగుతారన్నారు. పాఠకుల వ్యక్తిగత అభిరుచులకు అనుగుణంగా వార్తలు ఉండాలని, తెలుగు వార్తలను సులువైన భాషలో రాయగలగాలని ఆయన సూచించారు. ప్రముఖ సంపాదకులు కె.శ్రీనివాస్ మాట్లాడుతూ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు మీడియా ధోరణులు, ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి సమగ్రంగా వివరించారు. యూట్యూబ్ లాంటి సోషల్ మీడియా రంగంలో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజలకు చేరుతున్నాయన్నారు. సీనియర్ పాత్రికేయులు మార్కండేయ మాట్లాడుతూ నూతన సాంకేతికను వినియోగించుకొని పాఠకులను ఆకర్షించే విధంగా వార్తలను సేకరించాలన్నారు. సీనియర్ జర్నలిస్టు గోవిందరెడ్డి మాట్లాడుతూ నేర వార్తల సేకరణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వీటికి సంంధించి చట్టాలపై ముందస్తుగా అవగాహన ఉండాలని, ఈ విషయంలో పాత్రికేయులు అనుసరించాల్సిన విధానాలను వివరించారు. నేర వార్తలు సమీకరించుకొనే ముం దు నిజ నిర్ధారణ చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మీడియా అకాడమి సెక్రటరి ఎన్.వెంకటేశ్వరరావు, మేనేజర్ శైలేశ్వర్‌రెడ్డి, మేడ్చల్ జిల్లా పాత్రికేయులు ఈ శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad - 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com